శుక్రవారం
12-04-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 290
పేజీలు : 10, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

ఇజ్రాయిల్ దాడిలో హమాస్ కీలకనేత కుమారుల మృతి

టెల్ అవివ్: ఉత్తర గాజా నగరం రఫాలో ఇజ్రాయిల్ జరిపిన వైమానిక దాడిలో హమాస్ కీలక నేత ఇస్మాయిల్ హనియా ముగ్గురు కుమారులు, ముగ్గురు మనవళ్లు ప్రాణాలు కోల్పోయారు. దీనిపై హనియా స్పందించారు. తీవ్ర పగ, ప్రతీకారాలతో తన ముగ్గురు పిల్లలను మరో ముగ్గురు మనవళ్లను ఇజ్రాయిల్ అత్యంత దారుణంగా హత్య చేసిందని ఇస్మాయిల్ హనియా తెలిపారు. చట్టాలను, విలువలను ఏ మాత్రం పట్టించుకోలేదని అన్నారు. జెరూసలెం, అల్ అక్సా మసీదును విముక్తి చేసే క్రమంలో తన కుమారులు అమరులయ్యారని అల్ జజీరా ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు. తన పిల్లలను హత్య చేసినంత మాత్రాన పలస్తీనా విషయంలో తన వైఖరి మారదని అన్నారు. హనియా కొన్నేళ్లుగా ఖతార్‌లో ప్రవాస జీవితం గడుపుతున్నారు.

కేజ్రీవాల్ వ్యక్తిగత కార్యదర్శిపై వేటు

న్యూఢిల్లీ: దిల్లీ మద్యం కేసులో అరెస్టయ్యి జైల్లో ఉన్న దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ వ్యక్తిగత కార్యదర్శి వైభవ్ కుమార్‌ను విధుల నుంచి తొలగించారు. అతడి నియామక ప్రక్రియలో నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు డిపార్ట్‌మెంట్ ఆఫ్ విజిలెన్స్ వెల్లడించింది. ఈ తొలగింపు తక్షణమే అమల్లోకి వస్తుందని స్పష్టం చేసింది. విధుల్లో ఉన్న ప్రభుత్వ ఉద్యోగిపై దాడి చేశాడని వైభవ్ కుమార్‌పై 2007లో నోయిడా పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే, కేజ్రీవాల్‌కు పీఎస్‌గా నియమించే సమయంలో ఈ కేసు వివరాలను వెల్లడించలేదని విజిలెన్స్ విభాగం దర్యాప్తులో తేలింది. దీంతో ఆయన్ను తక్షణమే విధుల నుంచి తొలగిస్తూ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. కాగా... మద్యం కేసుకు సంబంధించి ఏప్రిల్ 8న వైభవ్ కుమార్‌ను ఈడీ ప్రశ్నించింది. ఆ తర్వాత కొద్ది రోజులకే ఆయనపై వేటు వేయడం అనుమానాలకు తావిస్తోంది.

ఇది బీజేపీ కుట్రే: ఆప్

ఈ పరిణామాలపై ఆమ్ ఆద్మీ పార్టీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. తమ పార్టీని ఎలాగైనా ఇబ్బంది పెట్టాలనే బీజేపీ ఇలాంటి

- మిగతా 2 లో

వలంటీర్ రాజకీయం

- వైసీపీ వర్సెస్ ఎన్డీయే కూటమి
- అధికార పార్టీకి అనుకూల ప్రచారం
- అడ్డుకున్న టీడీపీ, జనసేన అభ్యర్థులు
- సేవలు పునరుద్ధరిస్తామన్న జగన్
- రూ.10 వేల వేతనం... చంద్రబాబు హామీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో వైసీపీ, ఎన్డీయే కూటమి పార్టీలు వలంటీర్ల ముసుగులో రాజకీయం చేస్తున్నాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారంలోకి రాగానే వలంటీర్లను పునరుద్ధరిస్తూ తొలి సంతకం చేస్తామని సీఎం జగన్ ప్రకటించారు. దానికి దీటుగా వలంటీర్లకు రూ.10 వేల వేతనం ఇస్తామని ఎన్డీయే కూటమి భాగస్వామ్య పార్టీ అయిన టీడీపీ అధినేత చంద్రబాబు భరోసా ఇచ్చారు. అటు వలంటీర్లు మూకుమ్మడిగా రాజీనామాలు చేయడం, అంతటితో ఆగకుండా వైసీపీకి అనుకూలంగా ఎన్నికల ప్రచారం నిర్వహించడం, వారిని ఎన్డీయే కూటమి అభ్యర్థులు అడ్డుకోవడం వివాదస్పదంగా మారింది. ఒక్క రోజులోనే కాకినాడ రూరల్, ఒంగోలు నియోజకవర్గాల్లో ఈ సంఘటనలు కొనసాగాయి. జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వలంటీర్ల వ్యవస్థను ప్రవేశపెట్టింది. ఎన్నికల కోడ్‌తో వారి సేవలను నిలిపివేయడంతో, తిరిగి అధికారంలోకి రాగానే వలంటీర్లను పునరుద్ధరిస్తానంటూ జగన్ ప్రకటించారు. ఎన్నికల ముందు అతి తక్కువ పోస్టులతో డీఎస్సీ ప్రకటించి, ఆ పరీక్షలను ప్రభుత్వం నిర్వహించలేకపోయింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఒక్క డీఎస్సీ ఇవ్వలేదు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించకుండా, అధికారంలోకి రాగానే వలంటీర్ల వ్యవస్థ పునరుద్ధరిస్తామంటూ జగన్ చేసిన వ్యాఖ్యలపై నిరుద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మొదటి నుంచి వలంటీర్ల వ్యవస్థపై టీడీపీ, జనసేన నేతలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఎన్నికలు దగ్గర పడటంతో మళ్లీ వలంటీర్ల ప్రస్తావన తెరపైకి వచ్చింది. ఈ సమయంలో ఇంటింటా వలంటీర్లు వెళ్లి పెన్షన్లు పంపిణీ చేస్తే, ఓటర్లను వలంటీర్లు ప్రభావితం చేస్తారని, ప్రభుత్వానికి అనుకూలంగా ప్రచారం చేయిస్తారన్న ఆందోళన ఎన్డీయే కూటమి అభ్యర్థులకు ఉంది. వారి ఆలోచనలకు తగిన విధంగా కేంద్ర ఎన్నికల సంఘానికి ఫోరమ్ ఫర్ సిటిజన్స్ తరపున నిమ్మగడ్డ రమేశ్‌కుమార్ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయడంతో వలంటీర్ల సేవలు నిలిచిపోయాయి. తద్వారా ఇంటింటా పెన్షన్ల పంపిణీపైనా అధికార వైసీపీ, టీడీపీలు పరస్పర విమర్శలకు దిగాయి. వలంటీర్ల సేవల లేమితో పెన్షన్లకు వృద్ధులు, దివ్యాంగులు ఇబ్బందులకు గురయ్యారు. ప్రతినెలా ఒకటో తేదీనే ఇంటింటా వలంటీర్లు పెన్షన్లు పంపిణీ చేసేవారు. మూడవ తేదీ నుంచి ఆరు వరకు కొనసాగడంతో మంటుటెండలో వృద్ధులు, దివ్యాంగులు గ్రామ, వార్డు సచివాలయాలకు వెళ్లి నానా ఇబ్బందులకు గురయ్యారు. ఈ ప్రభావంతో 25 మందికిపైగా వృద్ధులు చనిపోయారు. దీనికి కారణం చంద్రబాబేనంటూ వైసీపీ ప్రచారం చేయగా, దానిని టీడీపీ నేతలు తిప్పికొట్టారు. జగన్ ప్రభుత్వం చేతగాని తనంతోనే పెన్షన్లు ఇవ్వలేకపోయిందని, నిధులను పక్కదారి పట్టించిందని టీడీపీ బలంగా ఆరోపించింది. వలంటీర్ల రాజీనామాల పర్వం ప్రారంభమైంది. తమను వృద్ధులకు పెన్షన్లు ఇవ్వకుండా అడ్డుకోవడం కలచివేచిందన్న నెపంతో వారి రాజీనామాలు చేసినట్లు చెబుతున్నారు. గతంలో తమపై జనసేన అధినేత పవన్ కల్యాణ్ చేసిన అనుచిత వ్యాఖ్యల్ని గుర్తుచేస్తున్నారు. యువతకుల కిడ్నాప్‌లకు వలంటీర్లే కారణమని పవన్ చేసిన వ్యాఖ్యలపై మండిపడుతున్నారు. దానికితోడు తాము మూటలు మూసేవాళ్లమంటూ చంద్రబాబు మాట్లాడారని తెలుపుతున్నారు. ఇంత అవమానించి, అధికారంలోకి రాగానే రూ.10 వేల వేతనం పెంచుతామని వాగ్దానాలు చేసిన వాటిని నమ్మడం లేదని చెబుతున్నారు. తమకు జరిగిన అవమానాన్ని నిరసిస్తూ రాజీనామాల బాట పట్టారు. దీని తెరచాటున వైసీపీ నేతలున్నారన్న ప్రచారముంది.

ఇప్పటికే తూర్పుగోదావరి జిల్లాల్లో వైసీపీ అభ్యర్థులకు అనుకూలంగా ప్రచారం నిర్వహిస్తున్న వారిపై కేసులకు ఎన్నికల సంఘం ఆదేశించింది. దీంతో చేసేదేమీ లేక రాష్ట్ర వ్యాప్తంగా చాలా జిల్లాల్లో వలంటీర్లు మూకుమ్మడిగా రాజీనామాలు చేశారు. అంతటితో వలంటీర్లు ఆగకుండా, తాము వైసీపీకి పనిచేస్తామంటూ కవ్వింపు చర్యలకు దిగడం ఎన్డీయే కూటమి పార్టీలకు మింగుడుపడటం లేదు. దాదాపు నాలుగున్నరేళ్ల నుంచి వలంటీర్లు సేవలు అందిస్తున్నారు. వారి దగ్గర సమగ్ర సమాచారం ఉంటుంది. దీంతో వలంటీర్లు అంటేనే ప్రజలు ఒక ప్రభుత్వ ప్రతినిధిగా భావిస్తారు. రాజీనామాలు చేసిన వలంటీర్లు వైసీపీకి అనుకూలంగా ప్రచారానికి రావడంతో రాజకీయంగా వివాదస్పదమైంది. ఇందుకు ఒంగోలులో టీడీపీ, వైసీపీ నేతల మధ్య ఘర్షణకు దారితీసిన సంఘటన నిదర్శనంగా నిలిచింది. ఒంగోలులో వైసీపీ నేతలతో కలసి రాజీనామా చేసిన వలంటీర్ ఇంటింటా తిరగడంతో టీడీపీ నేతలు ఆమెను అడ్డుకున్నారు. టీడీపీ, వైసీపీ నేతల మధ్య ఘర్షణకు దారితీసింది. సేవాతత్వంతో

- మిగతా 2 లో

కవితను అరెస్టు చేసిన సీబీఐ

- కోర్టును ఆశ్రయించిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ
- అత్యవసర విచారణకు జడ్జి నిరాకరణ

న్యూఢిల్లీ: దిల్లీ మద్యం కుంభకోణం కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈడీ అరెస్టు చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు మరో ఎదురు దెబ్బ తగిలింది. ఇప్పటికే ఈడీ కేసులో జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న ఆమెను, గురువారం సీబీఐ అరెస్టు చేసింది. తీహార్ జైలులో ఉన్న కవితను సీబీఐ అధికారులు అరెస్టు చేశారు. ఇదే కేసులో గతంలో కవితను సీబీఐ హైదరాబాద్‌లో ప్రశ్నించింది. ఆ తర్వాత ఈ నెల 6వ తేదీన తీహార్ జైలులోనే మరోసారి ప్రశ్నించింది. కవితను ప్రశ్నించేందుకు రౌస్ అవెన్యూ సీబీఐ ప్రత్యేక కోర్టు అనుమతి తీసుకున్న సీబీఐ అధికారులు, శుక్రవారం తమ కేంద్ర కార్యాలయానికి తరలించనున్నారు. కవితను కోర్టులో హాజరుపరిచి రిమాండ్ రిపోర్టును సీబీఐ సమర్పించనుంది. కాగా సీబీఐ అరెస్టు చేయడాన్ని నిరాకరిస్తూ కవిత రౌస్ అవెన్యూ కోర్టును ఆశ్రయించారు. సీబీఐ అరెస్టుపై అత్యవసరంగా సీబీఐ ప్రత్యేక కోర్టు జడ్జి మనోజ్ కుమార్ బెంచ్ ముందు పిటిషన్ దాఖలు చేశారు. ఎటువంటి నోటీసు ఇవ్వకుండా కవితను సీబీఐ అరెస్ట్ చేసిందని కవిత తరఫు న్యాయవాదులు రాణా, మోహిత్ రావు వాదనలు వినిపించారు. అయితే ఈ న్యాయస్థానం తన ఎదుట మద్యం కేసుకు సంబంధించిన వాదనలు జరగలేదని జడ్జి మనోజ్ కుమార్ తెలిపారు. ఈ కేసులో ఎలాంటి ఉపశమనం ఇవ్వలేనని చెప్పారు. సీబీఐ కేసు గురించి ఎలాంటి సమాచారం లేదన్న కోర్టు అత్యవసర జడ్జిమెంట్లపై మాత్రమే వాదనలు జరుగుతున్నాయని తెలిపింది. శుక్రవారం ఉదయం 10 గంటలకు రెగ్యులర్ కోర్టు ముందు పిటిషన్ దాఖలు

- మిగతా 2 లో

రైతుపై పాలకుల నిర్లక్ష్యం

- ప్రపంచవ్యాప్తంగా అన్నదాతల ఉధృత ఉద్యమాలు
- ఏఐకేఎస్ జాతీయ అధ్యక్షుడు రావుల వెంకయ్య

సెనెగల్ (దక్షిణాఫ్రికా): ప్రపంచవ్యాప్తంగా పాలక ప్రభుత్వాలు రైతు సమస్యలు పట్టించుకోవడం లేదని, అందుకే రైతులు తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రోడ్లెక్కి ఉధృతంగా ఉద్యమాలు కొనసాగిస్తున్నారని అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) జాతీయ అధ్యక్షుడు రావుల వెంకయ్య అన్నారు. దక్షిణాఫ్రికాలోని సెనెగల్‌లో ఈనెల 8 నుంచి 14వ తేదీ వరకు జరగనున్న టీయూఐ వ్యవసాయ, ఆహార, వాణిజ్య, అనుబంధ పరిశ్రమల ఐదవ అంతర్జాతీయ సదస్సులో రావుల వెంకయ్య పాల్గొన్నారు. వివిధ దేశాల ప్రతినిధులను ఉద్దేశించి రావుల వెంకయ్య మాట్లాడుతూ అనేక దేశాల్లో రైతుల మిలిటెంట్ ఉద్యమాలు జరుగుతున్న వేళ ఇక్కడ ఈ సమావేశం జరుగుతుందన్నారు. భారత్, నేపాల్, శ్రీలంక, మలేసియా, అర్జెంటీనా, వెనిజులా, మెక్సికో, కొలంబియా, కెన్యా, నైజీరియా, కామరూన్‌తో పాటు ఫ్రాన్స్, జర్మనీ, స్పెయిన్, ఇటలీ, గ్రీస్, రొమేనియా, బల్గేరియా, పోలెండ్ సహా ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల్లో రైతులు తమ సమస్యల పరిష్కారం కోసం పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తున్నారని తెలిపారు. ఇటీవల మార్చి 26, 2024న బ్రస్సెల్స్‌లో యూరప్ రైతులు వీధుల్లోకి వచ్చి ఉద్యమాలు చేపట్టారని గుర్తు చేశారు. వేలాది ట్రాక్టర్లతో వచ్చిన

- మిగతా 2 లో

మోదీ, జగన్ మైండ్‌గేమ్

- ఎన్నికల్లో లబ్ధికోసం నాటకాలు
- బీజేపీ సర్కారు అన్నిరంగాల్లో విఫలం
- ఇండియా కూటమి అభ్యర్థుల గెలుపుతోనే అభివృద్ధి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర-విశాఖ: రానున్న ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ప్రధాని నరేంద్రమోదీ, ఏపీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మైండ్‌గేమ్‌కు తెరతీశారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. అందులో భాగంగా బీజేపీకి సొంతంగా 370 స్థానాలు, ఎన్డీఏ కూటమికి 400 స్థానాలు వస్తాయంటూ మోదీ...వై నాట్ 175 అంటూ సీఎం జగన్ నాటకాలాడుతున్నారని చెప్పారు. విశాఖలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రామకృష్ణ మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో దేశ రాజకీయాలపై మన రాష్ట్రంలో పెద్దగా చర్చ జరగకపోవడం

- మిగతా 2 లో

నేడు ఇంటర్ ఫలితాలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్ ఇంటర్ ఫలితాలను శుక్రవారం ఉదయం 11 గంటలకు విడుదల చేయనున్నారు. పరీక్షలు ముగిసిన 22 రోజుల్లోనే రికార్డు స్థాయిలో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాలను ప్రకటించనున్నారు. ఈ ఏడాది మార్చి ఒకటి నుంచి 20 వరకు ఇంటర్ వార్షిక పరీక్షలను ప్రత్యేక బార్ కోడ్‌తో నిర్వహించారు. పరీక్షలు పూర్తయిన వెంటనే మూల్యాంకనాన్ని వేగవంతంగా ప్రారంభించి, ఈనెల నాల్గవ తేదీతో ముగించారు. అనంతరం మరోసారి మూల్యాంకనాన్ని సరిచూసి, మార్కుల జాబితాలను పరిశీలించి ఫలితాల విడుదల కోసం రాష్ట్ర ఎన్నికల సంఘానికి అనుమతి కోసం లేఖ రాశారు. ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్షలకు 5,17,570 మంది, ద్వితీయ సంవత్సర పరీక్షలకు 5,35,865 మంది విద్యార్థులు హాజరయ్యారు. అతి తక్కువ సమయంలో పరీక్షా ఫలితాలను విడుదలకు బోర్డు అధికారులు సిద్ధమయ్యారు.

రూ.100 కోట్ల విలువైన సొత్తు స్వాధీనం

సీఈఓ ముకేశ్‌కుమార్ మీనా

విశాలాంధ్ర-సింగరాయకొండ : ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన గత నెల 16వ తేదీ నుండి రాష్ట్రవ్యాప్తంగా రూ.100 కోట్ల విలువైన డబ్బు, మద్యం, ఇతర వస్తువులను సీజ్ చేసినట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) ముకేశ్‌కుమార్ మీనా వెల్లడించారు. గురువారం ఆయన ప్రకాశం జిల్లాలో పర్యటించి జిల్లా సరిహద్దులలో ఏర్పాటు చేసిన చెకోపోస్ట్‌ల వద్ద తనిఖీలు జరుగుతున్న తీరును పరిశీలించారు. ముందుగా 16వ నెంబర్ జాతీయ రహదారిపై గుంటూరు వైపు నుంచి ప్రకాశం జిల్లాలోకి ప్రవేశించే వాహనాలను తనిఖీ చేయడానికి మద్దిపాడు మండలం గుండ్లపల్లి వద్ద ఏర్పాటు చేసిన చెకోపోస్టు, అనంతరం సింగరాయకొండ మండలం పాత సింగరాయకొండ వద్ద నెల్లూరు వైపు నుంచి ప్రకాశం జిల్లాలోకి ప్రయాణించే వాహనాల తనిఖీకి ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును పరిశీలించారు. ఈ మార్గంలో వస్తున్న వాహనాలను తనిఖీ, ఈ ప్రక్రియను వీడియో రికార్డింగ్ చేస్తున్న విధానంపై చెక్‌పోస్ట్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు సీజ్ చేసిన నగదు, ఇందుకు సంబంధించి నిర్వహిస్తున్న రికార్డులను ఆయన తనిఖీ చేశారు. ఎన్నికల దృష్ట్యా అనుమానాస్పద వాహనాలన్నింటినీ క్షుణంగా తనిఖీ చేయాలని ఆయన స్పష్టం చేశారు. మహిళా ప్రయాణికుల బ్యాగులను మహిళా సిబ్బందితోనే తనిఖీ

- మిగతా 2 లో

ఇదీ లోకం!

బీసీలకు 50 ఏళ్లకే పింఛన్

- స్థానిక సంస్థలో 34శాతం రిజర్వేషన్
- పి గన్నవరం సభలో చంద్రబాబు హామీ
- దళితులకు జగన్ అన్యాయం చేశారని మండిపాటు



విశాలాంధ్ర - అమలాపురం/అంబాజీపేట: జగన్ పాలనలో దళితులకు తీవ్ర అన్యాయం జరిగిందని టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ధ్వజమెత్తారు. కులాంతర వివాహాలకు ప్రోత్సాహకాలు ఒక రూపాయి కూడా అందివ్వలేదన్నారు. విదేశీ విద్యకు అంబేద్కర్ పేరు తొలగించి జగన్ పేరు పెట్టడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. దళితులకు ఇన్నోవా కార్లు ఇచ్చి పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దిన ఘనత తెలుగుదేశం పార్టీకి దక్కుతుందన్నారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా పి గన్నవరం నియోజకవర్గం అంబాజీపేట సెంటర్‌లో గురువారం సాయంత్రం జరిగిన ఎన్నికల ప్రచార సభలో జనసేన అధినేత పవన్ కల్యాణ్, టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు పాల్గొని ప్రసంగించారు. చంద్రబాబు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఎస్సీలకు ప్రవేశపెట్టిన 27 సంక్షేమ పథకాలను రద్దు చేసిన ఘనత జగన్‌మోహన్ రెడ్డికి దక్కుతుందని ఎద్దేవా చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో దళితులు తమకు జరిగిన అన్యాయాలను నోరు విప్పి చెప్పడానికి భయపడుతున్నారన్నారు. 188 మంది దళితులను చంపేసిన చరిత్ర జగన్మోహన్ రెడ్డిదని ఆరోపించారు. తూర్పుగోదావరి జిల్లాలో ఓ ఎమ్మెల్సీ తన డ్రైవర్ను చంపి డోర్ డెలివరీ చేసిన ప్రభుత్వం ఇది కాదా అని ప్రశ్నించారు. రానున్న ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో మాల, మాదిగలకు సామాజిక న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే మూడు ఎమ్మెల్యే స్థానాలు, ఒక ఎంపీ స్థానం ఇచ్చామని అన్నారు. మాదిగలకు ఒక ఎమ్మెల్సీ ఇస్తామని అందరికీ సమ న్యాయం బాధ్యతగా తీసుకుంటామన్నారు. వైసీపీ నాయకులు కోనసీమ జిల్లాలో ఎస్సీలకు ఇతర కులాల మధ్య చిచ్చుపెట్టి చలికాచుకున్నారని గుర్తు చేశారు. తమ ప్రభుత్వం ఏర్పాటు చేసిన వెంటనే తొలి సంతకం మెగా డీఎస్సీ పై చేస్తామని చెప్పారు. గోదావరి నది తీరంలో జన గర్జన జగన్ పై వ్యతిరేకతకు నిదర్శనమని ఆయన అన్నారు. పి గన్నవరం నియోజకవర్గ కూటమి అభ్యర్థి గిడ్డి సత్యనారాయణ, అమలాపురం పార్లమెంటరీ నియోజవర్గ టీడీపీ అభ్యర్థి గంటి హరీష్ మాధుర్‌లను

- మిగతా 2 లో

శత్రు దేశాలు కవ్విస్తే యుద్ధం తప్పదు

కిమ్ జోంగ్ ఉన్ సంచలన వ్యాఖ్యలు

ప్యోంగ్యాంగ్: శత్రు దేశాలు యుద్ధ కవ్వింపు చర్యలకు పాల్పడితే ఎలాంటి సంకోచం లేకుండా యుద్ధం చేయడానికి ఉత్తర కొరియా సిద్ధంగా ఉందంటూ ఆ దేశ అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ మేరకు స్థానిక మీడియా వెల్లడించింది. ఉత్తర కొరియాలోని కిమ్ జోంగ్ ఇల్ మిలిటరీ యూనివర్సిటీని బుధవారం ఆయన సందర్శించారుజ. ఈ యూనివర్సిటీ కిమ్ తండ్రి పేరు మీద 2011లో నెలకొల్పారు. యూనివర్సిటీ సందర్శన సమయంలో విద్యార్థులు ఏర్పాటుచేసిన కార్యక్రమంలో కిమ్ జోంగ్ ఉన్ ప్రసంగించారు. 'దేశం చుట్టూ అంతర్జాతీయంగా క్లిష్టమైన పరిస్థితులు ఉన్నాయి. ఈ సమయంలో దేశంలో నెలకొన్న అస్థిరమైన పరిస్థితుల నడుమ యుద్ధం తప్పదు. శత్రు దేశాలు యుద్ధ కవ్వింపు చర్యలకు పాల్పడితే ఎలాంటి సంకోచం లేకుండా యుద్ధం చేయడానికి ఉత్తర కొరియా సిద్ధంగా ఉంది' అని కిమ్ స్పష్టం చేశారు. కాగా, ఉత్తర కొరియా రాజకీయంగా, ఆయుధ తయారీలో రష్యాతో సంబంధాలు కొనసాగిస్తోంది. ఉక్రెయిన్‌తో యుద్ధం చేస్తున్న రష్యాకు వ్యూహాత్మక మిలిటరీ ప్రాజెక్టుల్లో కొరియా సాయపడుతోంది. ఇటీవల కొరియా ఘన ఇంధనంతో మధ్యశ్రేణి సూపర్ సోనిక్ బాలిస్టిక్ మిసైల్‌ను ప్రయోగించింది. అయితే ఇది ద్రవ ఇందనంతో పోల్చితే చాలా శక్తిమంతమైందని నిపుణులు చెబుతున్నారు. తరచూ అమెరికా, దక్షిణ కొరియా తమ సైనిక విన్యాసాలతో ఉత్తర కొరియాను కవ్విస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఉత్తర కొరియా సరిహద్దుల్లో యుద్ధ వాతావరణం నెలకొంది.

దక్షిణ కొరియాలో ప్రతిపక్ష పార్టీ విజయం

దక్షిణ కొరియాలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో అధికార పార్టీకి ఎదురుదెబ్బ తగిలింది. బుధవారం జరిగిన జాతీయ అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం 254 స్థానాలకుగాను ప్రధాన ప్రతిపక్షం డెమొక్రటిక్ పార్టీ 161 స్థానాల్లో విజయం సాధించగా... అధికార పీపుల్ పవర్ పార్టీ కేవలం 90 స్థానాలకే పరిమితమైంది. బుధవారం జరిగిన పోలింగ్ లో 67 శాతం మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. దక్షిణ కొరియాలో గత 32 సంవత్సరాలలో సాధారణ ఎన్నికలలో ఇదే అత్యధిక ఓటింగ్ శాతం. అధికారిక ఫలితాలు వెలువడిన తర్వాత ఎన్నికల్లో ఓటమికి బాధ్యత వహిస్తూ పీపుల్ పవర్ పార్టీ నాయకుడు హాన్ డాంగ్ హూన్ రాజీనామా చేశారు. సియోల్‌లోని పీపీపీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ప్రజా తీర్పును గౌరవిస్తున్నానని తెలిపారు. ఎన్నికల ఫలితాలకు పూర్తి బాధ్యత వహిస్తానని చెప్పారు. ఈ క్రమంలోనే ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్ యుద్ధం తప్పదంటూ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.

వియత్నాం బిలియనీర్‌కు మరణదండన

హనోయ్: వియత్నాంకు చెందిన ప్రముఖ్య రియల్ ఎస్టేట్ వ్యాపారవేత్త, బిలియనీర్ ట్రూంగ్ మైలాన్‌కు మరణశిక్ష విధించారు. మల్టీ బిలియన్ డాలర్ల మోసం కేసులో ఆమెకు ఈ శిక్షను ఖరారు చేశారు. ఆ దేశంలోని ప్రఖ్యాత డెవలపర్ 'వాన్ థిన్ ఫాట్' కంపెనీకి మైలాన్ అధిపతిగా ఉన్నారు. గత దశాబ్దకాలం నుంచి సైగాన్ కమర్షియల్ బ్యాంక్(ఎస్‌సీబీ)ను మోసగించి రుణాల పేరుతో ఆమె పెద్ద మొత్తంలో నగదు తీసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. సుమారు 12.5 బిలియన్ల డాలర్లు బ్యాంకుల నుంచి తీసుకున్నట్లు ఆమెపై కేసు ఉంది. అయితే కుంభకోణం మొత్తం దాదాపు 27 బిలియన్ల డాలర్లు ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఈ మొత్తం ఆ దేశ జీడీపీలో ఆరు శాతం అని తేలింది. ఈ మోసం కేసులో అనేక మంది అధికారులు కూడా ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. హాంగ్‌కాంగ్‌కు చెందిన సంపన్న వ్యాపారవేత్తను మైలాన్ వివాహం చేసుకున్నారు. అయితే అతను కూడా ఈకేసులో విచారణ ఎదుర్కొంటున్నారు. నకిలీ రుణ దరఖాస్తులతో ఎస్సీబీ బ్యాంకు నుంచి భారీగా డబ్బును విత్‌డ్రా చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ట్రూంగ్ మై లాన్‌కు స్థానిక ఈ బ్యాంకులో దాదాపు 90శాతం వాటా ఉంది. కొన్నేళ్లుగా ఈ బ్యాంకులో ఆమె మోసాలకు పాల్పడ్డారు. 2018 నుంచి 2022 మధ్య 916 నకిలీ దరఖాస్తులు సృష్టించి బ్యాంకు నుంచి 304 ట్రిలియన్ డాంగ్ (వియత్నాం కరెన్సీ)లు తీసుకున్నట్లు అధికారులు గుర్తించారు. అంటే 12.5 బిలియన్ డాలర్లకు పైమాటే. 2019-22 మధ్య ఆమె డ్రైవర్ బ్యాంకు హెడ్‌క్వార్టర్స్ నుంచి 4.4 బిలియన్ డాలర్ల నగదును లాన్ నివాసానికి తరలించినట్లు అధికారులు వెల్లడించారు. 2022లో ఈ కుంభకోణం బయటపడగా అదే ఏడాది అక్టోబరులో పోలీసులు ఆమెను అరెస్టు చేశారు.

లోయలో పడ్డ బస్సు: 17 మంది దుర్మరణం

కరాచీ: పాకిస్థాన్‌లో జరిగిన ఘోర ప్రమాదంలో 17 మంది ప్రాణాలు కోల్పోయారు. బుధవారం రాత్రి ప్రమాదవశాత్తు బస్సు లోయలో పడిన ఘటనలో మరో 38 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదం బలూచిస్థాన్ ప్రావిన్స్‌లో జరిగింది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకున్నారు. మృతదేహాలను స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం కోసం ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రులను చికిత్స కోసం కరాచీలోని సివిల్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు పలువురు ముస్లిం యాత్రికుల బృందంతో ఓ బస్సు తట్ట ప్రాంతం నుంచి బయలుదేరింది. వీరంతా రంజాన్ పండుగను పురస్కరించుకొని బలూచిస్థాన్ ప్రావిన్స్ ఖుజ్దార్ జిల్లాలోని ఉన్న మారుమూల సూఫీ పుణ్యక్షేత్రం షా నూరానీ దర్శనం కోసం వెళ్తున్నారు. రాత్రి 8 గంటల ప్రాంతంలో వీరి బస్సు సింధ్-బలూచిస్థాన్ ప్రావిన్సుల సరిహద్దు పట్టణ సమీపంలోకి చేరుకుంది. ఈ క్రమంలోనే వీరు ప్రయాణిస్తున్న బస్సు ప్రమాదానికి గురైనట్లు పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదంపై పాకిస్థాన్ మంత్రి మోహసిన్ నఖ్వీ విచారం వ్యక్తం చేశారు.

రూ.100 కోట్ల విలువైన సొత్తు స్వాధీనం

(మొదటిపేజీ తరువాయి)

చేయించాల్సి ఉంటుందన్నారు. తగిన ఆధారాలు లేకుండా రూ.50వేలకు మించి ఎక్కువగా నగదు దొరికితే సీజ్ చేసి, ట్రెజరీలో జమ చేయాలని అధికారులకు చెప్పారు. జిల్లాలోని చెక్ పోస్టులు పనిచేస్తున్న తీరుపై సీఈఓ సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లా ఎన్నికల అధికారులతోపాటు కమాండ్ కంట్రోల్ రూములు, చెక్ పోస్టుల పనితీరును పరిశీలించి అవసరమైన సూచనలు చేయడానికి ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాలలో రెండు రోజుల పాటు తాను పర్యటిస్తున్నట్లు తెలిపారు. సీఈఓ వెంట కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి దినేశ్ కుమార్, ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్, సంతనూతలపాడు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఆర్.గోపాలకృష్ణ, కొండపి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి శ్రీకుమార్, కందుకూరు సబ్ కలెక్టర్ విద్యాధరి, కావలి ఆర్డీఓ సీనానాయక్ , స్థానిక ఏఆర్‌ఓ లు, ఇతర అధికారులు ఉన్నారు.

కేజ్రీవాల్ వ్యక్తిగత కార్యదర్శిపై వేటు

(మొదటిపేజీ తరువాయి)

కుట్రలు పన్నుతోందని విమర్శించింది.'మొదట తప్పుడు కేసులో సీఎంను అరెస్టు చేశారు. ఇప్పుడు ఆయన వ్యక్తిగత కార్యదర్శి సహా కేజ్రీవాల్ సిబ్బంది మొత్తాన్ని తొలగించే పని మొదలుపెట్టారు. ఆప్‌ను నాశనం చేయడమే భాజపా ఏకైక లక్ష్యమని మరోసారి స్పష్టమైంది' అని ఆప్ మండిపడింది.

మోదీ, జగన్ మైండ్‌గేమ్

(మొదటిపేజీ తరువాయి)

దురదృష్టకరమన్నారు. వచ్చే ఎన్నికల్లో తామే గెలుస్తామని, హ్యాట్రిక్ కొడతామని మోదీ ఊదరగొడుతున్నారని, కానీ 2014, 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుపై ఏమాత్రం నోరుమెదడం లేదని ఆరోపించారు. మోదీ హయాంలో దేశం ఏ రంగంలోనూ పురోగతి సాధించలేదని, విఫల ప్రధానిగా మోదీ నిలిచిపోయారని విమర్శించారు. సీఎస్‌డీఎస్ లోక్ నీతి ప్రీపోల్ సర్వే ప్రకారం పట్టణాల్లో 65 శాతం మంది నిరుద్యోగ సమస్య ఎదుర్కొంటున్నారని, నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయని 71 శాతం ప్రజలు అభిప్రాయపడుతున్నారని, ధరల పెరుగుదల వల్ల బతకడం కష్టంగా ఉన్నట్లు 75 శాతం దళిత, గిరిజన, మైనారిటీలు పేర్కొన్నట్టు రామకృష్ణ తెలిపారు. ఏ దేశంలోనూ లేని విధంగా ఏడాది కాలం రైతులు దిల్లీ సరిహద్దుల్లో పోరాటం చేశారన్నారు. అన్నింటా మోదీ విఫలమయ్యారన్నారు. ఈడీ, సీబీఐ, సీబీఐ, ఐటీ సంస్థలను తన గుప్పెట్లో పెట్టుకుని ప్రతిపక్ష పార్టీల నేతలను జైలుకు పంపుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్‌తో సీట్ల సర్దుబాటు కారణంగానే దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను జైలుకు పంపారని, అందుకు రూ.100 కోట్ల మద్యం కుంభకోణం అంటూ సాకు చెబుతున్నారన్నారు. ఏపీలో వేల కోట్ల మద్యం కుంభకోణం జరుగుతోందని కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు స్వయంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. బీజేపీకి వంతపాడితే ఒకలా...వ్యతిరేకిస్తే మరోలా ప్రధాని మోదీ వ్యవహరిస్తున్నారన్నారు. మోదీకి జగన్, చంద్రబాబు, పవన్ కల్యాణ్ భజన చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర ప్రయోజనాలపై నోరు విప్పకపోగా...బీజేపీ దుశ్చర్యలను సైతం ఖండించలేదని దుస్థితిలో ఆ ముగ్గురు నాయకులు ఉన్నారన్నారు. మోదీ మరోసారి అధికారంలోకి వస్తే ప్రాంతీయ పార్టీలు దుకాణాలు మూసుకోవాల్సిందేనని, రాజ్యాంగం, లౌకికవాదం పదాలు కూడా వినలేమని హెచ్చరించారు. సీఎం జగన్ నియంతృత్వ పాలన సాగిస్తున్నారని, రాష్ట్రాన్ని ఐదుగురి చేతుల్లో పెట్టారని ఆరోపించారు. ఈ ఎన్నికల్లో ఇండియా కూటమి అభ్యర్థులకు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు.

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను ఆపుతామంటూ కేంద్ర మంత్రివర్గంలో తీర్మానం చేయకుండా...ఎన్నికల్లో లబ్ధి కోసం బీజేపీ కొత్త నాటకానికి తెరతీసిందని విమర్శించారు. విశాఖ ఉక్కును ప్రైవేటీకరిస్తామని పార్లమెంటులో అనేకసార్లు చెప్పారని, ఇప్పుడు మాత్రం ప్రైవేటీకరణ లేదంటూ సన్నాయి నొక్కులు నొక్కుతున్నారని మండిపడ్డారు. సమావేశంలో సీపీఐ పశ్చిమ నియోజకవర్గం అభ్యర్థి అత్తిలి విమల, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు సీహెచ్ రాఘవేంద్రరావు, విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జీఎస్‌జే అచ్యుతరావు పాల్గొన్నారు.

బీసీలకు 50ఏళ్లకే పింఛన్

(మొదటిపేజీ తరువాయి)

అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. బీసీల అభ్యున్నతికి డిక్లరేషన్ ఇచ్చామని... 50 సంవత్సరాలకే పెన్షన్ పథకం అమలు చేస్తామన్నారు. స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్ అమలు చేస్తామన్నారు. బీసీలకు ప్రత్యేక చట్టం చేస్తామని హామీ ఇచ్చారు. ఆదరణ పథకం కింద 5000 కోట్లు చంద్రన్న బీమా రూ.10 లక్షలకు పెంచడం జరుగుతుందన్నారు. జగన్ పాలనలో కరెంటు చార్జీలు, పెట్రోల్, డీజిల్ ధరలు, లిక్కర్ ధరలు, ఆర్టీసీ చార్జీలు పెరిగాయని... పన్నులు మీద పన్నులు వేసి ప్రజలను అష్ట కష్టాలు పెడుతున్నాడన్నారు. పచ్చని సీమలో చిచ్చు రేపి ఇంటర్నెట్ కూడా బంద్ చేయించిన ఘనత జగన్‌కు దక్కుతుందన్నారు. జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ మాట్లాడుతూ అంబాజీపేటలో ఉద్యాన పరిశోధన స్థానం ఉన్నప్పటికీ ఎటువంటి ప్రయోజనం లేకుండా ఉందన్నారు. కొబ్బరి ఆధారిత పరిశ్రమల నెలకొల్పి యువతకు అనేక ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. ఎక్కడ నెగ్గాలో కాదు ఎక్కడ తగ్గాలో కూడా తెలిసిన వాడినని... పొత్తులో భాగంగా తక్కువ సీట్లు తీసుకోవడంపై వివరించారు. జనసేన పోటీలో లేని ప్రాంతాలలో కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. వలంటీర్లకు రూ.10వేలే వేతనం ఇస్తామని హామీ ఇచ్చారు.

సినిమా రంగంలో సంపాదించిన నగదు కౌలు రైతులకు విరాళంగా ఇచ్చానని... దీనిపై స్పందించిన తన అన్న చిరంజీవి రూ.ఐదు కోట్లు ఇచ్చారన్నారు. ఆంధ్రప్రదేశ్ పరిస్థితులను చక్కదిద్దడానికి జనసేన, టీడీపీ, బీజేపీ కూటమిగా మీ ముందుకు వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో అమలాపురం పార్లమెంటు అభ్యర్థి రెడ్డి హరీష్ మాధవ్, నియోజవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి గిడ్డి సత్యనారాయణ, బీజేపీ నాయకులు ఏళ్ల దొరబాబు, మానేపల్ అయ్యాజీ వేమ, ఐదవ ఆనందరావు, దాట్ల బుచ్చిరాజు, బందారు సత్యానందరావు, గణపతి వీర రాఘవులు, సిరినిడి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అస్థిర ప్రభుత్వాలతో ఉగ్రవాదం వ్యాప్తి

ప్రధాని మోదీ



రిషికేశ్ : కేంద్రంలోని బలమైన బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వంలో దేశ భద్రతా దళాలు ఉగ్రవాదులను వారి సొంత గడ్డపై నిర్మూలిస్తున్నాయని ప్రధాని నరేంద్ర మోదీ గురువారం అన్నారు. ఉత్తరాఖండ్‌లో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇక్కడి హాకీ గ్రౌండ్‌లో బీజేపీ విజయ్ సంకల్ప్ ర్యాలీని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ సుస్థిర ప్రభుత్వ ప్రయోజనాలను ప్రజలు చూసినందున 'ఫిర్ ఏక్ బార్ మోదీ సర్కార్' (మరోసారి మోదీ ప్రభుత్వం) ప్రతిధ్వనులు దేశవ్యాప్తంగా వినిపిస్తున్నాయని తెలిపారు. దేశంలో బలహీనమైన, అస్థిర ప్రభుత్వాలు ఉన్నప్పుడల్లా శత్రువులు ప్రయోజనం పొందారని, ఉగ్రవాదం వ్యాప్తి చెందిందన్నారు. అవినీతిపరుల దోపిడీని తమ ప్రభుత్వం అరికట్టిందని, అందుకే తనపై వారి ఆగ్రహం తారాస్థాయికి చేరిందని ప్రధాని మోదీ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మధ్య దళారుల వల్ల ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు లబ్ధిదారులకు చేరలేదని, కానీ బీజేపీ ప్రభుత్వ హయాంలో పథకాల ప్రయోజనాలు నేరుగా లబ్ధిదారులకు వారి బ్యాంకు ఖాతాల ద్వారా చేరుతున్నాయని చెప్పారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్‌కు గుణపాఠం చెబుతారని తాను విశ్వసిస్తానని అన్నారు. గతంతో పోలిస్తే, బలమైన స్థిరమైన బీజేపీ ప్రభుత్వంలో దేశం అనేక రెట్లు బలపడిందని చెప్పారు. ఏడు దశాబ్దాల తర్వాత జమ్మూకశ్మీర్‌లో ఆర్టికల్ 370ని రద్దు చేయడం, ట్రిపుల్ తలాక్‌కు వ్యతిరేకంగా చట్టం చేయడం, ఒకే ర్యాంక్ వన్ పెన్షన్ పథకాన్ని అమలు చేయడం, చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించడం వంటి ధైర్యం కూడా బలమైన బీజేపీ ప్రభుత్వానికి ఉందని ఆయన అన్నారు. గతంలో ఉన్న బలహీనమైన కాంగ్రెస్ ప్రభుత్వాలు సరిహద్దుల్లో మౌలిక సదుపాయాలను బలోపేతం చేయలేకపోయాయని ప్రధాని మోదీ అన్నారు. ఇప్పుడు సరిహద్దుల వెంబడి రోడ్లు, ఆధునిక సొరంగాలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. రాముడి అస్తిత్వాన్ని కాంగ్రెస్ ప్రశ్నిస్తోందని, అయోధ్య ఆలయ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తోందని ప్రధాని ఆరోపించారు. రాష్ట్రంలో జరుగుతున్న మెగా రోడ్డు, రైలు తదితర ప్రాజెక్టుల గురించి ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా పర్యాటక రంగాన్ని పెంచి ఉపాధి అవకాశాలను కల్పిస్తామన్నారు.

అవినీతిపరులను జైలుకు పంపించడం మోదీ హామీ

జైపూర్ : అవినీతిపరులు జైలుకు వెళ్లాల్సిందేనని ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. రాజస్తాన్‌లోని కరౌలీలో జరిగిన ర్యాలీలో మోదీ ప్రసంగిస్తూ, రాష్ట్రంలోనే కాకుండా దేశవ్యాప్తంగా అవినీతిపరులపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అందుకే ప్రతిపక్షాలు తనకు వ్యతిరేకంగా 'ఇండియా' కూటమిని ఏర్పాటు చేశాయని అన్నారు. దశాబ్దాలుగా 'గరీబీ హఠావో' నినాదాన్ని కాంగ్రెస్ వినిపించిందని, అయితే 25 కోట్ల మంది ప్రజలను పేదరికం నుంచి బయటకు తీసుకురావడానికి కృషి చేసింది తానేనని మోదీ చెప్పుకొచ్చారు.

రైతుపై పాలకుల నిర్లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)

రైతులు పోలీసులపై పేడ చల్లడంతో పాటు దుంపలు విసిరి, ఎండుగడ్డి తగులబెట్టడం ద్వారా తమ నిరసన తెలియజేశారన్నారు. 'మా వృత్తిలో మమ్మల్ని బతకనివ్వండి' అంటూ నినదించారని తెలిపారు. ఈ పోరాటాలకు నాయకత్వం వహించిన అనేక రైతు సంఘాలు ఈ సదస్సులో ప్రాతినిధ్యం వహించాయన్నారు. భారతదేశంలో రైతులకు నాయకత్వం వహిస్తున్న అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) 1936లో స్థాపితమైందని, పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపట్టిన చరిత్ర ఉందన్నారు. 'భారతదేశంలో రైతులు తమ సమస్యల పరిష్కారం కోసం పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపట్టారు. దేశవ్యాప్తంగా వీధుల్లో వారు నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. అన్ని పంట ఉత్పత్తులకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) కు చట్టపరమైన హామీ కల్పించాలని, రైతు రుణాలను మాఫీ చేయాలని, 60 ఏళ్ల పైబడిన రైతులకు రూ.10 వేల పెన్షన్ సౌకర్యం కల్పించాలని, విద్యుత్ (సవరణ) చట్టం 2023ను ఉపసంహరించాలని, 2020-21 నిరసనల సమయంలో రైతులపై పెట్టిన కేసులన్నింటినీ తొలగించాలన్నది ప్రధాన డిమాండ్లుగా ఉన్నాయి' అని రావుల వెంకయ్య పేర్కొన్నారు. అలాగే డబ్ల్యూటీవో నుంచి భారతదేశం బయటకు రావాలన్నది కూడా మరొక డిమాండ్‌గా ఉందన్నారు. వ్యవసాయ విధానాల్లో డబ్ల్యూటీవో జోక్యానికి వ్యతిరేకంగా, డబ్ల్యూటీవో నిబంధనలకు అభ్యంతరాలు లేవనెత్తుతూ యూరప్‌లో కూడా రైతులు పెద్ద ఎత్తున ఉద్యమిస్తున్నారని తెలిపారు. భారత్‌లో వ్యవసాయ రంగం, దాని అనుబంధ రంగాలపై ఆధారపడి పెద్ద సంఖ్యలో ప్రజలు... ప్రత్యేకించి రైతులు, వ్యవసాయ కూలీలు జీవిస్తున్నారని పేర్కొన్నారు. అయితే పంటలకు గిట్టుబాటు ధర లభించక, ప్రభుత్వ వ్యవసాయ వ్యతిరేక విధానాల ఫలితంగా వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. భారత్‌లో ప్రతి గంటకూ ఒక రైతు ఆత్మహత్య చేసుకుంటున్నాడని తెలిపారు. రైతుల సమస్యల పరిష్కారం కోరుతూ సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) ఆధ్వర్యంలో ఫిబ్రవరి 16, 2024న రైతులు, కార్మికుల దేశవ్యాప్త సమ్మె నిర్వహించారని ఆయన వివరించారు. అలాగే మార్చి 14న దేశ రాజధాని దిల్లీలో భారీ నిర్వహించిందన్నారు. రైతుల సమస్యలను పరిష్కరించే వరకు ఈ ఉద్యమాన్ని ముందుకు తీసుకువెళతామని ఈ సందర్భంగా రైతు సంఘాల నేతలు స్పష్టం చేశారని తెలిపారు. ఈ అంతర్జాతీయ సదస్సు వివిధ దేశాల్లో రైతు ఉద్యమాలు, తదనంత పరిణామాలు, వారి అనుభవాలను తెలుసుకోవడానికి దోహదపడిందన్నారు. భవిష్యత్తు ఉద్యమాలకు, కార్యాచరణకు ఈ సదస్సు ఒక దిక్సూచిగా నిలుస్తుందని తాను భావిస్తున్నట్లు రావుల వెంకయ్య పేర్కొన్నారు.

'వలంటీర్' రాజకీయం

(మొదటిపేజీ తరువాయి)

వలంటీర్లుగా వచ్చామని చెబుతున్న వారంతా రాజకీయ ప్రచారం చేయడంపైనా దుమారం నెలకొంది. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు వలంటీర్లు దూరంగా ఉండాలేగానీ, వైసీపీకి అనుకూలంగా ప్రచారం చేయడం ఏమిటన్న విమర్శలున్నాయి. కాకినాడ రూరల్‌లో ఆరుగురు వలంటీర్లను గదిలో తాళం వేసి నిర్బంధించారన్న సంఘటనపైనా అక్కడి జనసేన అభ్యర్థి పంతం నానాజీపై వలంటీర్లు ఫిర్యాదు చేశారు. నానాజీతోపాటు జనసేన నేతలపై కేసులు నమోదు చేశారు.

వైసీపీ ప్రోత్సాహంతోనే వలంటీర్లు ప్రచారానికి దిగుతున్నారని ఎన్డీయే కూటమి అభ్యర్థులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రోజురోజుకూ వలంటీర్ల రాజీనామాలు పెరుగుతున్నాయి. వారంతా ఇదేదిశగా ప్రచారానికి దిగుతారన్న ఆందోళన ఎన్డీయే కూటమిలో ఉంది.

'ప్రజాస్వామ్య తెలంగాణ'పేరుతో విరుద్ధ పాలన

వ్యవస్థలన్నీ సీఎం గుప్పిట్లోనే: బీఆర్ఎస్

విశాలాంధ్ర-హైదరాబాద్: రాష్ట్రంలో అన్ని వ్యవస్థలను సీఎం రేవంత్ రెడ్డి తన గుప్పిట్లో పెట్టుకున్నారని, 'ప్రజాస్వామిక తెలంగాణ' పేరుతో అధికారంలోకి వచ్చి అందుకు విరుద్ధంగా ప్రవర్తిస్తున్నారని బీఆర్ఎస్ ఆరోపించింది. తెలంగాణ భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యేలు కె.పి.వివేకానంద, పాడి కౌశిక్‌రెడ్డి, కోవా లక్ష్మి, మాజీ ఎమ్మెల్యేలు జీవన్‌రెడ్డి, పి.శశిధర్ రెడ్డి మాట్లాడుతూ స్పీకర్ కార్యాలయాన్ని కూడా రేవంత్ ప్రభావితం చేస్తున్నారని ఆరోపించారు. ప్రతిపక్ష సభ్యులపై స్పీకర్ నిష్పక్షపాతంగా ఉండాలని, కానీ తాము కలవాలని ప్రయత్నిస్తే ఆయన అనుమతి ఇవ్వడం లేదని పేర్కొన్నారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి మారిన ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావ్‌పై అనర్హత వేటు వేయాలని కోరుతూ పిటిషన్ ఇవ్వడానికి ప్రయత్నించామని కాని స్పీకర్ టైమ్ ఇవ్వకపోవడంతో రిజిస్టర్ పోస్టులో పిటిషన్లు పంపినట్లు వివరించారు. దానం నాగేందర్‌తోపాటు కడియం, తెల్లంపై అనర్హత వేటు వేయడం మినహా వేరేమార్గం లేదని చెప్పారు. హిమాచల్‌లో కాంగ్రెస్ ప్రభుత్వమే ఉందని అక్కడ పార్టీ ఫిరాయించిన వారిపై స్పీకర్ అనర్హత వేటు వేశారని గుర్తు చేశారు. హిమాచల్ స్పీకరు తీసుకున్న నిర్ణయాన్ని ఇక్కడ కూడా స్పీకర్ ఆదర్శంగా తీసుకోవాలని చెప్పుకొచ్చారు. అనర్హత వేటు వేయకపోతే బీఆర్ఎస్ ఎందాకైనా పోరాడతుందని, అవసరమైతే అసెంబ్లీ ఎదుట ధర్నా చేస్తాం, కోర్టుల తలుపు తడుతామని హెచ్చరించారు. ఓ వైపు రాహుల్ నీతులు చెబుతారు... మరోవైపు రేవంత్ గోతులు తవ్వుతారంటూ దుయ్యబట్టారు. ఫిరాయింపులపై కొత్త చట్టం తెస్తామని పార్టీ మారే వారిపై వేటు వేస్తామని ఏఐసీసీ మేనిఫెస్టోలో చెప్పారని, కానీ తుక్కుగూడ సభలో మేనిఫెస్టో విడుదల చేస్తూ అదే వేదికపై పార్టీ మారిన ఎమ్మెల్యేలను కూర్చోబెట్టుకోవడం సిగ్గుచేటని అన్నారు. స్పీకర్‌పై సీఎం ఒత్తిడి చేయడం ఆపాలని డిమాండ్ చేశారు. లీగల్‌గా తమ పిటీషన్లు స్పీకర్‌కు చేరిన నేపథ్యంలో చర్యలు ప్రారంభించాల్సిన బాధ్యత ఆయనపై ఉందన్నారు. రేవంత్ పార్టీ మారిన వారిని రాళ్లతో కొట్టి చంపాలన్నాడు, మరి దాని కనుగుణంగా అనర్హత వేటు వేయాలని కోరారు. రేవంత్ అభద్రతా భావంతో ఎమోషనల్ బ్లాక్ మెయిల్‌తో కొడంగల్ ఓటర్లను బెదిరిస్తున్నాడని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ద్వంద్వ నీతితో విశ్వసనీయత కోల్పోతోందన్నారు. ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై ఇచ్చిన అనర్హత పిటిషన్‌పై స్పీకర్ చేస్తున్న జాప్యంపై హైకోర్టులో పిటిషన్ వేశామని ఇది సోమవా రం విచారణకు వస్తుందని పాడి కౌశిక్ రెడ్డి చెప్పారు. కడియం, తెల్లం వెంకట్రావ్‌లపై పిటిషన్ ఇవ్వడానికి వెళితే అసెంబ్లీ కార్యదర్శి బాత్ రూమ్ లో దాక్కున్నారని, ఇదేనా ప్రజాపాలన అంటే అంటూ ధ్వజమెత్తారు. ముగ్గురు ఎమ్మెల్యేల పై అనర్హత వేటు కచ్చితంగా పడుతుంది, మూడు చోట్ల ఉప ఎన్నికలు కచ్చితంగా వస్తాయని చెప్పారు. లక్ష్మి మాట్లాడుతూ 26 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరుతున్నారని మంత్రి ఉత్తమ్‌తో పాటు కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.

బెంగాల్‌లో పోటీ చేయండి

అమిత్ షాకు అభిషేక్ సవాల్

కోల్‌కతా: కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాకు తృణముల్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభిషేక్ బెనర్జీ సవాల్ విసిరారు. డైమండ్ హార్బర్ లోక్‌సభ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా బరిలో దిగాలని అమిత్ షాకు పిలుపునిచ్చారు. ఒకవేళ ఇక్కడ నుంచి అమిత్‌షా పోటీ చేయకుంటే... ఈడీ, సీబీఐ, ఎన్ఐఏ డైరెక్టర్లు అయినా పోటీ చేయవచ్చని సవాల్ చేశారు. ఈ లోక్‌సభ స్థానం నుంచి బరిలో నిలిచే అత్యుత్తమ బీజేపీ అభ్యర్థులు వీరేనని అభిషేక్ బెనర్జీ చెప్పారు. కోల్‌కతాలోని రాజ్‌భవన్ వెలుపల ఆయన మీడియాతో మాట్లాడారు. భారతదేశం ప్రజాస్వామ్య దేశం. ఈ దేశంలో ఏ వ్యక్తి అయినా... ఏ పార్టీ అయినా ఎక్కడి నుంచి అయినా పోటీ చేసే హక్కు ఉందని అభిషేక్ అన్నారు. అయితే ఈ లోక్‌సభ స్థానం నుంచి అభ్యర్థిని నిలపడంలో ఆ పార్టీ ఘోరంగా విఫలమైందని ఆరోపించారు. ఈ ఘటనతో బెంగాల్‌లో బీజేపీ పరిస్థితి ఎలా ఉందో తేటతెల్లమవుతోందన్నారు. డైమండ్ హార్బర్ లోక్‌సభ నియోజకవర్గం ప్రతిష్ఠ దిగజార్చేందుకే బీజేపీ ప్రయత్నిస్తున్నదని మండిపడ్డారు. లోక్‌సభ ఎన్నికల వేళ ప్రతిపక్ష పార్టీల నేతలను ఈడీ, సీబీఐ, ఎన్ఐఏ సంస్థలతో బీజేపీ బెదిరిస్తోందని అభిషేక్ ఆరోపించారు. అందులో తమ పార్టీ కూడా ఉందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బెంగాల్‌లో అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందన్నారు. ఈ అంశంపై రాష్ట్ర గవర్నర్ సీవీ ఆనంద్‌తోపాటు ఎన్నికల సంఘానికి లేఖ రాశామని, అయినా ఫలితం లేదని ఆయన పెదవి విరిచారు. 2014 ఎన్నికల నాటి నుంచి ఈ డైమండ్ హార్బర్ లోక్‌సభ స్థానం నుంచి వరుసగా అభిషేక్ బెనర్జీ గెలుస్తూ వస్తున్నారు.

కవితను అరెస్టు చేసిన సీబీఐ

(మొదటిపేజీ తరువాయి)

చేయాల్సిందిగా కోర్టు సూచించింది. కవిత దాఖలు చేసిన పిటిషన్ ను మెజిస్ట్రేట్ కావేరి భవేజా ధర్మాసనానికి సీబీఐ కోర్టు బదిలీ చేసింది. దీంతో ఈ పిటిషన్ శుక్రవారం ఉదయం 10 గంటలకు విచారణకు వచ్చే అవకాశం ఉంది. అటు ఈడీ.. ఇటు సీబీఐ కూడా అరెస్ట్ చేయడంతో దిల్లీ లిక్కర్ కేసులో కీలక పరిణామమే చోటుచేసుకుందని దిల్లీ వర్గాలు చెబుతున్నాయి. కాగా మద్యం కుంభకోణానికి సంబంధించి దిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌తో కలిసి కవిత కుట్ర చేశారని సీబీఐ ఆరోపించింది. బుచ్చిబాబు ఫోన్ నుంచి రికవరీ చేసిన వాట్సాప్ చాట్‌పై సీబీఐ దృష్టి పెట్టింది. వంద కోట్ల ముడుపుల చెల్లింపు తర్వాత కొనుగోలు చేశాని చెప్పబడుతున్న భూముల డాక్యుమెంట్‌లపై దర్యాప్తు చేస్తున్నట్లు చెబుతోంది. సౌత్ గ్రూపుకు ఆప్‌కు మధ్య కవిత దళారిగా వ్యవహరిస్తూ రూ.100 కోట్ల ముడుపులు చెల్లించడంలో కీలకపాత్ర పోషించారని సీబీఐ అభియోగం మోపింది. అవినీతి నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తోంది. ఐపీసీ 120బి కింద కుట్ర కోణంలోనూ విచారణ జరుపుతోంది. ఈ క్రమంలోనే కవితను అరెస్ట్ చేసినట్టు సీబీఐ గురువారం ఓ ప్రకటనలో పేర్కొంది. మరోవైపు, కవిత రెగ్యులర్ బెయిల్ పిటిషన్‌పై ఈనెల 16వ తేదీన విచారణ జరగనుంది. ఈ క్రమంలో కవితను సీబీఐ అరెస్ట్ చేయడం సంచలనంగా మారింది. ఇక, లిక్కర్ స్కాం కేసులో కవితను మార్చి 15వ తేదీన ఈడీ అరెస్ట్ చేసింది.

మల్కాజిగిరి అభ్యర్థిని గెలిపించండి

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్: రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి చెందిన మల్కాజిగిరి అభ్యర్థి గెలుపునకు శ్రమించాలని ఏఐసీసీ తెలంగాణ రాష్ట్ర ఇన్‌ఛార్జి దీపాదాస్ మున్షి పేర్కొన్నారు. ఫిల్మ్‌నగర్‌లోని ఆమె నివాసంలో మల్కాజిగిరి పార్లమెంట్ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, కాంగ్రెస్ కుత్బుల్లాపూర్ ఇన్‌ఛార్జి కోలన్ హనుమంత్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ , టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి, యువ కిరణ్ పాల్గొన్నారు.

'ఇండియా' విజయంతోనే దేశాభివృద్ధి

ముప్పాళ్ల నాగేశ్వరరావు స్పష్టీకరణ

మర్రి సాంబశివరావుకు నివాళి అర్పించిన నేతలు

విశాలాంధ్ర-మంగళగిరి: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని తరిమికొట్టాలని, ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపిస్తేనే దేశం అభివృద్ధి చెందుతుందని, పేదల ప్రజల పక్షాన పోరాడే కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థులను గెలిపించాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు ఓటర్లకు పిలుపునిచ్చారు. గుంటూరు జిల్లా పాత మంగళగిరిలో మర్రి సాంబశివరావు సంస్మరణ కార్యక్రమానికి ముప్పాళ్ల గురువారం హాజరయ్యారు. సాంబశివరావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ముప్పాళ్ల మాట్లాడుతూ సీపీఐ పాత మంగళగిరి శాఖ కార్యదర్శిగా మర్రి సాంబశివ రావు అంకితభావంతో పనిచేశారని, సీపీఐ బలోపేతం కోసం కృషి చేశారని గుర్తుచేశారు. మంగళగిరిలో అనేక ఉద్యమాలలో పాల్గొన్నారని, ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మికసంఘం రాష్ట్ర నాయకుడిగా చేనేతల తరపున పోరాటాలు సాగించారన్నారు. సాంబశివరావు కుటుంబ సభ్యులకు ముప్పాళ్ల ప్రగాఢ సానుభూతి తెలిపారు.

మోదీ ప్రభుత్వం మతోన్మాదులను రెచ్చగొడుతూ మత విద్వేషాలు సృష్టిస్తోందని, దేవుడి పేరుతో ఓట్లు దండుకోవాలని చూస్తుందని ముప్పాళ్ల విమర్శించారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలోకి మారే నాయకులకు గుణపాఠం చెప్పాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బీజేపీ ప్రభుత్వం వల్ల దేశ ఆర్థిక వ్యవస్థ అతలాకుతలమైందని, సంపన్నులు సంపన్నులు... పేదలు నిరుపేదలుగా మిగిలిపోతున్నారని ముప్పాళ్ల ఆరోపించారు. దేశ సంపదను అదానీ, అంబానీలకు దోచిపెడుతోందన్నారు. సీఎం జగన్‌తో కలిసి ఆంధ్రప్రదేశ్‌ను ప్రధాని మోదీ అప్పుల ఊబిలో నెట్టేశారని చెప్పారు. రానున్న ఎన్నికలలో మార్పు తీసుకురాకపోతే దేశానికి ఇవే చివరి ఎన్నికలవుతాయని హెచ్చరించారు. దేశం అభివృద్ధి పథంలో నడవాలంటే పేదల పక్షాన పోరాడే కమ్యూనిస్టులను గెలిపించుకోవాలని ముప్పాళ్ల అన్నారు. రాష్ట్రానికి రాజధాని లేకుండా చేసిన పార్టీలను ఓడించాలని పిలుపునిచ్చారు. ఈ ఎన్నికలలో ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించుకోవాలని, కూటమి బలపరిచిన గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి జంగాల అజయ్‌కుమార్‌ను, మంగళగిరి అసెంబ్లీ అభ్యర్థి జొన్నా శివశంకర్‌ను గెలిపించాలని ముప్పాళ్ల ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. మర్రి సాంబశివరావుపై సందు పట్ల భూపతి రచించిన గేయాన్ని అల్లక తాతారావు గానం చేశారు. నివాళులర్పించిన వారిలో సీపీఐ మంగళగిరి నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మికసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు, సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి యార్లగడ్డ వెంకటేశ్వరరావు, కంచర్ల కాశయ్య, జాలాది జాన్‌బాబు, సీపీఎం నాయకులు పిల్లలమర్రి బాలకృష్ణ, పాత మంగళగిరి శాఖ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వలంటీర్లపై ఆరోపణలు చేసి... మళ్లీ కొనసాగింపా? సజ్జల

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఒకప్పుడు వలంటీర్లపై చంద్రబాబు అనేక ఆరోపణలు చేసి, మళ్లీ వారిని కొనసాగిస్తామని వ్యాఖ్యానించడాన్ని ప్రజలు గమనిస్తున్నారని వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సజ్జల మాట్లాడుతూ వలంటీర్ల అంశంపై చంద్రబాబు రోజుకో మాట మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఒకప్పుడు వలంటీర్లపై చంద్రబాబు, పవన్ కల్యాణ్ అనేక ఆరోపణలు చేసి, ఇప్పుడు ఓట్ల కోసం అబద్ధపు హామీలిస్తున్నారన్నారు. చంద్రబాబు అధికారంలోకి వస్తే వలంటీర్ల స్థానంలో జన్మభూమి కమిటీలు వస్తాయని, ఆ కమిటీ సభ్యులు చెప్పిన వారికే పథకాలు వర్తిస్తాయని చెప్పారు. చంద్రబాబు నైజం ప్రజలకు అర్థమైందని, టీడీపీ నేతలే గొడవలు సృష్టించి మాపై నెపం నెడుతున్నారని, ఎన్నికల్లో గెలవలేమన్న విషయం వారికి తెలిసిపోయిందన్నారు. శవ రాజకీయాలు చేసేదీ చంద్రబాబేనని, ఆయన వైఖరిని ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. నిష్పక్షపాతంగా ఎన్నికలు జరిగితే వైసీపీ ఏకపక్షంగా విజయం సాధిస్తుందన్నారు. సుప్రీంకోర్టు డైరెక్షన్ ద్వారా రామోజీ బండారం బయట పడుతుందని, 2024 ఎన్నికల్లోనూ శాసించాలని రామోజీ ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు.

'మేమంతా సిద్ధం' 13వ రోజు...

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వైసీపీ అధినేత, సీఎం జగన్ 'మేమంతా సిద్ధం' పేరుతో నిర్వహిస్తున్న బస్సు యాత్ర 13వ రోజు షెడ్యూలును ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తలశిల రఘురామ్ వెల్లడించారు. ధూళిపాళ్ల రాత్రి బస నుంచి శుక్రవారం ఉదయం తొమ్మిది గంటలకు సీఎం బయల్దేరుతారు. సత్తెనపల్లి, కొర్రపాడు, మేడికొండూరు, పేరేచెర్ల జంక్షన్, నల్లపాడు మీదుగా హౌసింగ్ బోర్డు వద్దకు చేరుకుని భోజన విరామం తీసుకుంటారు. అనంతరం చుట్టుగుంట సర్కిల్, వీఐపీ రోడ్ మీదుగా సాయంత్రం 3.30 గంటలకు ఏటుకూరు బైపాస్ సభ ప్రాంగణానికి చేరుకుని బహిరంగ సభలో ప్రసంగిస్తారు. అనంతరం తక్కెళ్లపాడు బైపాస్, పెదకాకాని బైపాస్, వెంగళరావు నగర్, నంబూరు క్రాస్ మీదుగా నంబూరు బైపాస్ దగ్గర రాత్రి బస శిబిరానికి సీఎం చేరుకుంటారు.

ఏపీలో వైసీపీ కోడ్...

అధికార పార్టీ తొత్తులుగా వ్యవహరిస్తే చర్యలు తప్పవు: దేవినేని ఉమా

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : రాష్ట్రంలో ఎన్నికల కోడ్ నడవడంలేదని, వైసీపీ కోడ్ నడుస్తోందని టీడీపీ మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు మండిపడ్డారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రశ్నించిన ప్రజలపై దాడులు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ గుండాలు ప్రజలపై, పోలీసులపై దాడులు చేస్తే జగన్ తొత్తులుగా పనిచేస్తున్న అధికారులు స్వామి భక్తి చూపిస్తున్నారని విమర్శించారు. వైసీపీకి కొమ్ముకాస్తున్న అధికారులు మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. సిట్ ముఖ్య అధికారి మాదిరే ప్రవర్తిస్తే తగిన గుణపాఠం తప్పదన్నారు. సజ్జల, ధనుంజయ్ రెడ్డి మాటలు వింటే తప్పకుండా బాధ్యులవుతారని అన్నారు. అధికారులు ప్రజల కోసం పనిచేయాలన్నారు. వైసీపీ నేతలకు ఓటమి భయం పట్టుకుందన్నారు. జగన్ బస్సు యాత్రకు జనంరాక సజ్జలకు ఫ్రస్టేషన్ పెరిగి ప్రెస్‌మీట్‌లు పెడుతున్నాడని ఎద్దేవా చేశారు. సజ్జలతో సహా ప్రభుత్వ సొమ్ములు దిగమింగుతున్న ప్రభుత్వ సలహాదారులు ఎవరికి పనిచేస్తున్నారు... ఎవరికి సలహాలు ఇస్తున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. తాడేపల్లి నెస్ట్ స్పేస్ భవనంలో ఫేక్ న్యూస్ ఫ్యాక్టరీని తండ్రి కొడుకులు నడుపుతూ, ప్రత్యర్థులపై బురదచల్లే కార్యక్రమం చేపడుతున్నారని ఆరోపించారు. ఫేక్ న్యూస్ ఫ్యాక్టరీలో ఏపీ డిజిటల్ కార్పొరేషన్ ఉద్యోగులు దాదాపు 300 మంది పనిచేస్తున్నారని, వీటిపై డీజీపీ ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో చెప్పాలని ఉమా డిమాండ్ చేశారు.

పులివెందులపై ప్రత్యేక దృష్టి పెట్టండి

కేంద్ర ఎన్నికల సంఘానికి మాజీ ఎంపీ కనకమేడల లేఖ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఏపీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పోటీ చేస్తున్న పులివెందుల నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరుతూ కేంద్ర ఎన్నికల సంఘానికి మాజీ రాజ్యసభ సభ్యుడు కనకమేడల రవీంద్రకుమార్ గురువారం లేఖ రాశారు. శాంతియుత ఎన్నికల నిర్వహణకు తగు చర్యలు తీసుకోవాలని ఈసీఐ ఆదేశించినా కొంతమంది అధికారులు అధికార పార్టీ ఒత్తిడితో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. పులివెందులలో జగన్‌పై పోటీ చేస్తున్న టీడీపీ అభ్యర్థి బీటెక్ రవి నియోజకవర్గంలో తగు చర్యలు కోరుతూ గతంలోనే ఈసీఐకి లేఖ రాశారు. వ్యక్తిగత భద్రతతో పాటు అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తూ...ప్రతిపక్షాలపై అక్రమ కేసులు బనాయించిన కె.అశోక్ రెడ్డిని వెంటనే బదిలీ చేయాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పెంచాలి. పులివెందుల చినచౌక్, రూరల్ ఇన్‌స్పెక్టర్ అశోక్ రెడ్డి ఐదేళ్లుగా అక్కడే పనిచేస్తున్నారు. జిల్లా ఎస్పీ, అది ఫంక్షనల్ పోస్ట్ అంటూ... ఎన్నికల సంఘం ఫంక్షనల్ పోస్టులకు అభ్యంతరం తెలపలేదంటూ మభ్యపెడుతున్నారు. బీటెక్ రవికి ఎటువంటి ప్రాణహాని లేదని స్థానిక ఎస్పీ చెప్పడం వాస్తవ విరుద్ధం. రవికి భద్రత కల్పించే విషయంలో ఎన్నికల అధికారులైన డీఈఓ, సీఈఓలు ఎటూ తేల్చకపోవడం ఎన్నికల అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల ఎంపికలో ఎన్నికల అధికారులు, పోలీసులు... పోటీ చేస్తున్న అభ్యర్థులను సంప్రదించి నిర్ణయం తీసుకోవాలని ఈసీఐ చాలా స్పష్టంగా చెప్పింది. కానీ స్థానిక ఎస్పీ పులివెందులలోని మొత్తం 68 కేంద్రాల్లో కేవలం 32 మాత్రమే సమస్యాత్మక కేంద్రాలని ఏకపక్ష నిర్ణయం చేశారు. ఎస్పీ నిర్ణయించిన కేంద్రాలనే డీఈఓ ఫైనల్ చేసి ఏపీ సీఈఓకు పంపారు. అలాగే పులివెందుల డెవలప్‌మెంట్ అథారిటీ ఓఎస్‌డీ అనిల్ కుమార్ రెడ్డి వివక్షపూరితంగా వ్యవహరిస్తున్నారు. అనిల్ కుమార్ రెడ్డి అధికార పార్టీకి అనుకూలంగా పని చేసినందుకు సీఎం ఆశీస్సులతో ఇటీవల ఐఏఎస్ క్యాడర్ పొందారు. పాడా ఆఫీస్‌ను ఇటీవల పులివెందుల రిటర్నింగ్ అధికారి ఆఫీసుకు పక్కనే ఉన్న మినీ సెక్రటరియేట్‌కు మార్చారు. వైసీపీ ఎన్నికల కార్యకలాపాలను పర్యవేక్షించడం కోసమే అలా మార్చారు. ఈ విషయాలన్నింటిపై కేంద్ర ఎన్నికల సంఘం దృష్టి పెట్టి బీటెక్ రవికి వెంటనే భద్రత కల్పించాలని కనకమేడల విజ్ఞప్తి చేశారు.

బీజేపీ, వైసీపీకి బుద్ధి చెప్పండి

ఎన్నికల ప్రచారంలో సీపీఐ అభ్యర్థి జీ కోటేశ్వరరావు

విశాలాంధ్ర-విజయవాడ(చిట్టినగర్): కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో జగన్ పాలనలో రాజ్యాంగ వ్యవస్థలతో పాటు ప్రజలకు రక్షణ లేకుండాపోయిందని సీపీఐ పశ్చిమ అభ్యర్థి జీ కోటేశ్వర రావు విమర్శించారు. చిరు వ్యాపారులు, సామాన్య, మధ్యతరగతి ప్రజలపై పన్నుల రూపంలో ఆర్థిక భారాలు మోపారన్నారు. ఇండియా కూటమిని గెలిపించుకుంటూనే దేశానికి, రాష్ట్రానికి మంచిరోజులు వస్తాయన్నారు. గురువారం 38, 52 డివిజన్‌లలో సీపీఐ నిర్వహించిన ఎన్నికల ప్రచార యాత్రలో ఆయన పాల్గొన్నారు. ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఈ ఎన్నికల్లో మతోన్మాద బీజేపీ, రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టి ఆ పార్టీతో రహస్య అవగాహనతో విధ్వంస పాలన సాగిస్తున్న వైసీపీకి బుద్ధి చెప్పాలన్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానని తెలిపారు. నియోజకవర్గ ప్రజలు ముఖ్యంగా యువత, మహిళలు ఇండియా కూటమి బలపర్చిన అభ్యర్థిగా కంకి కొడవలి గుర్తుపై ఓటువేసి తనను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. లెనిన్ భవన్ వద్ద ప్రారంభమైన ప్రచారయాత్రకు అడుగడుగునా మంచి స్పందన వచ్చింది. స్థానికుల నుంచి సమస్యలు తెలుసుకుంటూ మల్లికార్జున పేట, ఉప్పర వాగు, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి గుడి అడ్డరోడ్డు మీదుగా బ్రాహ్మణ వీధి హెడ్ వాటర్ వర్క్స్ వరకు కోటేశ్వరరావు ప్రచార యాత్ర కొనసాగించారు. ఈ యాత్రలో సీపీఐ నగర సహాయ కార్యదర్శి నక్క వీరభద్రరావు, కార్యదర్శివర్గ సభ్యులు కేవీ భాస్కరరావు, తాడిపైడయ్య, మూలీ సాంబశివరావు, శివ, కొట్టు రమణారావు, పంచదార్ల దుర్గాంబ, భాగ్యలక్ష్మి, కొట్టు విజయలక్ష్మి, కార్యవర్గ సభ్యులు సింగరాజు సాంబశివరావు, కంచర్ల నాగేశ్వరరావు, జీ భాస్కరరావు, మారుతి, ఎస్ సోమేశ్వరరావు, కే శ్రీను, పగిడి కత్తుల రాము, కాళ్ల చిన్నప్ప, లంకా గోవిందరాజులు, అయ్యప్ప, ఎస్ మోహన్ ప్రసాద్, స్థానిక నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఘనంగా పూలే జయంతి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: మహాత్మా జ్యోతిరావ్ పూలే జయంతిని ఆంధ్రప్రదేశ్‌లో గురువారం ఘనంగా నిర్వహించారు. వివిధ రాజకీయ పార్టీలు, బీసీ, సామాజిక సంఘాల నేతలు పూలేకు నివాళులర్పించారు. విజయవాడ ఆంధ్రరత్న భవన్‌లో పూలే చిత్రపటానికి కాంగ్రెస్ విజయవాడ నగర అధ్యక్షుడు నరహరిశెట్టి నరసింహారావు పూలమాలలేసి శ్రద్ధాంజలి ఘటించారు. బైపూడి నాగేశ్వరరావు, సతీశ్ పాల్గొన్నారు.

సామాజిక సంస్కర్త: అచ్చెన్నాయుడు

ఆధునిక సమాజంలో కుల నిర్మూలన ఉద్యమాలకు బీజం నాటిన తొలితరం సామాజిక సంస్కర్త జ్యోతిరావ్ పూలే అని టీడీపీ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.అచ్చెన్నాయుడు కొనియాడారు. ఆ మహాశయుని స్ఫూర్తితోనే బడుగు బలహీన వర్గాలకు రాజకీయాల్లోనూ, అధికారంలోనూ ప్రాధాన్యం కల్పించి, బీసీల పార్టీగా తెలుగుదేశం పేరొందిందన్నారు. పూలే స్ఫూర్తితోనే బీసీలకు మరిన్ని హామీలు ఇచ్చామని, టీడీపీ అధికారంలోకి వచ్చాక బీసీలకు 50 ఏళ్లకే నెలకు రూ.4 వేల పెన్షన్ ఇస్తామని, రూ.లక్షా 50 వేల కోట్లతో బీసీ సబ్‌ప్లాన్ అమలు చేస్తామని వివరించారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లను పునరుద్ధరిస్తామని, చట్టసభల్లో బీసీలకు 33 శాతం రిజర్వేషన్ కోసం అసెంబ్లీ తీర్మానం చేసి కేంద్రానికి పంపిస్తామని తెలిపారు.

వైసీపీ కేంద్ర కార్యాలయంలో...

వైసీపీ తాడేపల్లి కేంద్ర కార్యాలయంలో పూలే చిత్రపటానికి వైసీపీ నేతలు పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. శాసనమండలి విప్ లేళ్ల అప్పిరెడ్డి, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి, నవరత్నాల అమలు కమిటీ వైస్ చైర్మన్ నారాయణమూర్తి, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంత్, ఏపీ శాలివాహన కుమ్మర కార్పొరేషన్ చైర్మన్ పురుషోత్తం, అధికార ప్రతినిధి కాకుమాను రాజశేఖర్ హాజరయ్యారు. బలహీనవర్గాల అభ్యున్నతికి పూలే చేసిన సేవలను శ్లాఘించారు. లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ పూలే ఆశయాలను సీఎం జగన్ అమలు చేస్తున్నారని స్పష్టం చేశారు. బీసీల అభివృద్ధి కోసం పాటుపడిన స్వతంత్ర సమరయోధుడు పూలే అని చెప్పారు.

జాబు పేరుతో జగన్ ఘరానా మోసం: షర్మిల

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: జాబు కావాలంటే బాబు రావాలని చంద్రబాబు చేసిన మోసం చాలదని, జాబు రావాలంటే జగన్ కావాలని ఘరానా మోసానికి తెరలేపారని కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల మండిపడ్డారు. ఎక్స్ వేదికగా గురువారం ఆమె ఘాటుగా విమర్శించారు. నాడు ఎన్నికల సమయంలో 2.32 లక్షల ప్రభుత్వ శాఖల ఉద్యోగాలు, 23 వేల ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తామని గద్దెనెక్కారని గుర్తుచేశారు. ఐదేళ్లల్లో ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో ఆత్మవిమర్శ చేసుకోవాలన్నారు. ఏటా జాబ్ క్యాలెండర్ అని, జంబో డీఎస్సీ అని, ఏపీపీఎస్సీ నుంచి నుంచి వరుస నోటిఫికేషన్లు అని నమ్మించి నిరుద్యోగులను జగన్ నిండా ముంచారన్నారు. మోసానికే బ్రాండ్ అంబాసిడర్ జగన్ అని పేర్కొన్నారు. మీ అవసరాల కోసం వలంటీర్ల వ్యవస్థను తెచ్చి రెండు లక్షల ఉద్యోగాలు నింపామని చెప్పుకుంటారా? అని ప్రశ్నించారు. గౌరవంగా చెప్పుకొనే ఒక్క ఉద్యోగం భర్తీ చేశారా? నేటికీ శాఖల పరిధిలో 2.25 లక్షల పోస్టులు ఖాళీగా ఉన్నాయంటే మీ జగన్ మార్క్ పాలనకు నిదర్శనమని పేర్కొన్నారు.

టీడీపీ గూటికి జగన్ సన్నిహితుడు

పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన లోకేశ్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ముఖ్యమంత్రి జగన్ సన్నిహితుడు, మంగళగిరి రూరల్ మండలం కురగల్లు గ్రామానికి చెందిన ఎస్సీ కమిషన్ మాజీ సభ్యుడు కట్టెపోగు బసవరావు గురువారం తన అనుచరులతో టీడీపీలో చేరారు. జగన్‌కు సంఘీభావంగా ఇడుపులపాయ నుంచి విశాఖపట్నం వరకు బసవరావు గతంలో దాదాపు రెండు వేల కిలోమీటర్లు పాదయాత్ర చేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక జగన్ విధానాలతో విభేదించి ఎస్సీ కమిషన్ సభ్యత్వానికి రాజీనామా చేశారు. చంద్రబాబు నేతృత్వంలో దళితుల అభివృద్ధి సాధ్యమని నమ్మి తాము టీడీపీలో చేరుతున్నట్లు చెప్పారు. వీరితో పాటు తాడేపల్లి రూరల్ ఉండవల్లి గ్రామానికి చెందిన లంకా భువన శేషగిరి చరణ్, కె.ఫణిశర్మ ఆధ్వర్యంలో 20 మంది పార్టీలో చేరారు. వీరందరికీ లోకేశ్ పసుపు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. లోకేశ్ మాట్లాడుతూ ఎస్సీల కోసం గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన 27 సంక్షేమ పథకాలను రద్దుచేసిన దళిత ద్రోహి జగన్ అని దుయ్యబట్టారు. జగన్ పాలనలో 188 దళితులను ఊచకోత కోశారు. దళితులను చంపి డోర్ డెలివరీ చేసిన అనంతబాబు వంటి వారిని పక్కనబెట్టుకున్నారు. ప్రతిరోజూ రాష్ట్రంలో ఏదో మూల దళితులపై దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. అధికారంలోకి వచ్చాక దళితులకు పూర్తి రక్షణ కల్పిస్తామని, దళితులపై దాడులు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత ప్రభుత్వ హయాంలో దళితులకు అమలుచేసిన సంక్షేమ పథకాలన్నీ పునరుద్ధరిస్తామని చెప్పారు. ఎస్సీ కార్పొరేషన్‌ను బలోపేతం స్వయం ఉపాధి రుణాలు అందజేస్తామని పేర్కొన్నారు.

నేడు పులివెందులలో షర్మిల బస్సుయాత్ర

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పీసీసీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల శుక్రవారం కడప జిల్లా పులివెందుల నియోజకవర్గంలో బస్సు యాత్ర నిర్వహిస్తారని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.ఎన్.రాజు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు వేంపల్లి నుంచి ఆమె బయల్దేరి మధ్యాహ్నం 12 గంటలకు వరకు బస్సుయాత్ర కొనసాగిస్తారు. అనంతరం వేములకు వెళ్తుంది. మధ్యాహ్న భోజనం అనంతరం లింగాల, సింహాద్రిపురం, పులివెందుల ప్రాంతాల్లో ఆమె పర్యటిస్తారు. ఇప్పటికే షర్మిల కడప పార్లమెంట్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించారు. రాబోయే ఎన్నికల్లో ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని అభ్యర్థించారు.

యువతకు ఆంగ్లభాష నైపుణ్యాలు... బ్రిటన్ సంస్థలతో చర్చలు

విశాలాంధ్ర-విజయవాడ: యువతకు ఆంగ్ల భాషలో అవసరమైన నైపుణ్యం అందించేందుకు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి శిక్షణ సంస్థ ప్రఖ్యాత యునైటెడ్ కింగ్‌డమ్ (యుకే) ఆధారిత సంస్థలతో గురువారం చర్చలు జరిపింది. రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ మరియు శిక్షణ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేశ్ కుమార్, ఏపీఎస్‌ఎస్‌డీసీ ఎండీ రాజబాబుతో పాటు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలోని బ్రిటీష్ డిప్యూటీ హైకమీషనర్ గారెత్ విన్ ఓవెన్‌తో కలిసి వివిధ రంగాల్లో రాణించేందుకు గాను , యువతకు అవసరమైన భాషాపరమైన నైపుణ్యాలను అందించే శిక్షణలపై చర్చించారు. యూకే ఆధారిత సంస్థల ప్రతిపాదనలు ప్రకారం, యుకేలో ఉద్యోగాన్ని కోరుకునే ఆరోగ్య సంరక్షణ నిపుణులకు ఆంగ్ల భాషా శిక్షణ, సర్టిఫికేషన్‌ను అందించే అనేక రకాల శిక్షణ సంస్థలను కలిగి ఉన్నాయని తెలిపారు. బ్రిటిష్ కౌన్సిల్, స్కిల్ అండ్ ఎడ్యుకేషన్ గ్రూప్, పీయర్సన్, కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ, నీత్ పోర్ట్ టాల్బోట్ కాలేజ్ గ్రూప్ సంయుక్తంగా ఇంగ్లీష్ టెస్టింగ్ ప్రత్యామ్నాయాలు, వర్కర్ రైట్స్ ట్రైనింగ్, బ్లెండెడ్ లెర్నింగ్ మోడల్స్, ఆన్‌లైన్ కోర్సుల ప్రోగ్రామ్‌లను వివరించారు. ఈ ప్రయత్నాలు యునైటెడ్ కింగ్‌డమ్‌లో ఉపాధి అవకాశాల కోసం ముఖ్యంగా భారతదేశం నుంచి ఆరోగ్య సంరక్షణ కార్మికులను మెరుగ్గా సిద్ధం చేయడం, ధృవీకరించడం ప్రధాన లక్ష్యంగా పేర్కొన్నారు.

స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేశ్ కుమార్ మాట్లాడుతూ, యూకే ఆధారిత సంస్థల సహకారంతో ఆంధ్రప్రదేశ్‌లో నైపుణ్యం కలిగిన, ప్రపంచవ్యాప్తంగా పోటీతత్వం గల వర్క్‌ఫోర్స్‌ను తయారుచేయటమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. ఈ అవకాశాలు మన రాష్ట్ర యువతకు వివిధ రంగాలలో రాణించేందుకు భాష నైపుణ్యాలు పెంపొందించే అభివృద్ధి కారకాలు అని తెలియచేస్తూ సంతోషం వ్యక్తం చేశారు. ఈ ప్రసిద్ధ యుకే ఆధారిత సంస్థల సహకారంతో ప్రతిపాదించిన భాషా నైపుణ్య కోర్సులను పైలట్ ప్రాజెక్ట్‌గా ముఖ్యంగా హెల్త్‌కేర్, ఇతర అధిక డిమాండ్ ఉన్న రంగాల్లో ఆంధ్రప్రదేశ్ శ్రామిక శక్తి ఆంగ్ల భాషా నైపుణ్యం ఉపాధిని పెంపొందించడంపై దృష్టి కేంద్రీకరించబడుతుందన్నారు. నైపుణ్యాభివృద్ధి మరియు శిక్షణ సంస్థ అంతర్జాతీయ భాగస్వాములతో నిమగ్నమవడం యువతకు నాణ్యమైన శిక్షణ అందించడంలో దాని అంకితభావాన్ని తెలియచేస్తుందన్నారు.

జగన్‌పై దుష్ప్రచారాన్ని తిప్పికొట్టండి

చెప్పింది చేసేది వైసీపీ ప్రభుత్వమే: వైవీ సుబ్బారెడ్డి

విశాలాంధ్ర-విజయనగరం: దేశంలో ఏ ప్రభుత్వం అమలు చేయని సంక్షేమ పథకాలను జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అమలు చేసిందని వైసీపీ ఉత్త రాంధ్ర రీజనల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. పట్టణంలో గురువారం ఉమ్మడి విజయనగరం జిల్లా విస్తృస్థాయి సమావేశం పార్టీ విజయనగరం జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు అధ్యక్షత జరిగింది. సుబ్బారెడ్డి మాట్లాడుతూ అవినీతి కి తావులేకుండా అర్హులకు పథకాలు అందజేసిన ఘనత వైసీపీ ప్రభుత్వానిదేనన్నారు. లబ్ధిదారులు తిరిగి పథకాలు పొందాలంటే జగన్ అధికారంలోకి రావాలన్నారు. త్వరలో విజయనగరంలో మేమంతా సిద్ధం సభ జరుగుతుందని తెలిపారు. వైసీపీ ప్రభుత్వంపై కూటమి దుష్ప్రచారం చేస్తోందనీ, వాటిని తిప్పికొట్టాలని నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో 66 లక్షల మందికి పింఛన్ అందిస్తున్నట్టు చెప్పారు. డ్వాక్రా రుణాలు మాఫీ చేశామని తెలిపారు. డ్వాక్రా రుణమాఫీపై గతంలో చంద్రబాబునాయుడు మోసం చేశారన్నారు. 85 ఏళ్లు నిండిన వారిని, దివ్యాంగులను గుర్తించి వారు పార్టీకి ఓట్లు వేసేలా చేయాలన్నారు. కొత్త ఓటర్లను కలిసి అనుకూలంగా ఓటు వేయమని కోరాలని సూచించారు.

మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో పేద, బడుగు బలహీన వర్గాలకు జగన్ ప్రభుత్వం ఏర్పడాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. జగన్‌కు వ్యతిరేకంగా ప్రజలను ప్రభావితం చేసే ప్రయత్నం జరుగుతోందని, సోషల్ మీడియా ద్వారా వాటిని తిప్పికొట్టాలన్నారు. జగన్... చెప్పింది చేస్తారనీ, చేసేది చెప్తారన్నారు. నవరత్నాలలో ఒక్క సీపీఎస్ హామీ అమలు చేయలేకపోయామనీ అందుకు ఆర్థిక పరిస్థితులే కారణమన్నారు.దానికంటే మెరుగైన పథకం తెచ్చామని చెప్పారు. మీ కుటుంబానికి మంచి జరిగితేనే ఓటెయ్యమని కోరిన ఏకైక నేత జగన్మోహన్ రెడ్డి మాత్రమేన్నారు. ఐఏఎస్ లపై పురందేశ్వరి ఫిర్యాదు చేశారనీ, వారంతా చంద్రబాబు నాయుడు, కిరణ్ కుమార్ రెడ్డి, రోశయ్య దగ్గర పని చేసినవారేనన్నారు. వారిని కాదని హెరిటేజ్ ఫుడ్స్ వారితో ఎన్నికలు నిర్వహించాలా అని బొత్స ప్రశ్నించారు. పార్వతీపురం జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు, పరీక్షిత్ రాజు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, డిప్యూటీ స్పీకర్, విజయనగరం ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్ర స్వామి, డిప్యూటీ సీఎం, సాలూరు ఎమ్మెల్యే పీడిక రాజన్నదొర, అరుకు పార్లమెంట్ అభ్యర్థి తనూజ మాట్లాడారు. ఉమ్మడి జిల్లాల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.



14న ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర స్థాయి ప్లీనరీ

విశాలాంధ్ర- గుంటూరు కార్పొరేషన్: నగరంలోని ఏటుకూరు రోడ్డు వివాహ కన్వెన్షన్ హాల్‌లో ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో "భవిష్యత్తు రాజకీయ కార్యాచరణ"పై ఈ నెల 14న రాష్ట్ర స్థాయి ప్లీనరీ నిర్వహించనున్నట్టు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు, జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర యువజన అధ్యక్షుడు కుమ్మర క్రాంతికుమార్ తెలిపారు. గుంటూరు చుట్టగుంటలోని రాష్ట్ర యువజన కార్యాలయంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి బీసీ నేతలు హాజరుకానున్నట్లు తెలిపారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో రాజకీయంగా ఎలాంటి నిర్ణయాలు తీసుకోవాలనే దానిపై సుదీర్ఘంగా చర్చించటం జరుగుందన్నారు. అంబేద్కర్ తెలిపిన "పొలిటికల్ పవర్ ఇన్ ది మాస్టర్ కీ" సాధించేందుకు, ఏపీలో రాజ్యాధికార సాధన ఆశయాన్ని నెరవేర్చేందుకు, ప్రతి బీసీ నేత ఈ ప్లీనరీలో పాల్గొని, అభిప్రాయాలు తెలియజేయాలని కోరారు. స్వల్ప, దీర్ఘకాలిక రాజకీయ లక్ష్యాల రూపకల్పనకు, ఏకగ్రీవ తీర్మానాన్ని ఆమోదించుకొని ఐక్యంగా ముందుకెళ్లేలా సమిష్టిగా కృషి చేద్దామని పిలుపునిచ్చారు. రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కన్నా మాస్టర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ కోలా అశోక్, బీసీ నేతలు కొల్లికొండ సుబ్రహ్మణ్యం, హనుమంతురావు, మొరం సాయి, తిరుపతిరావు, ద్వారక శ్రీనివాస్ పాల్గొన్నారు.

సంపాదకీయం

సరిహద్దు సమస్యపైనా అసత్యాలే

మూడు నాలుగేళ్ల నుంచి చైనా నెమ్మది నెమ్మదిగా మన సరిహద్దులోకి చొచ్చుకు వస్తోంది. వేలాది చదరపు కిలోమీటర్ల భారత భూభాగాన్ని ఆక్రమిస్తోంది. అక్కడ రోడ్లతో సహా అనేక రకాల నిర్మాణాలు కొనసాగిస్తోంది. అయినా రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఈ అంశంపై అసలు పెదవే విప్పరు. ప్రధానమంత్రి మోదీ, విదేశాంగ మంత్రి ఎస్. జై శంకర్ ఇప్పుడు కొత్తగా కేంద్ర హోం మంత్రి అమిత్ షా మాటల మధ్య ఏ మాత్రం పొంతన కుదరడం లేదు. వీరి మాటల్లో ఏకరూపత ఏమైనా ఉంటే అది నిజాన్ని దాచిపెట్టడంలో మాత్రమే కనిపిస్తుంది. గత తొమ్మిదవ తేదీన కేంద్ర హోం మంత్రి అమిత్ షా లఖింపూర్ లోకసభ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న బీజేపీ అభ్యర్థి ప్రదాన్ బరువా తరఫున ఎన్నికల ప్రచారంచేస్తూ భారత చైనా మధ్య సరిహద్దులో కొనసాగుతున్న గందరగోళ పద్ధతిని తనదైన శైలిలో ప్రస్తావించారు. "చైనా మన భూభాగాన్ని ఒక్క అంగుళం కూడా ఆక్రమించలేక పోయింది. నరేంద్ర మోదీ ఇంతటి పటిష్ఠ పరిపాలన అందిస్తారు" అన్నారు. చైనా అసలు మన భూభాగంలోకి చొచ్చుకు రాకపోతే ఒక్క అంగుళం నేలనైనా ఆక్రమించలేదని చెప్పడంలో పరమార్థం ఏమిటో! విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్. జైశంకర్ మాత్రం "చైనా పెద్ద ఆర్థిక వ్యవస్థ. నేనేం చేయగలను. మనది చైనా కన్నా చిన్న ఆర్థిక వ్యవస్థ. మనకన్నా పెద్ద ఆర్థిక వ్యవస్థతో ఎలా తలపడగలం? ఇది ఇంగిత జ్ఞానానికి సంబంధించిన అంశం" అన్నారు. జై శంకర్ చైనా మన భూభాగంలోకి చొచ్చుకు రాలేదని కానీ, దూసుకు రాలేదని కానీ ప్రస్తావించకుండా ఆ దేశంతో తలపడే శక్తి మనకు లేదన్నారు. చైనా మన భూభాగాన్ని ఆక్రమించిందన్న కచ్చితమైన రుజువులున్నా మోదీ ప్రభుత్వం మాత్రం వాస్తవం అంగీకరించడం లేదు. చైనా లడాఖ్‌లో మన భూభాగాన్ని ఆక్రమించిందన్న సమాచారం 2020 జూన్ లో అందింది. చైనా దళాలతో జరిగిన ఘర్షణలో మన 20 మంది సైనికులు నేలకొరిగారు. అనేక మంది భారత సైనికులను చైనా బందీలుగా పట్టికెళ్లింది. అదే సమయంలో ప్రధాని మోదీ ప్రతిపక్షాలతో సమావేశం ఏర్పాటు చేశారు. "వారు మన భూభాగంలోకి చొచ్చుకు రానూ లేదు. మన నిఘా శిబిరాలను స్వాధీనం చేసుకోనూ లేదు" అని ఆ సమావేశంలో చెప్పారు. మన జవాన్లు 20 మంది ప్రాణాలు అర్పించారు. వారికి మన దళాలు గుణపాఠం చెప్పాయి అన్నారు. "మన భూభాగంలోకి ఎవరు చొరబడలేదు లేదా చొరబడి లేరు" అన్న మోదీ మాటలు ఆ రోజుల్లో బాగా ప్రచారంలోకి వచ్చాయి. "మన భద్రతా దళాలకు ఇప్పుడు ఒకేసారి అనేక రంగాలలోకి దూకే సామర్థ్యం ఉంది" అని కూడా అన్నారు. ఆ మరుసటి నెలలోనే అంటే 2020 జులైలో వ్యూహాత్మక వ్యవహారాలలో నిపుణుడైన కల్నల్ అజయ్ శుక్లా సరిహద్దులోని సైనికులను ఉటంకిస్తూ చైనా పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ ఉపసంహరించుకోవడానికి నిరాకరించింది అన్నారు. హాట్ స్ప్రింగ్స్, గోగ్రా హైట్స్ లో 1500 మంది భారత సైనికులు పోరాడుతున్నారు అని కూడా తెలియజేశారు. చైనా అప్పటికే రెండు నుంచి నాలుగు కిలోమీటర్ల మేర చొచ్చుకు వచ్చిందని అన్నారు. అంటే ఈ రెండు చోట్లా ఘర్షణ జరుగుతోందనేగా. చొచ్చుకు వచ్చిన భారత భూభాగం నుంచి వెనక్కు వెళ్లడానికి చైనా నిరాకరిస్తోందనేగా! మాజీ సైనికాధికారుల వాదనను మోదీ ప్రభుత్వం అప్పుడు ఖండించలేదు. పైగా 2020 జూన్ కు ముందున్న చోటికి వెనక్కు వెళ్లాలని చైనాకు చెప్పడానికి కమాండర్ల స్థాయిలో 21 విడతల చర్చలు జరిగాయి. ఏ సమస్య లేకపోతే చర్చల అవసరమేమిటో!

గల్వాన్ లో ఘర్షణ జరగక ముందు నాటి స్థితికి రావడానికి చైనాతో చర్చలు జరుగుతున్నాయని భారత సేనాధిపతి గత ఫిబ్రవరిలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ చెప్పారు. ఈ చర్చల్లో సానుకూల పరిణామం ఏమీ కనిపించలేదు. ఏ గొడవా లేకపోతే చర్చలు ఎందుకు? వెయ్యి చదరపు కిలోమీటర్ల భారత భూభాగం చైనా అధీనంలోకి వెళ్లింది అని 2020 ఆగస్టులోనే గూఢచార శాఖ మోదీకి తెలియజేసింది. అయినా ఆయన చైనా చొరబడలేదనే ఇప్పటికీ వాదిస్తున్నారు. గల్వాన్ లోయలో 20చ.కి.మీ.లు, పోంగాంగ్‌త్సోలో 65 చ.కి.మీ.లు, చుశాల్‌లో 29 చ.కి.మీ.లు చైనా అధీనంలోకి వెళ్లిందని సైనికాధికారులు చెప్పారు. మాజీ కల్నల్ అజయ్ శుక్లా చెప్పిందీ ఇదే. చైనా చొరబాటువల్ల మన పశువుల కాపర్లు గోగ్రా ప్రాంతంలోకి వెళ్లలేకపోతున్నారు. దీన్ని మోదీ ప్రభుత్వం ఖండించలేదు. 2023 జనవరిలో ఏటా జరిగే పోలీసు డైరెక్టర్ జనరళ్ల సమావేశంలో లేహ్ పోలీసు సూపరింటెం డెంట్ ఒక పత్రం సమర్పిస్తూ మొత్తం 65 గస్తీ పాయింట్లు ఉంటే ఇప్పుడు 26 పాయింట్లు మన అధీనంలో లేవని చెప్పారు. ఇక్కడ భారత భద్రతా దళాలు గస్తీ తిరగనందువల్ల చైనా తిష్ఠ వేసింది. అంటే చైనా ప్రతిఘటనవల్ల మన దళాలు గస్తీ తిరగలేక పోతున్నాయి. గత జనవరి నుంచి వాస్తవాధీన రేఖవద్ద మన పశువుల కాపర్లను చైనా పశువులను మేపుకోనివ్వడం లేదు. ఈ వార్తలను సైతం మోదీ ప్రభుత్వం ఖండించలేదు. చైనా చొరబడలేదన్న రాగమే ఆలపిస్తోంది. 2022 ఫిబ్రవరిలో బీజేపీ సభ్యుడు అడిగిన ప్రశ్నకు విదేశాంగ శాఖ సహాయ మంత్రి వి.మురళీధరన్ నేరుగా సమాధానం ఇవ్వకుండా 1962 నుంచి 38,000 చ.కి.మీ.ల భూభాగాన్ని ఆక్రమించింది అని డొంక తిరుగుడు సమాధానం చెప్పి నెహ్రూను బోనులో నిలబెట్టే ప్రయత్నం చేశారు. గత తొమ్మిదవ తేదీన అమిత్ షా చేసిన ప్రయత్నమూ అదే. 1962 లో చైనా యుద్ధ సమయంలో నెహ్రూ అస్సాం ప్రజలను గాలికి వదిలేశారు అన్నారు. మోదీ హయాంలో చైనా ఒక్క అంగుళం భూమిని కూడా ఆక్రమించలేదు అని దబాయించారు. వాస్తవాలు దీనికి పూర్తి విరుద్ధంగా ఉన్నాయి. దేశ సరిహద్దు, భద్రత విషయంలోనూ అబద్ధాలు చెప్పగలగడం మోదీ సర్కారు ప్రత్యేకత. విదేశాంగ మంత్రి చైనా ఆర్థిక వ్యవస్థ చాలా పెద్దది కనక మనం ఎలా తలపడగలము అంటే అమిత్ షా, మోదీ హయాంలో ఒక్క అంగుళం భూమిని కూడా చైనా ఆక్రమించలేదు అని అమిత్ షా వాస్తవాలను కప్పి పుచ్చి మోదీ భజనలో నిమగ్నమై పోతారు. ఇటీవలి కాలంలో పొరుగు దేశాలను ప్రస్తావించేటప్పుడైనా చైనా ఊసెత్తడం లేదు.

నెతన్యాహు రాజీనామాకు భారీ ప్రదర్శనలు

జో హదిరెక్

ఇజ్రాయిల్ ప్రధానమంత్రి, నిరంకుశుడు బెంజమిన్ నెతన్యాహు తక్షణం రాజీనామా చేయాలని, కాల్పులు విరమించి శాంతి నెలకొల్పాలని డిమాండ్‌చేస్తూ రాజధాని టెలిఅవీవ్‌లో అత్యంత భారీ ప్రదర్శన గత శనివారం జరిగింది. ప్రదర్శనలో లక్షమందికిపైగా పాల్గొన్నారు. నెతన్యాహు రాజీనామా చేసి వెంటనే న్యాయంగా ఎన్నికలు జరపాలని కోరుతూ అనేక వేలమంది ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. గాజాలోని అనేక నగరాలు జెరూసలెం, హైఫా, బీర్‌షెవ, ఫర్‌సవ, కార్మూర్,

ఇలాట్, కిరియత్‌గర్, షార్ హెన్‌జెవ్ నగరాల్లో నిర్బంధించిన బందీలను తక్షణం విడుదల చేయాలని, కాల్పుల విరమణ ఒప్పందాన్ని అమలుచేయాలని ప్రదర్శకులు డిమాండ్ చేశారు. ఆరునెలలుగా ఇజ్రాయిల్ పలస్తీనాపై దాడిచేసి అత్యంత క్రూరంగా మారణకాండ జరుపుతోంది. గత అక్టోబరు 7వ తేదీన రాత్రి హమాస్ పోరాటవీరులు ఇజ్రాయిల్‌పై బాంబులు వేశారు. ఈ దాడుల్ల 1400 మంది ఇజ్రాయిల్ పౌరులను బందీలుగా పట్టుకొన్నారు. పలస్తీనాకు స్వాతంత్ర్యం ఇవ్వాలని సుదీర్ఘకాలంగా పోరాటం జరుగుతోంది. విసుగుచెందిన హమాస్ వీరులు బాంబులు వేశారు.

టెల్‌అవీవ్‌లో ప్రదర్శకులపై ఒక కారు దూసుకు వచ్చింది. ఈ సందర్భంగా తీసిన వీడియోలో కారు డ్రైవరు హాయిమ్ సిరోట్కిన్‌గా గుర్తించారు. అతను నెతన్యాహు లికుడ్ పార్టీకి చెందిన కార్యకర్తగా గుర్తించారు. సిరోట్కిన్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ప్రదర్శన రక్షణమంత్రిత్వశాఖ భవనం వద్ద జరిగింది. ఈ ప్రాంతానికి "డెమోక్రసి స్క్వేర్" గా పేరుపెట్టారు. ప్రదర్శనకారులు సైనిక కార్యాలయాలకు సమీపంలో అనేక చోట్ల మంటలు వేశారు. అనేక వీధుల్లో ప్రదర్శనలు జరుపుతున్న వారిపై పోలీసులు దాడిచేసి కొట్టారు. పోలీసులు ప్రదర్శనకారులను అదుపులోకి తీసుకున్నారు.

"డెమోక్రసి స్క్వేర్" లో జరిగిన సభ ముగిసిన తర్వాత ప్రదర్శనకారులు సైనిక ప్రధాన కార్యాలయం వద్దకు వెళ్లి కాల్పులు విరమించి శాంతి నెలకొల్పాలని నినాదాలు చేశారు. ఇక్కడ పోలీసులకు, ప్రదర్శనకారుల మధ్య ఘర్షణ జరిగింది. ప్రదర్శనకారుడు ఒకరు మహిళా పోలీసు అధికారి కొట్టారని ఆరోపిస్తూ పోలీసుల ప్రతినిధి ప్రకటన జారీచేశారు. ఇజ్రాయిల్‌లో అతి పెద్ద కార్మికుల యూనియన్ కార్యలయం వద్దకు వెళ్లారు. యూనియన్ ఛైర్మన్ అర్నాన్ బార్ డేవిడ్ మితవాద ప్రభుత్వానికి వ్యతిరేకంగా దేశవ్యాప్త కార్మికసమ్మెకు పిలుపునిచ్చారు. యూనియన్ కార్యాలయం వెలపల ప్రదర్శకులు ఒకరోజు పగలంతా సమ్మె చేయాలని నినాదాలు చేశారు. బెన్ గురియన్ ఎయిర్ పోర్టు వద్ద ఎయిర్‌పోర్టు కార్మికులు, లేబర్ యూనియన్‌లు ప్రదర్శనకారులకు మద్దతుగా నినాదాలు చేశారు. గత సంవత్సరం కూడా ఒక రోజంతా పాలక మితవాద ప్రభుత్వానికి వ్యతిరేకంగా న్యాయశాఖలో సంస్కరణలు చేపట్టాలని సమ్మె చేశారు. ప్రధాన నెతన్యాహు నివాస భవనానికి వెలుపల ఇజ్రాయిల్‌లో బందీలుగా ఉన్న వారి కుటుంబాలకు చెందిన 2వేల మందికిపైగా చేరి బందీలను తక్షణం విడుదల చేయాలని నినాదాలు చేశారు. వీరినుద్దేశించి కార్మిటెపాల్టీ కట్జిర్ మాట్లాడారు. బందీలైనవారిని తక్షణం విడుదల చేయాలని కోరుతూ ప్రభుత్వ ప్రతినిధులతో చర్చించి విడిపించాలని కోరారు. హఫియా గ్రూపు కార్మెట్ పాల్టీ ప్రకటనను ఫేస్‌బుక్‌లో ఉంచారు. నెతన్యాహు ప్రైవేటు నివాసభవనం వద్ద ముగ్గురు ప్రదర్శకులను అరెస్టు చేశారు. పలస్తీనాను నామరూపాలు లేకుండా చేస్తానని నెతన్యాహు మాట్లాడుతున్నప్పటికీ తొలినుంచి ఇజ్రాయిల్‌ను ప్రోత్సహిస్తున్న అమెరికా, దాని మిత్రదేశాలు ముందుకువచ్చి ఇజ్రాయిల్-పలస్తీనా మధ్య శాశ్వాత పరిష్కార ఒప్పందం కుదర్చడానికి కృషిచేయాలి. ఐక్యరాజ్యసమితి ఇందుకు చొరవ తీసుకోవాలి. అసలు ఇజ్రాయిల్‌ను పలస్తీనా ప్రాంతంలో ఏర్పాటు చేసింది సామ్రాజ్యవాద అమెరికానే. ఇజ్రాయిల్ ఏర్పాటునాడే పలస్తీనా వ్యతిరేకించింది. ఆనాటి నుండి ఇజ్రాయిల్ పలస్తీనాపై దాడులు కొనసాగిస్తూనే ఉంది.

మోదీజీ... ఇండియా ఏమీ మారలేదు!

ఎ.జె.ఫిలిప్

ప్రధాని మోదీ రాసిన లేఖపై స్పందిస్తూ, ప్రముఖ కాలమిస్ట్ ఎజె ఫిలిప్ రాసిన బహిరంగ లేఖ సారాంశం.

గౌరవనీయ ప్రధాని మోదీజీ,

మార్చి 15, 2024 న మీరు హిందీ, ఇంగ్లీషులో రాసిన లేఖను అందుకొని అమితాశ్చర్యానికి గురయ్యాను. దేశంలోని 140 కోట్ల మంది ప్రజల విశ్వాసాన్ని, మద్దతును ఎలా పొందారో మీరు తెలియజేశారు. చాలా సంతోషం.మహిళలు, యువకులు, పేద రైతుల జీవితాలను మీరు ఏవిధంగా మెరుగుపరిచారో లేఖలో తెలియజేశారు. రైతులు తమ కోర్కెలు తెలియజేయడానికి దిల్లీకి రాకుండా దిల్లీ సరిహద్దులో అడ్డగించి, డ్రోన్‌లతో టియర్ గ్యాస్ షెల్స్ విడిచిన విషయాన్ని మరిచిపోలేను. రైతులు తమ ఉద్యమాన్ని విరమించలేదు. శాంతియుతంగా పోలింగ్ జరగడానికి వాయిదా వేశారు. యువకులు, మహిళల జీవితాలు మారాయని మీరు ఎలా చెప్పగలుగుతున్నారో నాకు తెలియదు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని వాగ్దానం చేశారు. అదే జరిగితే 20-40 సంవత్సరాల మధ్య వయస్కులు 20 కోట్ల మందికి ఉద్యోగాలు వచ్చేవి. మీరు వాగ్దానం చేసిన వారిలో కొద్దిమందికైనా ఉద్యోగాలిచ్చారా? నిజంగా మహిళలు ఉద్యోగాలు పొందారా?

మీరు గుజరాత్‌లో ఐక్యతకు చిహ్నంగా సర్దార్‌వల్లభాయ్ పటేల్ విగ్రహాన్ని నిర్మించారు. వందలమంది మహిళలను ఆటో రిక్షా డ్రైవర్లుగా నియమించడాన్ని నేను చూశాను. వారితో మాట్లాడాను. ఎవరూ సంతోషంగా లేరు. ఈ ఉద్యోగంలో సమయానుకూలంగా పని ఉంటుంది తప్ప, ఆదాయం పెద్దగా లేదని తమ జీవితాలను ఏ మాత్రం మార్చలేవని అన్నారు. తమ ఆరోగ్యం తోడ్పడితేనే తాము పనిచేయగలమని అన్నారు. గుజరాత్‌లో ఉద్యోగంలో ఉన్న మహిళల స్థితి, నిరుద్యోగ మహిళల పరిస్థితి ఏమిటో మీరే ఆలోచించండి. భారతదేశంలో అతి పెద్ద మెడికల్ కాలేజీ ఎయిమ్స్ ను దర్శించాను. 6000 మంది నర్సులు పని చేస్తున్నారు. మంచి వసతులున్నాయి. కాని పేదలకు అవసరమైన మందులు లేవు. వాళ్లు కొనుక్కోవలసిందే. "ఆయుష్మాన్ భారత్" ద్వారా ఉచిత సేవలందిస్తున్నట్లు మీరు గొప్పగా చెబుతారు. అదే విధంగా గృహ నిర్మాణ పథకాలు, విద్యుత్, నీటి సౌకర్యాల ఏర్పాటు, ఎల్.పి.జి గురించి కూడా భారీ ప్రకటనలు వస్తుంటాయి. "సుసంపన్నమైన సంస్కృతితో దేశం ముందుకు పోతున్నందుకు నేడు ప్రతి పౌరుడు గర్విస్తున్నాడు". అని మీరు రాశారు. మీ లేఖ చదివిన తరువాత ప్రపంచ సంతోష రిపోర్టు 2024 చూసి ఆశ్చర్య పోయాను. మొదటి స్థానానికి రావడానికి అనేక సంవత్సరాలు పడుతుందని నాకు తెలుసు. ప్రస్తుతం ఆ స్థానంలో ఫిన్‌లాండ్ ఉన్నది. భారతదేశం 126 వ స్థానంలో ఉంది. గత సంవత్సరం కూడా అదే స్థానంలో ఉంది. భారతదేశం, చైనా రెండూ ఎక్కువ జనాభా ఉన్న దేశాలు. భారతదేశం విడిచి, బ్రిటీషు వాళ్లు వెళ్లారు. అదే సమయంలో కమ్యూనిస్టు విప్లవం వచ్చింది. మన దేశం 126 వ స్థానంలో ఉంటే చైనా 60 వ స్థానంలో ఉంటే ఆశ్చర్యం కలిగించదా. మనం వైఫల్యం చెందిన పాకిస్తాన్ అని ఎగతాళి చేస్తే అది 108 వ స్థానంలో ఉంటే మన కంటే బాగున్నట్లే కదా! నేపాల్, మైన్మార్ 92, 118 స్థానాలలో ఉన్నాయి.

ఇటీవల 10,000 మంది ప్రజలు చనిపోయి, లక్షలాది ప్రజలు నిరాశ్రయులైన బుర్కినా ఫాసో సైతం భారతదేశం కంటే సంతోషకర దేశంగా ఉంది. రష్యాతో తీవ్ర యుద్ధంలో ఉన్న ఉక్రెయిన్‌లు కూడ మనకంటె సంతోషంగా ఉన్నారు. అఫ్గానిస్తాన్ కంటే మన దేశం కొద్దిగా బాగా ఉన్నదని ఎందుకున్నదని "హాపినెస్ రిపోర్టు 2024" నిర్వాహకులను వివరణ కోసం ఒత్తిడి చేశారు. కొద్దిమంది సంతోషంగా ఉండటం కాదు, అత్యధికులు సంతోషంగా లేరని వాళ్లు తేల్చారు. మీరు 2014 లో అధికారంలోకి వచ్చినపుడు ప్రధానిగా ప్రమాణం చేయడానికి దిల్లీ రావడానికి విమానాన్ని ఏర్పాటు చేసిన అదాని మొదటి 10 మంది పారిశ్రామికులలో ఒకరుగా ఉన్నారా? ఆ అవకాశమే లేదు. కాని హిండెన్‌బర్గ్ నివేదిక ప్రకారం భారతదేశంలోనే కాదు, - బహుశా ప్రపంచంలోనే అత్యంత సంపన్నుడు. విడి భాగాలను కూర్చి కార్లను ఉత్పత్తి చేసి హెన్రీ ఫోర్డు మాదిరి అదాని ఒక కొత్త ఆవిష్కరణను ప్రవేశపెట్టాడా? యాపిల్ కంప్యూటర్‌లు, ఐ-ఫోన్లు ప్రవేశపెట్టిన స్టీవ్‌జాబ్స్, ఫేస్‌బుక్ నిర్మించిన జుకర్‌బర్గ్, పుస్తకాల షాపు లేకుండా పుస్తకాలను అమ్ముతున్న అమెజాన్‌ను ఏర్పాటు చేసిన బిజోస్, కార్ నూతన భావనను ప్రవేశపెట్టిన ఎలాన్ మస్క్ మాదిరి అదాని ఏదైనా నూతన ఉత్పత్తులను ప్రవేశపెట్టాడా? విమానాశ్రయాన్ని తాత్కాలికంగా అంతర్జాతీయ విమానాశ్రయంగా మార్చారు. ఏ విధంగా పెట్టుబడి పెట్టాలో అదానీకి బాగా తెలుసు. దేశ వ్యాపితంగా 2014 లో ఎన్నికల ప్రచారం చేసుకోవడానికి ట్యాంకు నిండా ఇంధనం నింపిన హెలి కాప్టర్‌ను మీకివ్వడమే గొప్ప పెట్టుబడి. లాక్‌డౌన్ సందర్భంలో 2020 లో లక్షలాది మంది ప్రజలు మూడు పూటలా తినడానికి ఇబ్బంది పడుతున్న దశలో రోజుకు వేలాది కోట్ల రూపాయల అదాని స్టాక్‌ల విలువ పెరిగింది. భారతదేశ వివాహాల గురించి టీవీ సీరియల్స్ కథనాలు విరివిగా వచ్చాయి. మీ స్నేహి తుడు ముఖేష్ అంబాని జామ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన "నిశ్చితార్థం" విచ్చలవిడిగా చేసిన ఖర్చు, 2000 మందికి భోజన ఏర్పాట్లు దిమ్మతిరిగాయి. నిశ్చితార్థానికి వచ్చిన అతిథులను సంతోష పెట్టడానికి రూ.70/- కోట్లు వెచ్చించి అమెరికా నుండి గాయకుడిని తీసుకువచ్చారు. నాకు అర్థం కానిది ఏమిటంటే పాకిస్థాన్ బోర్డర్‌లో ఉన్న జామ్‌నగర్ ఎయిర్‌పోర్టును అంతర్జాతీయ ఎయిర్‌పోర్టుగా మార్చారు. జుకర్‌బర్గ్ లాంటి వాళ్లకు వీడ్కోలు చెప్పడానికా? అహ్మదాబాద్ లేదా ఇతర అంతర్జాతీయ ఎయిర్‌పోర్టులలో ప్రైవేట్ విమానాలు దిగడానికి అనుమతిస్తే స్వర్గలోకాలు సైతం కూలిపోతాయి. కార్యక్రమానికి వచ్చే సంపన్న అతిథులను సంతృప్తిపరచడం మీ ఉదారవాదం కావచ్చు. నా మనసులో ఏమొచ్చిందంటే 1877లో విక్టోరియా మహారాణి భారతదేశానికి రాణిగా ప్రకటించినపుడు మహారాజులందరు దిల్లీలోని కొరొనేషన్ పార్క్‌కు చేరినట్లుందని. తిరిగి ప్రస్తుతానికి వద్దాం. భారతదేశంలోని 50శాతం ప్రజలు 3శాతం జాతీయ సంపదను కలిగి ఉన్నారు. వారి మధ్య అంతరం పెరుగు తోంది. వారిలో సంతోషం లేదు. ఈ సమస్య పరిష్కరించనంత వరకు భారతదేశం సంతోష సూచికలో అట్టడుగునే ఉంటుంది. మణిపూర్ ప్రజలు సంతోషంగా ఉన్నారా? అనేకమందిని బయటకు వెళ్లగొట్టినపుడు మీరు వస్తారని ఎదురుచూశారు. నేను ఇది రాస్తున్నప్పుడు మీరు భూటాన్‌లో ఉన్నారు. వారు కూడా భారతీయుల కంటే సంతోషంగా ఉన్నారు. మీకు అత్యంత ప్రసిద్ధి చెందిన ప్రదేశాలు సందర్శించడానికి సమయం ఉంది. కాని అత్యంత దయనీయ స్థితిలో ఉన్న మణిపూర్‌ను సందర్శించడానికి సమయం లేదు. ఆర్టికల్ 370 ని రద్దు చేయడం గొప్ప విజయంగా పేర్కొంటున్నారు. ఇంతకు ముందు ఎన్నికల ప్రణాళికల్లో ప్రస్తావిస్తూనే ఉన్నారు. మీరు జమ్ము-కశ్మీర్‌ను కేంద్రపాలిత రాష్ట్రాల స్థాయికి తగ్గించడానికి ఆ రాష్ట్ర ప్రజల అభిప్రాయాలు తీసుకున్నారా? భారతదేశంలో ముస్లిం మెజారిటీ రాష్ట్రం జమ్ము-కశ్మీర్ మాత్రమే. అసలు వాస్తవం ఏమిటంటే ఇండియాలో అటువంటి రాష్ట్రం ఉండకూడదని మీరు కోరుకుంటున్నారు. మీ కాబినెట్‌లో ముస్లింలు, క్రిస్టియన్‌లు ఎందుకు లేరు? ఒకప్పుడు ముస్లింలు, హిందువులు నా రెండు కళ్లని ప్రకటించారు కదా. రోడ్డుపై ప్రార్థన చేసుకుంటున్న ముస్లిం యువకుడిని దిల్లీలో ఒక పోలీసు తన్ని నెట్టేశాడు. నాగరిక దేశంలో ఇది జరగలేదు. ఇది సోషల్ మీడియాలో రావడంతో ఆ పోలీస్‌ను సస్పెండ్ చేశారు. ముస్లింలు ప్రార్థన చేసుకోవాలంటే భయపడాల్సి వస్తున్నది. ఇంతకు ముందు ఘర్షణలు జరిగినపుడు మసీదులపై దాడి చేసేవారు. ఇప్పుడు బుల్ డోజర్‌లు వచ్చాయి. ముస్లిం వనిత బిల్కిస్ బానోపై మూకుమ్మడి అత్యాచారం చేసిన వాళ్లను విడిపించి ఘన సత్కారం చేశారు. గుజరాత్‌లోని ఒక శాసనసభ్యుడు "రేపిస్టుల" ను సంస్కారం కలిగినవారిగా వర్ణించాడు. గర్భవతిని "మానభంగం" చేసి, మూడు సంవత్సరాల కూతురుని చంపడం "సంస్కాంం అవుతుందా'?

తమిళనాడు నుండి స్వామీజీలను దేశ వ్యాపితంగా 75 మంది పంచాయతీ సభ్యులను పిలిపించుకొని పార్లమెంట్ భవనాన్ని (నూతన) ఘనంగా ప్రారంభించారు. స్వామీజీలు ఎప్పుడు ఎన్నికల్లో ఓటు వేయలేదు. "వామపక్ష తీవ్రవాదాన్ని" నియంత్రిస్తున్నందుకు మీరు ఆనందపడుతున్నారు, కాని "మితవాద తీవ్రవాదం"పై మౌనంగా ఉన్నారు. పరిస్థితులు ఎంత దిగజారాయో మీకు తెలుసా, చిన్నపాటి గ్రూపు ప్రార్థనా స్థలంలో ప్రార్థన చేసుకుంటుంటే వారి విశ్వాసంపై దాడి జరుగుతున్నది. గ్రామాలలో క్రిస్టియన్ వ్యతిరేకత పెరుగుతున్నది. ఎప్పుడూ మీరు మౌనంగానే ఉంటున్నారు. మితవాద తీవ్రవాద దాడులతో మైనారిటీ వర్గాలు బాధపడుతున్నాయి. నేను అవినీతిని బలపర్చను. మద్యం విధానంలో వ్యాపారస్తుల నుండి దిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ జైలు కెళితే, ఎలక్టోరల్ బాండ్ల పేరుతో వ్యాపార వర్గాలు, లిక్కర్ స్కాంలో ఉన్న వ్యాపారులు ఇచ్చిన బాండ్లు తీసుకున్నందుకు మీ పార్టీకి శిక్షలేదేం.

(నేషనల్ హెరాల్డ్ సౌజన్యంతో)

దశాబ్దిలో వ్యవసాయ సంక్షోభం

బొల్లిముంత సాంబశివరావు

మరో రెండు నెలల్లోపు 10 సంవత్సరాల మోదీ పాలన పూర్తి అవుతుంది. ఈ పది సంవత్సరాల ఆయన పాలన గమనిస్తే అన్ని రంగాల్లోనూ విఫలమైంది. వ్యవసాయ, పారిశ్రామిక రంగాలు తీవ్ర సంక్షోభంలో ఉన్నాయి. ఫలితంగా గ్రామీణ, పట్టణ పేదలు, కార్మికులు ఉపాధికి దూరమౌతున్నారు. ఉపాధిలేమితో నిరుద్యోగం పెరుగుతూ ఉంది. దేశంలో పేదరికం, నిరుద్యోగం పెరుగుతుండగా ఇంకొక వైపు సంపద కేంద్రీకరణ పెరుగుతున్నది. మోదీ అనుసరిస్తున్న ఆర్థిక విధానాలవల్ల దేశం అప్పుల్లో కూరుకుపోతోంది.

సంక్షోభంలో వ్యవసాయ రంగం: భారతదేశంలో పనిచేసే జనాభాలో 50శాతంపైగా వ్యవసాయ రంగం నుండే జరుగనున్నది. ఇంత ప్రాధాన్యత గల వ్యవసాయ రంగాన్ని మోదీ ప్రభుత్వం సంక్షోభంలోకి నెడుతూనే ఉంది. 2022 నాటికి రైతుల ఆదాయం రెట్టింపు చేస్తానని చెప్పిన మోదీ అందుకు విరుద్ధంగా రైతాంగ వ్యతిరేక విధానాలు అమలు జరుపుతున్నాడు. పంటలకు న్యాయమైన మద్దతు ధరలు ప్రకటించి వాటికి చట్టబద్ధత కల్పించటానికి వ్యతిరేకత వ్యక్తం చేశాడు. ఉత్పత్తి ఖర్చులు పెరగటం, పంటలకు న్యాయమైన ధరలు లభించక పోవటం వలన వ్యవసాయం ద్వారా రైతులకు నామమాత్రపు ఆదాయమే లభిస్తున్నది. జాతీయ గణాంకాల శాఖ 2021 సెప్టెంబర్ 10న ప్రకటించిన నేషనల్ శాంపిల్ సర్వే ప్రకారం, చిన్న రైతులకు వ్యవసాయం ద్వారా రోజువారి సగటు ఆదాయం 27 రూపాయలు. నెలకు 816 రూపాయలు కాగా సంవత్సరానికి 3,898 రూపాయలు మాత్రమే. వ్యవసాయ ఆదాయంతో పాటు ఇతర మార్గాల ద్వారా వచ్చే ఆదాయం కలుపుకుంటే కుటుంబ ఆదాయం కొంత మెరుగు పడింది. పంటలకు న్యాయమైన ధరలు లభించక రైతులు అప్పుల్లో కూరుకు పోతున్నారు. 2012-13లో వ్యవసాయ కుటుంబాల సగటు అప్పు 47వేలు

కాగా, నేడు 80వేలకు పైగా ఉంది. మోదీ పాలనలో అప్పులపాలైన లక్షా 25 వేల మంది రైతులు బలవన్మరణాలకు పాల్పడ్డారు. 2020లో మూడు వ్యవసాయ చట్టాలు చేసి మద్దతు ధరల ప్రకటననుండి, పంటల కొనుగోళ్ల నుండి తప్పుకోనున్నట్లు మోదీ ప్రభుత్వం ప్రకటించింది. తమ పంటల ఇష్టమైన రేటుకి దేశంలో ఎక్కడైనా రైతులు అమ్ముకోవచ్చనే మాయ మాటలతో రైతులను బడా వ్యాపారుల కబంధహస్తాల్లో పెట్ట చూసింది. రైతులు ప్రమాదకర చట్టాలకు వ్యతిరేకంగా ఉద్యమించటంలో ఆ చట్టాలను రద్దు చేసినా దొడ్డిదారిన అమలు జరుపుతూనే ఉంది. ఎరువుల, విత్తనాల ధరల పెరుగుదల అరికట్ట లేకపోయింది. రైతులకు ఇచ్చే సబ్సిడీలను తగ్గించుకుంటూ వస్తున్నది. వ్యవసాయాన్ని దండగ అన్న అభిప్రాయం రైతాంగంలో కలుగచేసి వారి భూములు కాంట్రాక్ట్ వ్యవసాయానికి, కార్పొరేట్ సంస్థలకు అప్పగించే విధానాలు అమలు జరుపుతున్నది. మోదీ ప్రభుత్వ విధానాల ఫలితమే నేటి వ్యవసాయ సంక్షోభం.

మోదీ పాలనలో బడా పెట్టుబడిదారుల అనుకూల పారిశ్రామిక విధానం:- దేశ ప్రయోజనాలకు అనుగుణమైన పారిశ్రామిక విధానం అమలు జరగలేదు. సామ్రాజ్యవాదుల, బడా పెట్టుబడిదారుల ప్రయోజనాలకు అనుగుణంగా పారిశ్రామిక విధానం అమలు జరుగు తున్నది. మోదీ పాలనలో మరింతగా పారిశ్రామిక విధానం బడా పెట్టుబడిదారుల, సామ్రాజ్యవాద సంస్థల చట్టూ తిరుగుతున్నది. సామ్రాజ్యవాదులకు, విదేశీ పెట్టుబడిదారులకు దళారీగా వ్యహరించిన టాటా, బిర్లాల చట్టూ పారిశ్రామిక విధానం చాలా కాలం కొనసాగితే, ప్రస్తుతం మోదీకి ప్రియమైన అదాని, అంబానీల చట్టూ తిరుగుతున్నది. మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి నేటివరకు బ్యాంకులకు బడా పెట్టుబడిదారులు బాకీ పడిన 5లక్షల కోట్ల మొండి బకాయలను రద్దు చేసింది. దేశంలోని అత్యంత విలువైన సహజ సంపదలను చౌకగా అమ్మటం ద్వారా కార్పొరేట్ల దోపిడీకి దేశాన్ని నిలయంగా మార్చాడు. 2015-2022 మధ్యకాలంలో 6.50 లక్షల కోట్ల ప్రభుత్వ రంగ సంస్థల వాటాలను తన ఆశ్రితులకు మోదీ కట్ట బెట్టాడు. గత పది సంవత్సరాలగా లాభాల్లో ఉన్న 64 కేంద్ర ప్రభుత్వ సంస్థలను మూసివేసి వాటిని అమ్మ చూస్తున్నది. వ్యవసాయ రంగానికి తోడ్పాటుగా ఉన్న ఎరువుల రంగంలోని 8 ప్రభుత్వ సంస్థల్లో పెట్టుబడుల ఉపసంహారణకు రంగం సిద్ధం చేసింది. సంపద పన్నును రద్దు చేసింది. కార్పొరేట్లపై పన్నును 30 నుంచి 22శాతానికి తగ్గించింది. ఫలితంగా దేశానికి లక్షా 84 వేల కోట్ల నష్టం జరిగింది. 2021లో ప్రభుత్వ రంగ సంస్థలు జరిపిన సర్వే వివరాల ప్రకారం దేశంలోని 255 ప్రభుత్వ రంగ కంపెనీల్లో 177 కంపెనీలు నికర లాభాన్ని గడించటం గమనిస్తే, ప్రభుత్వ రంగ సంస్థలు నష్టాల్లో ఉన్నాయి వాటిని అమ్మి వేస్తామని మోదీ ప్రభుత్వం చెప్పేది ఎంత బూటకమో తెలుస్తుంది. భారతదేశంలో విదేశీ పెట్టుబడులు 2020 నాటికి 13శాతం పెరిగి 57 మిలియన్ల అమెరికన్ డాలర్లకు చేరుకున్నాయి. మోదీ పాలనలో పారిశ్రామిక విధానం దేశ, విదేశీ బడా పెట్టుబడిదారుల దోపిడీ ప్రయోజనాలకే ఉపయోగంగా మారింది. నిరుద్యోగం:- ఉపాధి, నిరుద్యోగం యువతను తీవ్రంగా వెంటాడుతున్నది. యువతలో ఉన్న అసంతృప్తిని తనకు అనుకూలంగా మార్చుకోవటానికీ ఎన్‌డిఏ అధికారంలోకి వస్తే ప్రతి సంవత్సరం రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని మోదీ 2014 ఎన్నికల ప్రచారంలో వాగ్దానం చేశారు. ఎన్‌డిఏ కూటమి అధికారంలోకి రావటానికి యువత ఓట్లూ దోహద పడ్డాయి. అధికారాన్ని చేపట్టిన మోదీ ప్రభుత్వం ఉద్యోగ కల్పనలో పూర్తిగా విఫలమైంది. దేశంలో 15 సంవత్సరాలు అంతకంటే ఎక్కువ వయస్సుగల గ్రాడ్యుయేట్లలో 13.4% మంది నిరుద్యోగంలో మగ్గుతున్నారని కేంద్ర ప్రభుత్వానికి చెందిన పీరియాడిక్ లేబర్ సర్వే జూన్ 2022 లో వెల్లడించింది. కార్పొరేట్ దిగ్గజాల్లో ఒకరైన అజీమ్ ప్రేమ్ జి విశ్వవిద్యాలయం ఇటీవల విడుదలచేసిన సర్వే మేరకు 25 సంవత్సరాల గ్రాడ్యుయేట్లలో 42.3%, ఉన్నత మాధ్యమిక విద్య పూర్తిచేసిన వారిలో 21.4% నిరుద్యోగులుగా ఉన్నారని పేర్కొన్నది. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత 2023 నాటికి 10.05% నిరుద్యోగ రేటు పెరిగింది. 2021 ప్రారంభం నుంచి నేటి వరకు 2.5 కోట్ల మంది ఉద్యోగాలు కోల్పోయారు. 2012లో నిరుద్యోగం 2.1% కాగా 2018లో నేషనల్ సర్వే సంస్థ ప్రకారం 6.1% పెరిగింది. మోదీ 2014లో అధికారంలోకి వచ్చేనాటికి దేశంలో 22.4% మందికి ఉపాధి లేదు. 9సంవత్సరాల మోదీ పాలనలో 24.74% కి పెరిగింది. 2014లో 25 సంవత్సరాల వయస్సు గల కార్మిక శక్తి 31.64% ఉండగా, ప్రస్తుతం 28.04% పడిపోయింది.

మోదీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలు అమలు జరుపుతూ, కార్మికులు పోరాడి సాధించుకున్న 44 చట్టాలను నాలుగు కోడ్ లుగా మార్చి కార్మిక హక్కులను హరించింది. కార్మికులను యజమానులకు బానిసలుగా మార్చింది. పౌరసత్వ చట్టానికి సవరణచేసి మతాల మధ్య వివక్ష చూపింది. అటవీ హక్కుల చట్టాన్ని సవరించి గిరిజన ప్రజల హక్కులు కాలరాస్తూ, అటవీ భూములు, సంపదలను బడా పెట్టుబడిదారుల పరం చేస్తున్నది. ప్రతిపక్ష పాలక పార్టీల నాయకులపై రాజ్యాంగ సంస్థలను ప్రయోగించి జైళ్లలో నిర్బంధిస్తున్నది. ప్రజా వ్యతిరేక విధానాలు అమలు జరుపుతూ బడా పెట్టుబడిదారులకు, సామ్రాజ్యవాదులకు చేస్తున్న మోదీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా యావన్మంది ప్రజలు ముందుకు రావాలి.

సెల్: 9885983526

ఎన్డీయేకు బీహార్‌లో గడ్డుకాలం

- గట్టి పోటీ ఇస్తున్న విపక్ష కూటమి
- కమ్యూనిస్టుల ఓటుబ్యాంకు అదనం
- పెరిగిన తేజస్వీ యాదవ్ కరిష్మా

పాట్నా: మూడోసారి కేంద్రంలో అధికారంలోకి రావాలని పట్టుదలగా ఉన్న ఎన్డీయేకు ఈసారి బీహార్‌లో ఆటంకాలు ఏర్పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. గత రెండు లోక్‌సభ ఎన్నికల్లోనూ ఎన్డీయేకు ఎక్కువ సీట్లు వచ్చిన బీహార్‌లో ఇప్పుడు గట్టి పోటీ ఎదురవుతున్నది. ఈసారి 400 లోక్‌సభ స్థానాలు సొంతం చేసుకోవాలనుకుంటున్న ఎన్డీయేకు బీహార్ అత్యంత కీలకమైన రాష్ట్రం. ఇక్కడ 2014 ఎన్నికల్లో 40 స్థానాలకుగాను బీజేపీ, ఎల్‌జేపీ, ఆర్‌ఎల్‌ఎస్‌పీతో కూడిన ఎన్డీయే కూటమి 31 స్థానాలు గెలుచుకుంది. 2019 ఎన్నికల్లో ఏకంగా 40 స్థానాలకు 39 స్థానాలు కైవసం చేసుకుంది. ఈసారి కూడా ఇదేస్థాయిలో స్థానాలు గెలవాలని ఎన్డీయే భావిస్తున్నప్పటికీ అది అంత సులువైన పనిలా కనిపించడం లేదు.

గత ఎన్నికలకు, ఇప్పటికీ బీహార్‌లో రాజకీయ సమీకరణాలు మారాయి. 2019 ఎన్నికల్లో బీజేపీ, జేడీయూ, ఎల్జేపీతో కూడిన ఎన్డీయే కూటమికి 53 శాతం ఓటు బ్యాంకు లభించింది. ఆ ఎన్నికల్లో ఆర్జేడీ, కాంగ్రెస్ కూటమిగా పోటీ చేయగా 31 శాతం ఓట్లు సాధించింది. సీపీఐ, సీపీఎం, సీపీఐ-ఎంఎల్ పార్టీలు వేరు కూటమిగా పోటీ చేసి 3 శాతం ఓట్లు సాధించాయి. ఇప్పుడు మాత్రం ఈ మూడు కమ్యూనిస్టు పార్టీలూ ఇండియా కూటమిలో భాగంగా ఉన్నాయి. దీంతో ఆర్జేడీ, కాంగ్రెస్‌కు ఇప్పుడు కమ్యూనిస్టుల బలం కలిసి రానున్నది. మరోవైపు గత ఎన్నికల్లో ఎన్డీయేలో భాగస్వామిగా ఉన్న లోక్ జనశక్తి పార్టీ ఇప్పుడు రెండుగా చీలింది. రామ్‌విలాస్ పాశ్వాన్ సోదరుడు పశుపతి కుమార్ పరాస్ నేతృత్వంలో ఏర్పడిన రాష్ట్రీయ లోక్ జనశక్తి పార్టీ(ఆర్‌ఎల్‌జేపీ) ఎన్డీయే నుంచి బయటకు రావడం ప్రతికూలంగా మారవచ్చు. గత ఎన్నికల్లో పార్టీలు సాధించిన ఓట్లను బట్టి చూస్తే ఎన్డీయే బలం తగ్గగా, ఇండియా కూటమి బలం పెరిగినట్టు కనిపిస్తున్నది. అలాగే, బీహార్‌కు తొమ్మిదోసారి ముఖ్యమంత్రిగా ఉన్న నితీశ్ కుమార్ ప్రభావం క్రమంగా తగ్గుతున్నది. ఈ ఎన్నికల్లో ఎన్డీయేతో పొత్తులో భాగంగా నితీశ్ నేతృత్వంలోని జేడీయూ 16 స్థానాల్లో పోటీ చేస్తుండగా బీజేపీ 17 స్థానాల్లో బరిలో దిగుతున్నది. తద్వారా బీహార్ వరకు ఎన్డీయే కూటమిలో బీజేపీనే పెద్ద పార్టీగా మారింది. తరచూ కూటములు మార్చడం, మొన్నటి వరకు ఇండియా కూటమిలో ఉండి బీజేపీని విమర్శించి ఇప్పుడు అదే పార్టీతో జట్టు కట్టడం వంటి అంశాల వల్ల బీహార్ ప్రజల్లో నితీశ్ విశ్వసనీయత తగ్గుతున్నదని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. మరోవైపు లాలూ వారసుడిగా రాజకీయ ప్రవేశం చేసిన ఆయన కుమారుడు తేజస్వీ యాదవ్ బీహార్‌లో ప్రధాన నాయకుడిగా అవతరించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లోనూ బీహార్‌లో ఆర్జేడీని అతిపెద్ద పార్టీగా నిలిపిన ఘనత తేజస్వీదే. ఇప్పుడు ఇండియా కూటమిలోనూ ఆర్జేడీనే 25 స్థానాలకు పోటీ చేస్తుండటం ద్వారా ఎక్కువ స్థానాల్లో పోటీ చేస్తున్న పార్టీగా నిలిచింది. తేజస్వీ యాదవ్ బీహార్ ప్రజల్లో, ముఖ్యంగా యువతలో పట్టు సంపాదించుకున్నారు.

ఆయన వ్యక్తిగత కరిష్మా ఈసారి ఇండియా కూటమికి కలిసొచ్చే అవకాశం ఉందనే అంచనాలు ఉన్నాయి. దీనికితోడు ఎన్డీయే ప్రభావం బాగా తగ్గింది. గత ఎన్నికల్లోలా ఈసారి బీహార్‌లో క్లీన్‌స్వీప్ చేసే పరిస్థితులు ఎన్డీయేకు లేవని ఆ కూటమి నేతలు సైతం అంగీకరిస్తున్నారు. గత ఎన్నికల ఫలితాలను ఎన్డీయే పునరావృతం చేయడం కష్టమేనని జేడీయూ నేత నీరజ్ కుమార్ పేర్కొన్నారు. పదేళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ... రాష్ట్రంలో అధికారంలో ఉన్న నితీశ్ కుమార్ ప్రభుత్వ వ్యతిరేకత ప్రభావం ఎన్డీయేపై చూపించే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. సామాజిక సమీకరణాలను చూస్తే... ఆర్జేడీ మొదటి నుంచి ముస్లిం, యాదవ ఓట్లను ఓటు బ్యాంకుగా మలుచుకున్నది. అయితే, దళితుల్లో పట్టున్న చిరాగ్ పాశ్వాన్ నేతృత్వంలోని ఎల్జేపీ భాగస్వామిగా ఉండటం ఎన్డీయేకు కలిసి వస్తుందని భావిస్తున్నారు. నితీశ్ కుమార్‌కు వెనుకబడిన వర్గాలు, కుర్మి, కోయిరి సామాజికవర్గాల్లో ఆదరణ ఉంది.

భారత్ అస్థిరతకు యత్నిస్తే తీవ్ర పరిణామాలు

పాక్‌కు రాజ్‌నాథ్ సింగ్ హెచ్చరిక



న్యూఢిల్లీ: సీమాంతర ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న దాయాది పాకిస్థాన్‌పై రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ మరోసారి విరుచుకుపడ్డారు. ముష్కర మూకలతో భారత్‌ను అస్థిరపరిచేందుకు ప్రయత్నిస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. ఉగ్రవాదాన్ని అరికట్టడంలో దాయాది అసమర్థతను ఎద్దేవా చేశారు. అది తమకు చేతకాదని పాక్ భావిస్తే... ఆ దేశానికి సహకారం అందించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని అన్నారు. సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా ఓ జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో రాజ్‌నాథ్ సింగ్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఎమర్జెన్సీ నాటి రోజులను గుర్తుచేసుకుంటూ ప్రతిపక్ష కాంగ్రెస్‌పై ఆయన విమర్శలు గుప్పించారు. "ఎమర్జెన్సీ సమయంలో మా తల్లి అంత్యక్రియలకు వెళ్లేందుకు నాకు పెరోల్ కూడా ఇవ్వలేదు. అలాంటిది ఇప్పుడు వారు (కాంగ్రెస్) మమ్మల్ని నియంతలుగా పేర్కొంటున్నారు" అని రాజ్‌నాథ్ దుయ్యబట్టారు. ఉగ్రదాడులను ఉద్దేశిస్తూ రక్షణమంత్రి ఇటీవల పాకిస్థాన్‌కు పరోక్షంగా గట్టి హెచ్చరికలు చేసిన విషయం తెలిసిందే. "దేశంలో శాంతికి విఘాతం కలిగించేందుకు ఏ ఉగ్రవాది అయినా ప్రయత్నిస్తే... తగిన సమాధానం చెప్తాం. ఒకవేళ వారు పాకిస్థాన్‌కు పారిపోయినా వదలం. అక్కడికి వెళ్లి మరీ మట్టుపెడతాం" అని హెచ్చరించారు. పాకిస్థాన్‌లో ఉగ్రవాదుల మిస్టరీ మరణాల వెనుక న్యూఢిల్లీ హస్తం ఉందంటూ యూకే మీడియా రాసిన కథనంపై స్పందిస్తూ రాజ్‌నాథ్ ఈ వ్యాఖ్యలు చేశారు. భారత్ ఎప్పుడూ ఏ దేశంపై దాడి చేయదని, వారి భూభాగాలను ఆక్రమించేందుకు యత్నించదని స్పష్టంగా చెప్పారు.

ఫిష్ కామెంట్లకు ఆరెంజ్‌తో చెక్

విమర్శకులకు దీటుగా తేజస్వి వీడియో

పాట్నా: ఆర్జేడీ నాయకుడు తేజస్వీ యాదవ్ ప్రయాణిస్తున్న సమయంలో భోజనంగా చేపను తింటున్నప్పుడు చిత్రీకరించిన వీడియోపై విమర్శలు వ్యక్తమయ్యాయి. వాటికి ప్రతిగా తేజస్వి షేర్ చేసిన వీడియో ఆకట్టుకుంటోంది. 'మేము హెలికాప్టర్‌లో ఆరెంజ్ పార్టీ చేసుకున్నాం. నారింజ రంగుతో వారికి చిరాకురాదులే. అంతేకదా' అని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. మరో నేత ముకేశ్ సాహ్నితో కలిసి ఆరెంజ్‌ను ఆస్వాదిస్తూ తేజస్వి కనిపించారు. ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వారు తమ విమర్శకులకు ఈ విధంగా బదులిచ్చారు. చేప తింటూ తీసుకున్న వీడియోపై బీజేపీ నాయకులు, నెటిజన్లు కామెంట్లు పెట్టారు. తేజస్వీ యాదవ్ 'సీజనల్ సనాతనవాది', ఆయన బుజ్జగింపు రాజకీయాలు చేస్తున్నారని కేంద్రమంత్రి గిరిరాజ్ సింగ్ వ్యాఖ్యలు చేశారు. వీటిపై తేజస్వి స్పందిస్తూ... అది పాత వీడియో అని తెలిపారు. తన పేరు చెడగొట్టేందుకు ప్రయత్నించేవారి తెలివితక్కువతనాన్ని బహిర్గతం చేయడంలో విజయం సాధించానని పేర్కొన్నారు.

సైనిక స్కూళ్లపై మాటలయుద్ధం

న్యూఢిల్లీ: దేశంలోని సైనిక్ స్కూళ్లను ప్రైవేటీకరించే యోచనను కేంద్రం విరమించుకోవాలని విజ్ఞప్తి చేస్తూ రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే లేఖ రాశారు. ప్రైవేటీకరణ కోసం కుదుర్చుకున్న అవగాహన ఒప్పందాలు రద్దు చేయాలని, ఆ విధానాన్ని పూర్తిగా వెనక్కి తీసుకోవాలని కోరారు. దీనిపై కేంద్రం స్పందించింది. రక్షణ మంత్రిత్వశాఖ పరిధిలోని స్వతంత్ర సంస్థ ద్వారా దేశంలో 33 సైనిక్ స్కూళ్లు పనిచేస్తున్నాయని, ఇంతవరకు సైనిక దళాలు, వాటి అనుబంధ సంస్థలు రాజకీయాలకు దూరంగా ఉన్నాయని, ప్రైవేటీకరిస్తే వాటి స్వభావంపై ప్రభావం పడుతుందని ఖర్గే తన లేఖలో పేర్కొన్నారు. ఒక సిద్ధాంతాన్ని వీటి ద్వారా విద్యార్థులపై రుద్దేందుకు ప్రయత్నించడం తగదని, దేశ సేవకు కావాల్సిన లక్షణాలను, దార్శనికతను ఈ పాఠశాలల్లోని విద్యార్థులు నిలుపుకోవాలంటే ప్రైవేటీకరణ ఒప్పందాలు పూర్తిగా వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే 62 శాతం పాఠశాలల్ని బీజేపీ-ఆరెస్సెస్ నేతలే సొంతం చేసుకోనున్నారని ఖర్గే పేర్కొన్నారు. ఈ ఆరోపణలను రక్షణ మంత్రిత్వ శాఖ తోసిపుచ్చింది. ఏ రాజకీయ, సైద్ధాంతిక సంస్థలు ఈ ఎంపిక ప్రక్రియను ప్రభావితం చేయబోవని, దీనికి సంబంధించి వచ్చిన ఆరోపణలు అసంబద్ధమైనవని పేర్కొంది. ఇవి తప్పుదోవ పట్టించేవిగా ఉన్నాయని ఖండించింది. విద్యారంగంలో అనుభవం ఉన్న సంస్థలతో 100 పాఠశాలలను ఏర్పాటు చేసే పథకాన్ని కేంద్రం ప్రారంభించిందని తెలిపింది. కఠినమైన ఎంపిక ప్రక్రియ ద్వారా 500 దరఖాస్తులను స్కాన్ చేయగా... 45 పాఠశాలలకు మాత్రమే ఆమోదం లభించిందని పేర్కొంది. అది కూడా తాత్కాలికమేనని, వాటిపై పర్యవేక్షణ ఉంటుందని వెల్లడించింది.

బోల్తా పడిన స్కూల్ బస్

ఏడుగురు చిన్నారుల మృతి

చండీగఢ్: హర్యానాలో ఘోర ప్రమాదం జరిగింది. మహేంద్రగఢ్ జిల్లాలో స్కూల్ బస్సు బోల్తా పడింది. ఈ ఘటనలో ఏడుగురు చిన్నారులు మృతి చెందారు. కొంతమందికి గాయాలయ్యాయి. వేగంగా వెళ్తున్న బస్సు ఓ మలుపు వద్ద నియంత్రణ కోల్పోయింది. దీంతో అదుపుతప్పి చెట్టును ఢీ కొట్టి బోల్తా పడింది. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 35-40 మంది విద్యార్థులు ఉన్నారు. సెలవు రోజు అయినప్పటికీ ప్రైవేటు పాఠశాల సెలవు ఇవ్వలేదు. ప్రభుత్వ ఆదేశాలు పాటించకుండా స్కూల్ నిర్వహిస్తున్న సమయంలో ఈ ఘటన జరిగింది. స్థానికుల ద్వారా ప్రమాద వివరాలు తెలుసుకున్న పోలీసులు, ఉన్నతాధికారులు హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకున్నారు. స్థానికుల సహాయంతో సహాయక చర్యలు చేపట్టారు. మృతదేహాలు బయటకు తీశారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. ప్రమాదం జరిగిన ప్రదేశంలో భీతావహ పరిస్థితులు ఏర్పడ్డాయి. గాయపడిన వారు ఆక్రందనలు, మృతుల కుటుంబీకుల రోదనలతో ఆ ప్రాంతమంతా రోదనలతో మారుమోగింది. ప్రమాదంపై హర్యానా విద్యాశాఖ మంత్రి సీమా త్రిఖా స్పందించారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

భారత్-చైనా సరిహద్దు సమస్యకు సత్వర పరిష్కారం: మోదీ

న్యూఢిల్లీ: భారత్, చైనా మధ్య గల సరిహద్దు సమస్యను సత్వరమే పరిష్కరించుకోవాలని, రెండు దేశాల మధ్య ఉన్న ద్వైపాక్షిక సంబంధాలు బలహీనం కాకుండా ఉండాలంటే ఇది తప్పనిసరి అని ప్రధాని నరేంద్రమోదీ చెప్పారు. రెండు దేశాల మధ్య మంచి సత్సంబంధాలు ఉన్నాయని ఆయన తెలిపారు. అమెరికాకు చెందిన న్యూస్‌వీక్ మ్యాగజైన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మోదీ ఈ విషయాన్ని ప్రస్తావించారు. భారత్ దృష్టిలో చైనాతో సంబంధం చాలా ముఖ్యమైందని, సరిహద్దు వద్ద చాలాకాలంగా ఉన్న పరిస్థితిని పరిష్కరించుకోవాలని, దానివల్ల ద్వైపాక్షిక సంబంధాలపై ప్రభావం పడరాదని ఆయన అన్నారు. సానుకూలంగా ముందుకు వెళ్లడం వల్ల సరిహద్దు వద్ద శాంతిని తిరిగి స్థాపించవచ్చని మోదీ తెలిపారు. భారత్, చైనా మధ్య స్థిరమైన, శాంతియుత సంబంధాలు ఈ ప్రాంతానికి, ప్రపంచానికి ముఖ్యమని వ్యాఖ్యానించారు. దౌత్య, సైనికస్థాయి చర్చల్లో నిర్మాణాత్మకంగా, సానుకూలంగా ఉంటే సరిహద్దు వద్ద శాంతి నెలకొంటుందన్నారు. లడాఖ్‌లోని గల్వాన్ వ్యాలీలో 2020లో జరిగిన ఘర్షణ తర్వాత రెండు దేశాల మధ్య సంబంధాలు బలహీనపడిన విషయం విదితమే.

సత్సంబంధాలతో రెండు దేశాలకు ప్రయోజనం

మోదీ వ్యాఖ్యలపై చైనా స్పందన

బీజింగ్: భారత్-చైనాల మధ్య స్థిరమైన సత్సంబంధాలు ఇరుదేశాల ఉమ్మడి ప్రయోజనాలకు మేలు చేకూరుస్తాయని చైనా తెలిపింది. ఇందుకోసం భారత్ తమతో కలిసిరావాలని పిలుపునిచ్చింది. సరిహద్దు సమస్య అనేది రెండింటి మధ్య ఉన్న పూర్తి సంబంధాలను ప్రతిబింబించదని చైనా విదేశాంగశాఖ ప్రతినిధి మావోనింగ్ పేర్కొన్నారు. భారత్-చైనా మధ్య స్థిరమైన, శాంతియుత సంబంధాలు రెండు దేశాలకే కాక ప్రపంచానికీ కీలకమని ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యలపై చైనా స్పందిస్తూ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. 'ప్రధాని మోదీ వ్యాఖ్యలను గుర్తించాం. ఇరుదేశాల మధ్య మంచి, స్థిరమైన సంబంధాలు... ఉమ్మడి ప్రయోజనాలకు, ప్రాంతీయంగా, అంతర్జాతీయంగా శాంతిస్థాపన, అభివృద్ధికి దోహదపడతాయి. సరిహద్దు వివాదాన్ని సరైన రీతిలో పరిష్కరించుకోవాలి. దౌత్య, సైనిక మార్గాల్లో ఇరుపక్షాలు ఇప్పటికే సంప్రదింపులు జరుపుతున్నాయి. వ్యూహాత్మక, దీర్ఘకాలిక కోణంలో ద్వైపాక్షిక సంబంధాల నిర్వహణ, పరస్పర విశ్వాసం, సహకారం, సంప్రదింపులు, విభేదాల పరిష్కారం విషయంలో మాతో భారత్ కలిసివస్తుందని ఆశిస్తున్నాం' అని మావో నింగ్ తెలిపారు. చైనాతో సంబంధాలు భారత్‌కు చాలా ముఖ్యమని న్యూయార్క్‌కు చెందిన 'న్యూస్ వీక్'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మోదీ తెలిపారు. సరిహద్దు అంశంలో ఇరుదేశాల మధ్య నెలకొన్న ప్రతిష్టంభన.. దౌత్య, సైనిక స్థాయిల్లో సానుకూల, నిర్మాణాత్మక చర్చల ద్వారా పరిష్కారం అవుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు. 2020లో తూర్పు లడాఖ్‌లో సైనిక ఘర్షణ తర్వాత భారత్-చైనా సంబంధాలు తీవ్రంగా దెబ్బతిన్న విషయం తెలిసిందే. సరిహద్దులో ప్రతిష్టంభన ఇరు దేశాలు ఇప్పటివరకు 21 రౌండ్ల కోర్ కమాండర్ స్థాయి చర్చలు నిర్వహించాయి.

దక్షిణాదిలో పాగా వేస్తాం: బీజేపీ

బెంగళూరు: ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమిదే అధికారమని కర్నాటక మాజీ మంత్రి, బీజేపీ నాయకుడు సీటీ రవి స్పష్టం చేశారు. లోక్‌సభ ఎన్నికల వేళ దక్షిణాది రాష్ట్రాల్లో పాగా వేసేందుకు తమ పార్టీ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తుందని చెప్పారు. తమిళనాడులో తమ పార్టీకి ఎక్కువ ఓట్లుతోపాటు అధిక సీట్లు వస్తాయని విశ్వాసం వ్యక్తం చేశారు. కేరళలో లోక్‌సభ స్థానాలు గెలుచుకోవడం ద్వారా ఆ రాష్ట్రంలో తమ పార్టీ ఖాతా తెరుస్తుందన్నారు. ఇక తెలంగాణలో మాత్రం తమ పార్టీ అత్యధిక లోక్‌సభ స్థానాలు గెలుచుకొని అగ్రస్థానంలో నిలుస్తుందని జోస్యం చెప్పారు. అయితే గతేడాది జరిగిన కర్నాటక అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ ఓటమి పాలైందంటే... అందులో తమ తప్పిదం ఉందన్నారు. తమ పార్టీ తీసుకున్న కొన్ని నిర్ణయాల కారణంగా... ప్రభుత్వానికి ప్రతికూల వాతవరణం ఏర్పడిందని చెప్పారు. దాంతో తమ పార్టీపై ప్రజల్లో విశ్వసనీయత దెబ్బతిందని తెలిపారు. అందువల్లే ఆ ఓడిపోయామన్నారు. అయితే ఈ లోక్‌సభ ఎన్నికల్లో కర్నాటకలో బీజేపీ, జేడీఎస్ కలిసి పోటీ చేస్తున్నాయని వివరించారు. అందులోభాగంగా అధికార కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా వెళ్తున్నామని ఆయన స్పష్టం చేశారు. ముచ్చటగా మూడోసారి కూడా మోదీ విజయం సాధిస్తారన్నారు. మోదీ ప్రభుత్వం తీసుకువచ్చిన విధానాలు, ఆయన బలమైన నాయకత్వాన్ని ప్రజలు మరోసారి కోరుకుంటున్నారని పేర్కొన్నారు. అయితే ప్రధానిగా ఇందిరా గాంధీ గరీబీ హఠావో అంటూ గతంలో పిలుపునిచ్చిందని గుర్తు చేశారు. అయితే ఆ నినాదంతో ఆ పార్టీకి చెందిన వారిలో పేదరికం పోయిందని సీటీ రవి వ్యంగ్యంగా అన్నారు. ఆక్రమంలో పేద ప్రజలు దోపిడికి గురయ్యారన్నారు. అయితే 140 కోట్ల ప్రజలు మరోసారి మోదీ ప్రభుత్వం ఏర్పాటు కావాలని నిర్ణయించారని ఆయన పునరుద్ఘాటించారు.

సీఏఏ, ఎన్‌ఆర్‌సీ, యూసీసీని అమలు చేయం

పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ

కోల్‌కతా : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సమాజంలో విభేదాలు సృష్టించేందుకు ప్రయత్నిస్తోందని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ విమర్శించారు. గురువారం ఇక్కడి రెడ్ రోడ్‌లో జరిగిన రంజాన్ వేడుకల్లో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ వివాదాస్పద పౌరసత్వ (సవరణ) చట్టం (సీఏఏ), జాతీయ పౌరుల నమోదు (ఎన్‌ఆర్‌సీ), రాష్ట్రంలో ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ) కి వ్యతిరేకంగా తన వైఖరిని పునరుద్ఘాటించారు. తాను బతికి ఉన్నంత వరకు వీటిని బలవంతంగా అమలు చేయనివ్వబోనని, తృణమూల్ కాంగ్రెస్ రక్తాన్ని చిందించేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు. 'మనం ఐక్యంగా జీవిస్తే మనకు ఎవరూ హాని చేయలేరు' అని అన్నారు. 2024 లోక్‌సభ ఎన్నికల సమయంలో మతం పేరుతో అల్లర్లు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని హెచ్చరించారు. అల్లర్లు జరిగే పరిస్థితి తలెత్తితే 'నిశ్శబ్దంగా ఉండండి' అని ముస్లింలకు పిలుపునిచ్చారు. 'దేశం కోసం రక్తాన్ని చిందించడానికి మేము సిద్ధంగా ఉన్నాము. కానీ హింసను సహించము. ఉమ్మడి పౌరస్మృతి ఆమోదయోగ్యం కాదు. మేము యూసీసీ, ఎన్‌ఆర్‌సీ, సీఏఏ ను బలవంతంగా అమలు చేయడాన్ని అంగీకరించము. నేను జీవించి ఉన్నంత వరకు ఎవరూ మీకు హాని చేయలేరు. నేను వారితో పోరాడుతూనే ఉంటాను. మరణానికి భయపడకూడదని నేను మీ నుంచి నేర్చుకున్నాను. కానీ అది మరొక మార్గం' అని అన్నారు. ప్రజలను ఎలా ద్వేషించాలో తనకు తెలియదని పేర్కొన్న పశ్చిమ బెంగాల్ సీఎం, ప్రతి ఒక్కరూ శాంతి, సామరస్యంతో జీవించాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. 2024 లోక్‌సభ ఎన్నికలకు ముందు ప్రజలను, ప్రధానంగా ప్రతిపక్ష నేతలను 'భయపెట్టడానికి' బీజేపీ కేంద్ర దర్యాప్తు సంస్థలను ఉపయోగిస్తోందని విమర్శించారు. 'ఈ ఎన్నికల్లో ఏజెన్సీల పేరుతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేయాలని కొందరు కోరుతున్నారు. సీబీఐ, ఈడీ, ఇన్‌కమ్ ట్యాక్స్, ఎన్‌ఐఏను వెంట పడేయండి. జైలును నిర్మించి అందరినీ కటకటాల వెనక్కి నెట్టమని నేను వారికి (బీజేపీ) చెబుతాను. అయితే మీరు మొత్తం 130 కోట్ల మందిని జైల్లో పెట్టగలరా?' అని మమతా బెనర్జీ ప్రశ్నించారు. 'ఇండియా' కూటమి గురించి తర్వాత నిర్ణయం తీసుకుంటామని, కానీ బెంగాల్‌లో మరే ఇతర పార్టీకి ఓటు వేయకుండా చూడండి' అని టీఎంసీ అధినేత్రి కోరారు.

కాంగ్రెస్‌కు బీజేపీ ఎమ్మెల్యేల ప్రచారం!



బెంగళూరు: వారిద్దరూ బీజేపీ ఎమ్మెల్యేలు... గత ప్రభుత్వంలో మంత్రులుగా వ్యవహరించారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల తరపున బహిరంగంగానే ప్రచారం చేస్తున్నారు. బెంగళూరు యశ్వంతపుర బీజేపీ ఎమ్మెల్యే ఎస్‌టీ సోమశేఖర్, ఉత్తరకన్నడ జిల్లా యల్లాపుర ఎమ్మెల్యే శివరాం హెబ్బార్ తీరు సర్వత్రా విమర్శలకు దారి తీస్తోంది. వీరిద్దరూ ఇటీవల కొన్ని నెలలుగా సొంత పార్టీ బీజేపీతో పాటు నాయకులకు, కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. బెంగళూరు ఉత్తర కాంగ్రెస్ అభ్యర్థి రాజీవ్‌గౌడ తరపున ఎస్‌టీ సోమశేఖర్ నిరంతరంగా ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. అభ్యర్థితో కలసి బహిరంగసభల్లోనూ పాల్గొంటున్నారు. ఇదే తరహాలోనే ఉత్తర కన్నడ కాంగ్రెస్ అభ్యర్థి అంజలి నింబాల్కర్ తరపున శివరాం హెబ్బార్ ప్రచారంలో పాల్గొంటున్నారు. ఉత్తరకన్నడ బీజేపీ అభ్యర్థి విశ్వేశ్వర హెగ్డే కాగేరి పార్టీ రాష్ట్ర నాయకులకు పరిస్థితిని వివరించారు. శివరాం హెబ్బార్ వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. వీరిద్దరూ బీజేపీని వీడి కాంగ్రెస్‌లో వెళ్లేందుకు సిద్ధమయ్యారు. కొన్ని కారణాలతో వాయిదాలు పడుతూ వస్తోంది.

నోట్ల రద్దు... ఎన్నికల బాండ్లు

బీజేపీ అవినీతికి ఇవే తార్కాణం

- బీజేపీకి 200 సీట్లు దాటవు...
- 'ఇండియా'ను తక్కువ అంచనా వేస్తోంది
- నితీశ్ విశ్వసనీయత కోల్పోయాడు
- కేంద్ర మాజీ మంత్రి యశ్వంత్ సిన్హా

న్యూఢిల్లీ : ఎన్నికల బాండ్లు ఒక పెద్ద కుంభకోణమని, నల్లధనాన్ని తెల్లగా మార్చేందుకు నోట్ల రద్దు ఒక మార్గమని కేంద్ర మాజీ ఆర్థిక మంత్రి యశ్వంత్ సిన్హా అన్నారు. బిజెపి ప్రభుత్వం వారి అవినీతి చర్యలపై గోప్యత కప్పి ఉంచుతుందని మరియు ప్రజలు వాటి గురించి ఎప్పటికీ గుర్తించరని ఆశిస్తోందని ఆరోపించారు. పీటీఐ వార్తా సంస్థకు ఇచ్చిన ఒక వీడియో ఇంటర్వ్యూలో సిన్హా మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో 400 కంటే ఎక్కువ సీట్లు గెలుస్తామన్న బీజేపీ వాదనను తోసిపుచ్చారు. ప్రతిపక్ష 'ఇండియా' కూటమి బలాన్ని తక్కువగా అంచనా వేస్తున్నారని అన్నారు. కాగా, తన మాజీ నియోజకవర్గం హజారీబాగ్‌కు చెందిన అనేక మంది ఈసారి ఎన్నికల్లో పోరాడాలని తనను కోరినప్పటికీ తాను రాజకీయాల నుంచి రిటైర్ అయ్యానని, తిరిగి వచ్చే ఆలోచన లేదని 86 ఏళ్ల సిన్హా స్పష్టం చేశారు. కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం ప్రజాస్వామ్య వ్యవస్థలను నిర్వీర్యం చేస్తోందని ఆరోపిస్తూ 2018లో పార్టీని వీడిన బీజేపీ మాజీ నాయకుడు సిన్హా ప్రభుత్వంపై విమర్శలు చేస్తూనే ఉన్నారు. కాగా, బుధవారం సామాజిక మాధ్య వేదిక 'ఎక్స్'లో ఒక పోస్ట్‌లో, ఈ ప్రభుత్వం అధికారంలో ఉన్నంత కాలం మాత్రమే నిజాయితీగా ఉంటుంది. అది అధికారం నుంచి నిష్క్రమించిన క్షణం భారతదేశ ప్రజలు ఇది అత్యంత అవినీతి ప్రభుత్వమని గ్రహిస్తారు' అని పేర్కొన్నారు. నోట్ల రద్దు, ఎన్నికల బాండ్లు ఇందుకు రెండు ఉదాహరణలు అని సిన్హా అన్నారు. ఆయన చేసిన పోస్ట్ గురించి ప్రశ్నించగా, 'నాలో చాలా ఆలోచించిన తర్వాతే చేశాను. ప్రజల్లోకి తీసుకెళ్లడానికి వీలులేని అవినీతి పనుల నుంచి వాళ్లు తప్పించుకున్నారని నేను గ్రహించాను' అని తెలిపారు. 'దీని గురించి ఎవరూ బాధపడటం లేదు. నేను 2016 నాటి నోట్ల రద్దు గురించి ప్రస్తావించాను. నోట్ల రద్దు తర్వాత దాదాపు 100 శాతం డబ్బు బ్యాంకులకు తిరిగి వచ్చిన విషయం ఇప్పుడు మనకు తెలుసు. నల్లధనం కలిగివున్నందుకు గాను ఒక్క కేసు, ఒక్క వ్యక్తి, ఒకే సంస్థపై విచారణ జరిగినట్లు నాకు తెలియదు' అని ఆయన అన్నారు. 'అందువల్ల నల్లధనం కేసు లేదు. బ్యాంకింగ్ వ్యవస్థలోకి ప్రవేశించినందున మొత్తం నల్లధనం తెల్లగా మారింది. నల్లధనాన్ని తెల్లగా మార్చేందుకు నోట్ల రద్దు భారీ కసరత్తు అని నేను వ్యక్తిగతంగా భావిస్తున్నాను' అని తెలిపారు. ఎన్నికల బాండ్ల అంశంపై మాట్లాడుతూ 'వివరాలు ముక్కలు, ముక్కలుగా బయటకు వస్తున్నాయి. అయితే (ఎవరో) నన్ను ఎందుకు నమ్మాలి? భారతదేశ ఆర్థిక మంత్రి భర్త మాట్లాడుతూ ఇది మొత్తం ప్రపంచంలోనే అతిపెద్ద అవినీతి అని అన్నారు. ఇది అతిపెద్ద కుంభకోణం. ముక్కలు, ముక్కలు బయటకు వచ్చినప్పుడు వివిధ సంస్థల నుంచి నల్లధనాన్ని సేకరించడానికి, ఎక్కువగా అధికార పార్టీ కోసం వ్యవస్థను ఎలా దుర్వినియోగం చేశారో తెలుసుకుంటారు' అని సిన్హా ఆరోపించారు. 'అందువల్ల ప్రభుత్వ విధానం ఏమిటి? వారి అవినీతి చర్యలపై గోప్యత కప్పిపుచ్చడం. ప్రజలు ఎప్పటికీ తెలుసుకోలేరని ఆశించడం' అని అన్నారు. లోక్‌సభలో 400 కంటే ఎక్కువ సీట్లు గెలుచుకుంటామన్న బీజేపీ, దాని మిత్రపక్షాల వాదన గురించి అడిగినప్పుడు, సిన్హా అధికార పక్షాన్ని ఎగతాళి చేస్తూ, 'వారు తమ వాదనలలో చాలా చాలా జాగ్రత్తగా, మితంగా ఉంటారు. వారు 550 సీట్లు గెలుస్తామని వారు తేలికగా చెప్పుకోవచ్చు. పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో ఏడు సీట్లు లేదా ఆ సంఖ్య ఏదైనప్పటికీ, దేశంలోని మిగిలిన ప్రాంతాల్లో' అని ఎద్దేవా చేశారు. 'ఇలాంటి వాదనలకు అంతు లేదు. ఎన్నికలు జరిగినప్పుడల్లా నా రాష్ట్రంలోని జార్ఖండ్‌లో ఒక సభలో 'అబ్ కి బార్ 65 పార్'... 81 లేదా 82 మందిలో 65 అనే సంఖ్యను నేను గుర్తుంచుకుంటాను. 'వారికి ఎంత వచ్చింది? 25. అందువల్ల మీరు అదే సంఖ్యను వర్తింపజేయండి. ఈ లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ 200 సీట్లు దాటు' అని ఆయన అన్నారు. 'ఇండియా' కూటమిని తక్కువ అంచనా వేస్తున్నారని, కాంగ్రెస్‌తో సహా ప్రతిపక్ష పార్టీలు ఎన్నికల్లో తమ సంఖ్యను మెరుగుపరుచుకుంటాయని సిన్హా అన్నారు. 'ఇది (ఇండియా కూటమి) వారి స్వంత రాష్ట్రాల్లో చాలా బలంగా ఉన్న పెద్ద సంఖ్యలో ప్రాంతీయ పార్టీలను కలిగి ఉంది. అవి చాలా మెరుగ్గా పనిచేస్తాయి. కాంగ్రెస్ పార్టీ కూడా గత ఎన్నికల కంటే చాలా మెరుగ్గా చేస్తుంది. అందువల్ల అవి అధికార పక్షానికి చుక్కలు చూపిస్తున్నాయి' అని తెలిపారు. నితీశ్ కుమార్, అతని పార్టీ జేడీ(యూ) ఎన్‌డీఏలోకి మారడంపై సిన్హా మాట్లాడుతూ బీహార్ ముఖ్యమంత్రి తన విశ్వసనీయతను కోల్పోయారని అన్నారు. 'ఇప్పటికే ఆయనను 'పల్టురామ్' (తరచుగా పొత్తులు మార్చుకోవడం కోసం) పిలుస్తారు. ఆయన తన విశ్వసనీయతను పూర్తిగా కోల్పోయాడు. బీజేపీ తన విశ్వసనీయతను కోల్పోయింది. నితీశ్ కుమార్ కూటమి మారడం ద్వారా లోక్‌సభ ఎన్నికల ఫలితాలు ప్రజలను ఏమాత్రం ఆకట్టుకోవని స్పష్టమవుతోంది' అని అన్నారు. ఇదిలాఉండగా, తన ఆరోగ్యం దృష్ట్యా క్రియాశీల రాజకీయాల్లోకి తిరిగి రావడం ఇష్టం లేదని సిన్హా చెప్పారు. 'ఈసారి నా మాజీ నియోజకవర్గం హజారీబాగ్‌లో ఎన్నికలలో పోటీ చేయమని ప్రజల నుంచి నాపై చాలా ఒత్తిడి వచ్చింది. నేను గెలుస్తాను' అని చెప్పారు. కానీ నేను ఆలోచన చేయడం లేదు. ఎందుకంటే వారు హామీ ఇచ్చినప్పటికీ, నేను ఇంకా కష్టపడి పని చేయాల్సి ఉంటుంది. లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయడానికి నా ఆరోగ్యం నన్ను అనుమతించదని నాకు తెలుసు. అందువల్ల చాలా వరకు నేను విశ్రాంత జీవితం గడుపుతున్నాను' అని అన్నారు. సిన్హా 1998-99, అలాగే 2009-2014 మధ్య లోక్‌సభలో హజారీబాగ్ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించారు. 2014 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీలోనే కొనసాగుతున్న ఆయన కుమారుడు జయంత్ సిన్హా ఈ స్థానం నుంచి పోటీ చేసి గెలిచారు. అతను 2019లో హజారీబాగ్ నుంచి తిరిగి ఎన్నికయ్యాడు. ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసేందుకు హజారీబాగ్ సదర్ ఎమ్మెల్యే మనీశ్ జైస్వాల్‌ను పార్టీ ఎంపిక చేసింది.

రైతులు, యువత గోడు వినపడదా?

- ఎంఎస్‌పీ... ఉద్యోగాలు కల్పించడం లేదు
- కేంద్రంపై రాహుల్ ధ్వజం

ఎన్నికలు దేశ రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేవని కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు వ్యాఖ్యానించారు. రాజస్తాన్‌లోని బికనీర్‌లో జరిగిన

జైపూర్: రైతులు తమ పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) కోసం అడుగుతున్నారని, యువకులు ఉపాధి కోసం చూస్తున్నారని, మహిళలు ద్రవ్యోల్బణం నుంచి ఉపశమనం పొందాలని కోరుకుంటున్నారని, కానీ ఎవరూ వారి గోడు వినడం లేదని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ గురువారం బీజేపీ నేతృత్వంలోని కేంద్రాన్ని విమర్శించారు. లోక్‌సభ ఎన్నికలు దేశ రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేవని కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు వ్యాఖ్యానించారు. రాజస్తాన్‌లోని బికనీర్‌లో జరిగిన ఒక ర్యాలీలో ఆయన మాట్లాడుతూ 'ఇది సాధారణ వర్గంలోని వెనుకబడిన, దళితులు, గిరిజనులు, పేదల ఎన్నికలు' అని తెలిపారు. కాంగ్రెస్ బ్యాంకు ఖాతాలు స్తంభించాయని రాహుల్ గాంధీ అన్నారు. కేంద్రంలోని అధికార బీజేపీ ఎన్నికల బాండ్ల ద్వారా బడా పారిశ్రామికవేత్తల నుంచి డబ్బు తీసుకుందని, రాబోయే ఎన్నికలు దేశంలోని పేద ప్రజలకు, 22 నుంచి 25 బిలియనీర్లకు మధ్య పోరు అని ఆయన అన్నారు. బికనీర్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థులు గోవింద్ రామ్ మేఘ్‌వాల్, గంగానగర్ లోక్ సభ ఎన్నికల్లో కుల్‌దీప్ ఇండోరాకు మద్దతుగా నిర్వహించిన ర్యాలీలో గాంధీ మాట్లాడుతూ 'మాకు ఎంఎస్‌పీ ఇవ్వండి అని రైతులు, ఉపాధి కల్పించండి అని యువత అంటున్నారు. మహిళలు ద్రవ్యోల్బణం నుంచి రక్షించండి అంటున్నారు. కానీ ఎవరూ వినడం లేదు' అని అన్నారు. ప్రస్తుతం దేశంలో ఉన్న రెండు అతిపెద్ద సమస్యలు నిరుద్యోగం, ద్రవ్యోల్బణం అని, అయితే వీటిని మీడియా లేవనెత్తడం లేదని ఆయన తెలిపారు. లోక్‌సభ ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ ఇచ్చిన వాగ్దానాలను ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ, పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే వాటన్నింటినీ గౌరవిస్తామని చెప్పారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 15 నుంచి 20 మంది బడా పారిశ్రామికవేత్తలకు రుణాలు మాఫీ చేశారని ఆరోపించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తన పాలనలో 15 నుంచి 20 మంది పారిశ్రామికవేత్తలకు రుణాలు మాఫీ చేశారని, అయితే భారతదేశ చరిత్రలో తొలిసారిగా రైతులు పన్నులు చెల్లిస్తున్నారని ఆయన విమర్శించారు.

జ్యోతిరావు పూలే సేవలు నిరుపమానం: రామకృష్ణ

విశాలాంధ్ర-విశాఖ: దేశంలోని కోట్లాదిమంది అణగారిన, వెనుకబడిన వర్గాలు, దళితులు, మైనారిటీల అభ్యున్నతికి సంఘ సంస్కర్త మహాత్మ జ్యోతిరావు పూలే విశేష సేవలందించారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ కొనియాడారు. పూలే 198వ జయంతి సందర్భంగా విశాఖలో గ్రీన్ పార్క్ హోటల్ వద్దనున్న పూలే విగ్రహం వద్ద గురువారం ఆయన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూలే రెండు శతాబ్దాల క్రితమే సంఘ సంస్కరణలను ముందుకు తెచ్చారన్నారు. భార్యకు చదువు చెప్పి ఆమెతో మిగతా వారికి చదువు చెప్పించి విద్యను విశేషంగా ప్రోత్సహించారన్నారు. ఆయన కృషి వల్లే కోట్లాదిమంది దళిత, బడుగు బలహీన, మైనారిటీ వర్గాల ప్రజలు విద్యకు చేరువయ్యారని తెలిపారు. చరిత్రలో ఇలాంటి గొప్ప నాయకుల ప్రాధాన్యతను తగ్గించే ప్రయత్నం జరుగుతోందని, అలాంటి వాటిని ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోమని అన్నారు. ఆయన కృషి అందరికీ ఆదర్శనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి, విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, విశాఖ పశ్చిమ నియోజకవర్గం సీపీఐ అభ్యర్థి అత్తిలి విమల, జిల్లా కార్యవర్గ సభ్యులు క్షేత్రపాల్, ఎస్కే రెహమాన్, మన్మధరావు, నేతలు నాగభూషణం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఈపీఎఫ్ఓ వేతన పరిమితి రూ.21 వేలు?

న్యూదిల్లీ: కేంద్రప్రభుత్వం ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్ఓ) కింద ఉన్న ఉద్యోగుల గరిష్ఠ వేతన పరిమితిని రూ.21వేలకు చేర్చనున్నట్లు సమాచారం. కొన్నేళ్లుగా దీనిని పెంచాలని డిమాండ్లు ఉన్న నేపథ్యంలో ఎన్నికల వేళ కేంద్ర ప్రభుత్వం దీనిపై దృష్టి సారించినట్లు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ 'ఎనకమిక్ టైమ్స్' పేర్కొంది. కొత్త ప్రభుత్వంలో దీనికి సంబంధించిన నిర్ణయం వెలువడొచ్చని ఓ సీనియర్ అధికారి పేర్కొన్నారు. వేతన పరిమితిని పెంచడం వల్ల ప్రభుత్వంతో పాటు ప్రైవేటు రంగంపైనా ఆ భారం పడుతుంది. దీనివల్ల ఉద్యోగులకు మాత్రం మేలు జరుగుతుంది. ఈపీఎఫ్ఓ గరిష్ఠ వేతన పరిమితి చివరిసారిగా 2014లో సవరించారు. అప్పట్లో రూ.6,500గా ఉన్న మొత్తాన్ని రూ.15వేలకు పెంచారు. మరోవైపు ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఈఎస్ఐసీ) ఇప్పటికే వేతన పరిమితిని రూ.21 వేలకు చేర్చింది. ఈపీఎఫ్ కూడా ఆ మొత్తానికి చేర్చాలని ప్రభుత్వం భావిస్తోంది. వేతన పరిమితి పెంచితే దీనివల్ల ఉద్యోగుల భవిష్యనిధి ఖాతాకు జమ అయ్యే మొత్తం ఆ మేర పెరగనుంది. సాధారణంగా ఉద్యోగి వాటాగా వేతనంపై 12 శాతం, యజమాని వాటా 12 శాతం చెల్లిస్తారు. ఉద్యోగి వాటా పూర్తిగా ఈపీఎఫ్ ఖాతాలో జమవుతుంది. యజమాని వాటా నుంచి 8.33 శాతం పింఛను పథకంలో.. మిగతా మొత్తం ఈపీఎఫ్ ఖాతాలో జమవుతుంది. గరిష్ఠ వేతన పరిమితిని పెంచితే ఆ మేర ఉద్యోగి, యజమాని చెల్లించాల్సిన వాటా పెరుగుతుంది. దీనివల్ల ఈపీఎఫ్ఓ, ఈపీఎస్ ఖాతాలో జమయ్యే మొత్తం పెరుగుతుంది. దీంతో రిటైర్మెంట్ సమయానికి ఉద్యోగి తన భవిష్యనిధి నిల్వలను పెంచుకోవడానికి వీలుపడుతుంది.

బీజేపీ విధ్వంస పాలన పట్టదా?

- పార్లమెంటు ఎన్నికలన్న స్పృహ ఉందా?
- వైసీపీ, టీడీపీపై రామకృష్ణ ధ్వజం

విశాలాంధ్ర-విశాఖ: రాష్ట్రంలోని అధికార వైసీపీ, ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీలు... దేశ సమస్యల గురించిగానీ, కేంద్రంలోని బీజేపీ పదేళ్ల పాలన గురించిగానీ పట్టించుకోవడం లేదని, పార్లమెంటుకు కూడా ఎన్నికలు జరుగుతున్నాయన్న స్పృహ ఆ పార్టీల్లో కనిపించడం లేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. విశాఖలోని ఎన్ఏడీ వద్ద విష్ణుప్రియ ఫంక్షన్ హాల్లో గురువారం సాయంత్రం జరిగిన పార్టీ సభ్యుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు అధ్యక్షత వహించగా, జిల్లా కార్యవర్గ సభ్యుడు జి.ఎస్.జె. అచ్యుతరావు వక్తలను వేదిక పైకి ఆహ్వానించారు. రామకృష్ణ మాట్లాడుతూ దేశంలో పార్లమెంటుకు కూడా ఎన్నికలు జరుగుతున్నప్పటికీ, రాష్ట్ర శాసనసభకు మాత్రమే ఎన్నికలు జరుగుతున్నట్లుగా వైసీపీ, టీడీపీ మాట్లాడుతున్నాయని విమర్శించారు. రాష్ట్రంలో టీడీపీకి అనుకూలంగా ఓ మీడియా, వైసీపీకి అనుకూలంగా మరో మీడియా రెండు వర్గాలుగా చీలిపోయిందన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అధికారంలో ఉండాలా? వద్దా? అన్నట్టుగానే ఎన్నికలు జరుగుతున్నాయని విమర్శించారు. బీజేపీ మరోసారి సొంత మెజారిటీతో అధికారంలోకి వస్తే రాజ్యాంగం, లౌకికవాదం కనుమరుగవుతాయని హెచ్చరించారు. బీజేపీకి అనుకూలంగా ఉన్నవారు పవిత్రులన్నట్టుగా, అనుకూలంగా లేనివారు అవినీతిపరులన్న పరిస్థితిని సృష్టిస్తున్నారని చెప్పారు. దేశంలో ఒక ముఖ్యమంత్రి అరెస్ట్ అయిన పరిస్థితి గతంలో ఎప్పుడూ లేదని, బీజేపీని వ్యతిరేకించడం వల్లే దిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ జైలు పాలయ్యారని అన్నారు. బీజేపీకి అనుకూలంగా లేని వారిపై ఈడీ, సీబీఐ, ఐటీ సంస్థలను ప్రయోగిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో ఒక్క శాతం కూడా ఓటు బ్యాంకు కూడా లేని బీజేపీతో టీడీపీ జతకట్టడం వెనుక చాలా రహస్యం ఉందన్నారు. చంద్రబాబును జైల్లో పెట్టడం వల్లే బీజేపీతో బాబు కలిశారని, అందుకు బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి, మరో మంత్రి, బీజేపీ పెద్దలతో దిల్లీలో మంతనాలు జరిపారని తెలిపారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ మూర్తి, మాజీ శాసనసభ్యులు మానం ఆంజనేయులు, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి పులుసు సత్యనారాయణ రెడ్డి, సీపీఐ పశ్చిమ నియోజకవర్గం అభ్యర్థి అత్తిలి విమల, సీపీఎం గాజువాక అభ్యర్థి ఎం.జగ్గునాయుడు, కాంగ్రెస్ పార్టీ తూర్పు అభ్యర్థి జి.శ్రీనివాసరావు, దక్షిణ అభ్యర్థి వాసుపల్లి సంతోష్, భీమిలి అభ్యర్థి వర్మరాజు, కార్పొరేటర్లు ఎ.జె.స్టాలిన్, బి.గంగారావు, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గొంప గోవిందరాజు, భారత్ బచావో నాయకుడు వేమన, గూడూరు సీతమహాలక్ష్మి, విశాఖ ఉక్కు గుర్తింపు యూనియన్ నాయకుడు డి.ఆదినారాయణ, విదసం నాయకుడు బి.వెంకటరావు తదితరులు మాట్లాడారు. కె.సత్యనారాయణ, ఎస్.కె. రెహమాన్, ఆర్.శ్రీనివాసరావు, బలివాడ వెంకటరావు, క్షేత్రపాల్ కార్యకర్తలు పాల్గొన్నారు.

ముందుగానే రుతుపవనాలు

వాతావరణ శాఖ అంచనా

న్యూదిల్లీ: ఎండలు మండిపోతున్నాయి. వేసవితాపం పెరిగిపోయింది. ఉదయం నుంచే సూర్యుడు భగభగలాడిపోతున్నాడు. మధ్యాహ్నమైతే నిప్పుల కుంపటి నెత్తి మీద పెట్టుకున్నట్టే ఉంటోంది. ఇప్పటికే చాలా ప్రాంతాల్లో 44.5 డిగ్రీల ఉష్ణోగ్ర తలు నమోదవుతున్నాయి. ఏప్రిల్‌లోనే పరిస్థితి ఇలా ఉంటే...రాబోయే రోజుల్లో 50 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయ్యే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ అధికారుల హెచ్చరికలు భయోత్పాతం సృష్టిస్తున్నాయి. వేసవి హెచ్చరికలు చేసిన వాతావ రణశాఖ...వర్షాలు సైతం ఈ ఏడాది బాగా కురుస్తాయని తీపి కబురు అందిం చింది. ఈసారి దేశవ్యాప్తంగా రుతుపవనాలు ముందుగానే రావచ్చని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఫలితంగా భారీ వర్షాలు కురుస్తాయని చెప్పారు. హిందూ మహాసముద్రం డైపోల్, లానినా పరిస్థితులు ఒకే సమయంలో చురుకుగా మారడంతో రుతుపవనాలు త్వరగానే రానున్నాయి. భూమధ్యరేఖ హిందూ మహాసముద్రంపై సానుకూల దశను సూచిస్తున్న రుతుపవనాలు పసిఫిక్‌లో లానినా ఏర్పడటానికి సానుకూల వాతావరణాన్ని ఏర్పరుస్తున్నాయి. జూన్ నాటికి ఎల్‌నినో బలహీనపడనుందని అధికారులు తెలిపారు. మే నెల నాటికి ఎల్‌నినో మరింత బలహీనపడి, జూన్ నాటికి పూర్తిగా తగ్గి తటస్థ పరిస్థితులు ఏర్పడతాయి. జులై నెలాఖరు నాటికి లానినా పరిస్థితులు ఏర్పడనున్నందున నైరుతి రుతుపవనాల రెండో భాగంలో మంచి వర్షాలు కురుస్తాయని ఐఎండీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ మృత్యుంజయ మహాపాత్ర అంచనా వేశారు.

పూలే పేరిట విశ్వవిద్యాలయం నెలకొల్పాలి

విశాలాంధ్ర-విజయవాడ: విద్య ద్వారా సామాజిక మార్పు తీసుకురావచ్చనే ఉద్దేశంతో అన్ని వర్గాల ప్రజలను విద్యావంతులను చేయటానికి కృషి చేసిన జ్యోతిరావు పూలే పేరుతో పాలక వర్గాలు విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయాలని మాజీ ఎమ్మెల్సీ, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు జల్లి విల్సన్, సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్, దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బుట్టి రాయప్ప అన్నారు. మహాత్మ పూలే 196వ జయంతి సందర్భంగా దళిత హక్కుల పోరాట సమితి అధ్వర్యంలో విజయవాడ తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రం వద్ద గురువారం నిర్వహించిన కార్యక్రమంలో పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ సమాజంలో అసమానతలను, వివక్షతలను రూపుమాపేందుకు తన జీవితాంతం కృషి చేసిన మహనీయుడు మహాత్మ జ్యోతిరావు పూలే చిరస్మరణీయులన్నారు. కుల, మత వివక్షతలతో నిరాక్ష్యరాస్యతతో సతమతమవుతున్న భారతదేశంలో సామాజిక మార్పు అవసరమని ప్రజలకు ముఖ్యంగా మహిళలకు సైతం విద్య అవసరమని పూలే భావించారని చెప్పారు. తన భార్య సావిత్రిబాయి పూలేకు విద్య నేర్పటమే కాకుండా దేశంలోనే మొదటి మహిళా ఉపాధ్యాయురాలిగా తీర్చిదిద్ది ప్రముఖ సంఘ సంస్కర్తగా ఆదర్శంగా నిలిచారాన్నారు. సామాజిక చైతన్యానికి అక్షర, శస్త్రధారి అని కొనియాడారు. ఆయన పేరుతో విశ్వవిద్యాయాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ విజయవాడ నగర అధ్యక్షులు సంగుల పేరయ్య, నాయకులు ప్రతిపాటి రాజు, కాళ్ల ప్రకాష్, రాహేల్‌బాబు, విజయవాడ ఆటో వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) నాయకులు గూడెల జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల బాండ్ల వివరాలు వెల్లడించలేం

ఆర్టీఐ దరఖాస్తును తిరస్కరించిన ఎస్బీఐ

న్యూదిల్లీ: ఎన్నికల బాండ్లకు సంబంధించి ఎన్నికల కమిషన్ (ఈసీ)కు ఇచ్చిన వివరాలను సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) కింద ఇచ్చేందుకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) నిరాకరించింది. ఇది విశ్వసనీయ హోదాలో ఉంచిన వ్యక్తిగత సమాచారమని సాకు చూపుతూ వివరాలు ఇచ్చేందుకు తిరస్కరించింది. ఎన్నికల బాండ్ల పథకం రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టు తీర్పు వెలువరించిన సంగతి తెలిసిందే. బాండ్ల వివరాలను ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచాలని ఎస్‌బీఐని ఆదేశించింది. దీంతో బ్యాంక్ సమర్పించిన వివరాలను ఈసీ మార్చి 14న తన వెబ్‌సైట్‌లో ప్రచురించింది. ఈనేపథ్యంలో ఆర్‌టీఐ కార్యకర్త కమోడోర్ (రిటైర్డ్) లోకేశ్ బాత్రా ఎస్‌బీఐకి సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేసుకున్నారు. సుప్రీం ఆదేశాల ప్రకారం ఈసీకి సమర్పించిన ఎన్నికల బాండ్ల సమాచారాన్ని అందివ్వాలని మార్చి 13న ఆర్‌టీఐ కింద దరఖాస్తు చేశారు. కాగా బాత్రా దరఖాస్తును ఎస్‌బీఐ తిరస్కరించింది. సమాచారహక్కు చట్టంలోని రెండు క్లాజులు సెక్షన్ 8(1)(ఇ), సెక్షన్ 8(1) (జే)ను ప్రస్తావిస్తూ... విశ్వసనీయ సమాచారం, వ్యక్తిగత వివరాలు ఉన్న కారణంగా తాము దరఖాస్తును తిరస్కరిస్తున్నట్లు ఎస్‌బీఐ పేర్కొంది. ఎన్నికల బాండ్ల విషయంలో ఎస్‌బీఐ తరపున సుప్రీంకోర్టులో వాదించిన సీనియర్ న్యాయవాది హరీశ్ సాల్వేకు ఫీజు రూపంలో ఎంత చెల్లించారన్న వివరాలు సైతం వెల్లడించాలని బాత్రా కోరినప్పటికీ ఆ వివరాలనూ సమర్పించేందుకు ఎస్‌బీఐ నిరాకరించింది. ఈసీ వెబ్‌సైట్‌లో ఉన్న వివరాలను ఇవ్వడానికి ఎస్‌బీఐ తిరస్కరించడం విచిత్రంగా ఉందంటూ బాత్రా పేర్కొన్నారు. ప్రజల పన్నులతో ఫీజు చెల్లించి.. దానికి సంబంధించిన సమాచారం నిరాకరించడాన్ని తప్పుబట్టారు.

ఇద్దరు బీజేడీ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు

భువనేశ్వర్: ఫిరాయింపుల నిరోధక చట్టం కింద ఒడిశా అసెంబ్లీ స్పీకర్ ప్రమీలా మల్లిక్ ఇద్దరు అధికార బీజేడీ ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించారు. బీజేడీ శాసనసభ్యులు - అరబింద ధాలి, ప్రేమానంద నాయక్ - ఇటీవల బీజేడీకి రాజీనామా చేసి ప్రతిపక్ష బీజేపీలో చేరిన సంగతి విదితమే. ఇద్దరు సభ్యులపై అనర్హత వేటు వేయడంతో వీరిద్దరూ ప్రాతినిధ్యం వహిస్తున్న ఖుర్దా జిల్లాలోని జయదేవ్, కియోంజర్ జిల్లాలోని టెల్కోయ్ అసెంబ్లీ స్థానాలు ఖాళీ అయినట్లు అసెంబ్లీ సెక్రటేరియట్ ఒక ప్రకటనలో తెలిపింది. బీజేడీ నుంచి ప్రాథమిక సభ్యత్వాన్ని స్వచ్ఛందంగా వదులుకున్నందున ఇద్దరు సభ్యులపై అనర్హత వేటు వేయాలని కోరుతూ ప్రభుత్వ చీఫ్‌విప్ ప్రశాంత కుమార్ ముదులి మార్చి 18న స్పీకర్ ముందు పిటిషన్ దాఖలు చేశారు. విచారణకు హాజరు కావాలని స్పీకర్ నోటీసు పంపినప్పటికీ ధాలి, నాయక్‌లు స్పీకర్ ఎదుట హాజరుకాలేదు. కాగా స్పీకర్ అనర్హత వేటు వేసిన నేపథ్యంలో 2024 ఎన్నికలలో తమ ఎన్నికల అవకాశాలపై అనర్హత ఎలాంటి ప్రభావం చూపదని ధాలి, నాయక్‌లు వ్యాఖ్యానించారు. జయదేవ్ అసెంబ్లీ సెగ్మెంట్ నుంచి ధాలి బీజేపీ అభ్యర్థిగా బరిలో ఉండగా, నాయక్ పోటీచేసే నియోజకవర్గం ఇంకా ఖరారు కాలేదు.

మాజీ భర్తకు రూ.10 వేల భరణం ఇవ్వాల్సిందే

ముంబై: అనారోగ్యం కారణంగా ఇంటికే పరిమితమైన మాజీ భర్తకు నెలవారీ భరణం కింద రూ.10 వేలు చెల్లించాల్సిందేనని ఓ మహిళను బాంబే హైకోర్టు ఆదేశించింది. ఇందుకు సంబంధించి కీలక తీర్పు గురువారం వెలువరించింది. హిందూ వివాహ చట్టం నిబంధనల్లో భార్యాభర్తల బంధం ఎంతో పవిత్రమైందని చెబుతారని జస్టిస్ షర్మిలా దేశ్‌ముఖ్‌తో కూడిన సింగిల్ బెంచ్ పేర్కొంది. అంటే కష్టసుఖాల్లో భార్యాభర్తలు ఒకరికొకరు తోడుగా ఉండాలని అర్థమని వివరించింది. వివరాల్లోకి వెళితే... మహారాష్ట్రకు చెందిన ఇద్దరు దంపతులు విడిపోయారు. భర్త అనారోగ్యం కారణంగా బతకడమే కష్టంగా మారింది. తనకు భార్య భరణం చెల్లించాలని కోరుతూ భర్త బాంబే హైకోర్టును ఆశ్రయించాడు. ఈ పిటిషన్‌పై విచారించిన హైకోర్టు... తన మాజీ భర్త అనారోగ్యం కారణంగా జీవనోపాధి పొందే స్థితిలో లేదనే విషయాన్ని మహిళ గుర్తించడం లేదని హైకోర్టు తన ఉత్తర్వుల్లో పేర్కొంది. భర్త తనను తాను పోషించుకోలేక పోతున్నందున ఉద్యోగం చేస్తున్న భార్య భరణం చెల్లించాల్సి ఉంటుందని హైకోర్టు స్పష్టం చేసింది. తన మాజీ భర్తకు నెలవారీ భరణం కింద రూ.10 వేలు చెల్లించాలని సివిల్ కోర్టు 2020 మార్చిలో ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులను సవాలు చేస్తూ ఆ మహిళ దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేస్తూ ధర్మాసనం గురువారం తీర్పు వెలువరించింది. కుటుంబ న్యాయస్థానం దంపతులకు విడాకులు మంజూరు చేయడంతోపాటు తన మాజీ భార్య నుంచి నెలవారీ భరణం కోరుతూ భర్త దాఖలు చేసిన పిటిషన్‌ను స్వీకరించింది. అనారోగ్యం కారణంగా తాను పని చేయలేకపోతున్నానని, అందువల్ల బ్యాంక్ మేనేజర్‌గా ఉద్యోగం చేస్తున్న తన మాజీ భార్య నుంచి భరణం పొందడానికి అర్హుడని బాధితుడు పేర్కొన్నారు. ఇప్పటికే గృహ రుణం చెల్లించడంతోపాటు ఇద్దరు పిల్లల పెంపకం బాధ్యతలు ఉన్నందున మాజీ భర్తకు భరణం చెల్లించే స్థితిలో లేనని ఆమె కోర్టులో వాదించింది.

ప్రధాని కోసం విమానం దారి మళ్లింపు

లాహోర్: పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ దిగడం కోసం విమానాన్ని దారి మళ్లించడంతో వందలమంది ప్రయాణికులు అవస్థలు పడ్డారు. ఆర్థిక ఇబ్బందుల దృష్ట్యా పాక్ సర్కారు... ఖర్చులు తగ్గించుకోవడంపై దృష్టి పెట్టింది. ఇందులో భాగంగానే ప్రధాని కూడా సామాన్య ప్రయాణికుల విమానంలోనే ప్రయాణిస్తున్నారు. ఇటీవల షెహబాజ్ సౌదీ అరేబియా పర్యటనకు వెళ్లారు. పర్యటన ముగించుకుని తిరిగి వస్తుండగా... ప్రధాని దిగడం కోసం ఇస్లామాబాద్ వెళ్లాల్సిన విమానాన్ని లాహోర్ వైపు దారి మళ్లించినట్లు పాక్ మీడియా కథనాలు పేర్కొన్నాయి. జెడ్డా నుంచి ఇస్లామాబాద్ వెళ్లే విమానంలో ప్రధాని, ఆయన బృందం ప్రయాణించింది. వీరితో పాటు విమానంలో మొత్తం 393 మంది ప్రయాణికులున్నారు. వాస్తవానికి ఈ విమానం సోమవారం రాత్రి 10.30 గంటలకు ఇస్లామాబాద్‌లో దిగాల్సిఉంది. అయితే, దాన్ని దారి మళ్లించడంతో రాత్రి 9.25 గంటలకే విమానం లాహోర్ విమానాశ్రయంలో దిగింది. అనంతరం రాత్రి 11.17 గంటలకు విమానం అసలైన గమ్యస్థానానికి చేరుకుంది.

వరికోత మిషన్‌తో బోల్తా పడిన లారీ

సిద్దినేని వరలక్ష్మి, మాది కృష్ణాజిల్లా పెడన స్వగ్రామం వేము వరికోత మిషన్ Gam Harvestor ని లారీ (నెం. AP 16 TA 6313) మీద ఎక్కించుకొని Gam Show Room నుండి తాడేపల్లిగూడెం, అప్పారావుపేట, పశ్చిమగోదావరి జిల్లాకి వరికోత నిమిత్తం వెళుతూ ఉండగా రోడ్డు మీద తూము విరిగి అప్పారావు పేట అనే ఊరు దగ్గర ప్రక్కన ఉన్న కాల్వలోకి లారీ, వరికోత మిషన్ రెండూ పడిపోయినాయి.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.

తగ్గిపోతున్న సభాకాలం

ప్రజా ప్రాతినిధ్యం ఆధారితంగా ఉండే ప్రజాస్వామ్య వ్యవస్థలో పార్లమెంట్ సమావేశాలకు చాలా ప్రాధాన్యత ఉంటుంది. చర్చలకు, సంవాదాలకు పార్లేమెంటే వేదిక. విధానాల రూపకల్పన, చట్టాల రూపకల్పన పార్లమెంటులో నిర్వహించే కార్యక్రమాలే. ప్రజా ప్రతినిధులను ఎన్నుకున్న నియోజకవర్గాల సమస్యలు చర్చకు వచ్చేదీ చట్టసభల్లోనే. సభా సమయం చాలా విలువైంది. అందుకే అర్థవంతంగా సమయాన్ని వినియోగించుకోవాలి. ప్రయోజనకరమైన, సమగ్రమైన చర్చలు జరిగితే ప్రజోపయోగంగా ఉంటుంది. కొన్ని దశాబ్దాలుగా మన పార్లమెంట్ సమావేశాలు క్రమంగా కుంచించుకు పోతున్నాయి. రాష్ట్ర స్థాయి చట్టసభల్లోనూ ఇదే పరిస్థితి ఉంది.



సాధారణంగా మన పార్లమెంటు మూడు విడతలుగా సమావేశం అవుతుంది. ఏడాది ఆరంభంలో జనవరి ఆఖరులోనో, ఫిబ్రవరిలోనో జరిగే సమావేశాలను బడ్జెట్ సమావేశాలు అంటాం. ఇవి కాస్త ఎక్కువ రోజులు జరుగుతాయి. తరవాత జూన్, జులై నెలల్లో వర్షాకాల సమావేశాలు, నవంబర్, డిసెంబర్ నెలల్లో శీతాకాల సమావేశాలు జరుగుతాయి. పార్లమెంటు రెండు సమావేశాల మధ్యలో ఆరు నెలలకన్నా ఎక్కువ గడువు ఉండకూడదన్న నియమం ఉంది. అయితే ఏ సమావేశాలు ఎంత కాలం జరగాలి, ఎన్ని రోజులు నిర్వహించాలి అన్న విషయంలో నిర్దిష్ట నియమాలేమీ లేవు. బడ్జెట్‌కు చట్ట సభల ఆమోదం ఆర్థిక సంవత్సరం ముగిసే ఆఖరు రోజు అయిన మార్చి 31లోగా కచ్చితంగా జరగాలి. లేకపోతే ఖజానాలో ఎంత డబ్బు ఉన్నా ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా వాడుకోవడానికి వీలుండదు.

రాను రాను మన పార్లమెంట్ సమావేశమవుతున్న రోజులు తగ్గిపోతున్నాయి. సమావేశం అయిన రోజుల్లో కూడా సవ్యంగా సమావేశాలు జరుగుతున్న సందర్భాలూ క్షీణిస్తున్నాయి. అంటే చర్చలు, సమగ్ర చర్చ తరవాత చట్టాల ఆమోదం కూడా సంతృప్తికరమైన రీతిలో జరగడం లేదు. రాజ్యవ్యవస్థ సజావుగా సాగాలంటే చట్టసభల వ్యవస్థ సవ్యంగా కొనసాగాలి. అంటే చట్టసభల సమావేశాలు ఎన్ని ఎక్కువ రోజులు జరిగితే అంత మంచిది. సమావేశం అయినప్పుడు చర్చలు, సంవాదాలు, విధాన నిర్ణయాలు, శాసనాల రూపకల్పన రాజ్య వ్యవస్థ నిర్వహణకు ఉపయుక్తంగా ఉంటుంది.

పార్లమెంట్ సమావేశమయ్యే కాలం 1952-1957 తరవాత క్రమంగా తగ్గుతూ వచ్చింది. ఈ తగ్గుదల సమావేశమయ్యే రోజులకే పరిమితం కాలేదు. పని వేళలు మాత్రమే తగ్గలేదు. చర్చల నాణ్యత కూడా నానాటికీ తీసికట్టుగా తయారవుతోంది. సమావేశాల కాలం తగ్గిపోవడం, చర్చల్లో నాణ్యత దిగజారడం, తరచుగా ఆటంకాలు కలగడంవల్ల చట్టాల్లో నాణ్యత లోపించడమే కాక చాలా వరకు సరైన చర్చే లేకుండా బడ్జెట్ కూడా ఆమోదించేస్తున్నారు.

17వ పార్లమెంట్ సమావేశాలలో ఒక విడత వరసగా అయిదు రోజులు విఘాతం కలిగింది. పార్లమెంట్‌లో గొడవలు, అవాంతరాలు మామూలు అయిపోయినందువల్ల అది ఎవరికీ ఆశ్చర్యం కలిగించడం లేదు. కానీ చట్టసభల మీద విశ్వాసం మాత్రం తగ్గుతోంది. 2011లో రాజ్యసభలో బీజేపీ పక్ష నాయకుడు అరుణ్ జైట్లీ ఏకంగా "పార్లమెంటుకు అవాంతరం కలిగించడం ప్రజాస్వామ్య విరుద్ధమైంది కాదు" అనేశారు. ఆ మరుసటి సంవత్సరం లోక్‌సభలో బీజేపీ పక్ష నాయకురాలు "పార్లమెంట్ పని చేయకుండా చేయడం కూడా ఒక రకమైన ప్రజాస్వామ్యమే" అన్నారు. బీజేపీ నాయకులు ఈ మాటలన్నది వారు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు. కానీ ఇప్పుడు అధికార పక్ష సభ్యులే పార్లమెంట్ కార్యకలాపాలను అడ్డుకునే కొత్త సంప్రదాయం వచ్చింది.

గౌతం అదానీ గురించి న్యూ యార్క్ లోని హిండెంబర్గ్ పరిశోధనా సంస్థ కళ్లు చెదిరే విషయాలు బయట పెట్టినప్పుడు ప్రతిపక్షాలు పార్లమెంట్ సమావేశాలకు అడ్డు తగులుతాయని గుర్తించిన బీజేపీ పక్షం తామే అడ్డు తగలడం అనే కొత్త విధానం అనుసరించడం ఆశ్చర్యకరం. రాహుల్ గాంధీ విదేశాలకెళ్లి మన ప్రజాస్వామ్యాన్ని అవహేళన చేశారని, ఆయన క్షమాపణ చెప్పాలని బీజేపీ సభ్యులు పెద్ద రగడ సృష్టించారు. పార్లమెంటు సమావేశాలు మొదలు కావడానికి ముందే ప్రధానమంత్రి మోదీ స్వయంగా ఈ వివాదానికి తెర లేపారు. రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పే దాకా సభ సాగనివ్వబోమని యాగీ చేశారు. రాహుల్ గాంధీని సభ నుంచి బహిష్కరించాలని పట్టుబట్టారు. అధికార పక్షం ప్రతిపక్షాల గొంతు నులిమేస్తోంది అన్న రాహుల్ విమర్శను బీజేపీ ఏమాత్రం సహించలేక పోయింది. ప్రతిపక్షాల సభ్యులకు అసలు మాట్లాడే అవకాశమే ఇవ్వకపోవడం, ఇచ్చిన సందర్భంలో కూడా వారి మైకులు పని చేయకుండా నిలిపివేయడం, వారి ప్రసంగాలలోని సుదీర్ఘ భాగాలను రికార్డుల నుంచి తొలగించడం 17వ లోకసభలోనే చూశాం.

పార్లమెంట్ సెషన్స్ సిట్టింగ్స్

(1 నుంచి 16వ లోక్‌సభ)

లోక్‌సభ	కాలపరిమితి	జరిగిన సమావేశాలు	జరిగిన రోజులు
1st	1952-57	14	677
2nd	1957-62	16	567
3rd	1962-67	16	578
4th	1967-70	12	467
5th	1971-77	18	613
6th	1977-79	09	267
7th	1980-84	15	464
8th	1985-89	14	485
9th	1989-91	07	109
10th	1991-96	16	423
11th	1996-97	06	125
12th	1998-99	04	88
13th	1999-2004	14	235
14th	2004-2009	15	332
15th	2009-2014	15	356
16th	Since 2014	15*	151

* as on 03.08.2018

సభ సజావుగా జరిగేట్టు చూడడం అధికారపక్ష బాధ్యత. కానీ అధికార పక్షమే పనికి మాలిన అంశాలను లేవనెత్తి గలభా సృష్టించడం మోదీ పాలనలో పరిపాటి అయింది. ఎంత పనికిమాలిని విషయాలను లేవనెత్తారు అనడానికి ఒక్క ఉదాహరణ చాలు. కాంగ్రెస్ పక్ష నాయకుడు అధీర్ రంజన్ చౌదరి రాష్ట్రపతి ముర్మును రాష్ట్రపతి అనకుండా రాష్ట్రపత్ని అన్నారు. పతి అన్న మాటకు అర్థం ఏమైనా మహిళలు ఆ పదవిలో ఉన్నప్పుడు వారిని కూడా రాష్ట్రపతి అనే సంప్రదాయం ప్రతిభా పాటిల్ రాష్ట్రపతి అయినప్పటి నుంచే కొనసాగుతోంది. అదే సమావేశాలలో రాజ్యసభ నుంచి 27 మంది ప్రతిపక్ష నాయకులను, లోక్‌సభ నుంచి నలుగురిని సస్పెండ్ చేయడం కొత్త ధోరణే. 2006 నుంచి 2014వరకు 51 మంది ఎంపీలను సస్పెండ్ చేస్తే 2015 నుంచి 2022 మధ్య మొత్తం 139 మంది ఎంపీలను సస్పెండ్ చేశారు. దీనితో సభా కార్యకలాపాలకు ఆటంకం కలిగించడం మరింత పెరిగింది. తమకు ఇబ్బందికరమైన అంశాలు ప్రస్తావనకు వచ్చినప్పుడల్లా అధికార పక్షం సభకు ఆటంకం కలిగించడం మామూలు అయిపోయింది.

సభకు అంతరాయం కలగడంవల్ల పని వేళలు తగ్గడమే కాక ప్రజా ప్రతినిధులు జనం సమస్యలను లేవనెత్తే అవకాశం లేకుండా పోతోంది. ఇది రెండు దుష్పరిణామాలకు దారి తీస్తోంది. ఒకటి సమగ్ర చర్చ లేకుండానే ప్రతిపక్షాలవారు సభలో లేకుండా చేసి బిల్లులు ఆమోదించే దుష్ట సంప్రదాయం మొదలైంది. రెండవది బిల్లులని కూలంకశంగా పరిశీలించడానికి స్థాయి సంఘాలకు పంపడం మోదీ హయాంలో విపరీతంగా తగ్గింది. 17వ లోక్‌సభ మొదటి రెండున్నర సంవత్సరాల కాలంలో 35 శాతం బిల్లులు అరగంటలోనే ఆమోదించేశారు. యూపీఏ మొదటి సారి అధికారంలో ఉన్నప్పుడు 2008లో 16 బిల్లులను 20 నిముషాల్లో ఆమోదించేశారు. వీటిలో అసలు చర్చే జరగని బిల్లులే అధికం. 1952 నుంచి 1970 దాకా సగటున 121 రోజులు సమావేశమైతే అది 2000 సంవత్సరంలో 68కి పడిపోయింది. 2022లో పార్లమెంటు కేవలం 56 రోజులే సమావేశమైంది. మోదీ రెండో సారి అధికారంలోకి వచ్చిన తరువాత నిర్దేశించిన సమయంలో 25 శాతం కూడా సభ జరగలేదు. అనేక బిల్లులను ఏ చర్చా లేకుండానే నిముషాల్లో ఆమోదించామనిపించారు. అలాగే రాజ్య సభలో కూడా తొమ్మిది బిల్లులను 17 నిముషాల్లో మమ అనిపించారు. 17వ పార్లమెంట్ సమావేశాలు 55 రోజులే జరగడం కొస మెరుపు.

170 సార్లు పరాజయం

ఎన్నికల్లో పోటీ చేసిన ప్రతిసారి ఓడిపోయిన అభ్యర్థిగా లిమ్కా బుక్ ఆఫ్ రికార్డును సాధించాడో తమిళ తంబి. సేలం ప్రాంతానికి చెందిన డాక్టర్ కె.పద్మరాజన్ ఇప్పటికి 170 సార్లు పోటీ చేశాడు. ఏ ఎన్నికల్లోనూ విజయం దరిదాపులకు రాలేదు. మన్మోహన్ సింగ్, అటల్ బిహారీ వాజ్‌పేయి, ప్రణబ్ ముఖర్జీ, జయలలిత, ఎం.కరుణానిధిపైనా పోటీ చేశారు. ప్రజలు తిరస్కరిస్తున్నా ఏ మాత్రం సిగ్గు పడకుండా ఎన్నికల్లో పోటీ చేస్తున్న పద్మరాజన్‌ను లిమ్కా బుక్ ఆఫ్ రికార్డు గుర్తించింది. అత్యధిక పరాజితుడిగా ఆయనకు ఓ పేజీ కేటాయించింది.

స్వతంత్ర భారత తొలి ఓటరు ఆయనే...

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత తొలిసారి ఓటు హక్కును వినియోగించుకున్న వ్యక్తిగా శ్యామ్ శరణ్ నేగీ రికార్డులకెక్కారు. హిమాచల్ ప్రదేశ్‌లోని కిన్నౌర్ జిల్లా కల్పా గ్రామానికి చెందిన నేగీ 105 ఏళ్ల వయస్సులో 2022 నవంబరు 5న మృతి చెందే వరకు ప్రతి ఎన్నికలలోనూ మొట్టమొదటిగా ఓటు వేసేందుకు ఆసక్తిని కనబర్చేవారు. 2022 వరకు నేగీ 34 సార్లు తన ఓటుహక్కు వినియోగించుకున్నారు. 1951లో జరిగిన తొలి లోక్‌సభ ఎన్నికల్లో మొదటి ఓటు వేసిన నాటి నుంచి నేటి వరకు ప్రతి ఎన్నికల్లోనూ క్రమం తప్పకుండా ఓటు వేస్తూ ఆదర్శంగా నిలిచారు. 2007 వరకు నేగీ గురించి ఎవ్వరికీ పెద్దగా తెలియదు. అదే ఏడాది జులైలో నాటి ఐఏఎస్ అధికారి, మనీశా నందా ఆయన గురించి మొదట తెలుసుకున్నారు. మనీశా మాట్లాడుతూ 'తొలి ఎన్నికల్లో దేశంలోని మిగతా ప్రాంతాల కంటే కిన్నౌర్‌లో మొదట పోలింగ్ జరిగింది. అందుకే కిన్నౌర్‌పై ముందు నుంచే నాకు ప్రత్యేక ఆసక్తి ఉండేది. ఓ రోజు 90 ఏళ్లు పైబడిన ఓటర్ల జాబితా చూస్తుంటే నేగీ వయసు దగ్గర నా దృష్టి ఆగింది. అప్పుడు ఆయనకు 92 ఏళ్లు. ఆయన వివరాలను తెలుగుసుకోవాలని ఎన్నికల అధికారులను కోరాను' అని తెలిపారు. కిన్నౌర్ డిప్యూటీ కమిషనర్ ఎం.సుధాదేవి.. నేగీని కలిసేందుకు కల్పా గ్రామానికి వెళ్లారు. తొలి ఎన్నికల్లో మొదటి ఓటు తానే వేశానని, హిమపాతం కారణంగా ప్రభుత్వం కిన్నౌర్‌లో మొదట పోలింగ్ నిర్వహించిందని నేగీ ఆమెకు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఆయనకు తొలి ఎన్నికల్లో ఎన్నికల విధులకు కేటాయించారు. దీంతో ముందు తాను ఓటు వేసి, తనకు డ్యూటీ వేసిన ప్రాంతానికి వెళ్తానని ఆయన ఎన్నికల అధికారులను కోరడంతో వారు అందుకు సమ్మతించారు. ఆ విధంగా ఆయన మొదటి ఓటు వేశారని నేగీ కుమారుడు తెలిపారు. ఈ విషయాన్ని నందాకు సుధాదేవి తెలిపారు. 'నాలుగు నెలల రికార్డులన్నీ పరిశీలించాం. ఢిల్లీలోని ఎన్నికల సంఘం కూడా రికార్డులన్నీ పరిశీలించింది. తొలి ఓటరును గుర్తించడం నాకు పీహెచ్‌డీ చేసినంత పనైంది' అని నందా అన్నారు. 2010లో నాటి కేంద్ర ఎన్నికల ప్రధానాధికారి నవీన్ చావ్లా... నేగీ స్వగ్రామానికి వచ్చి ఆయనను సత్కరించారు. 2014లో గూగుల్ సంస్థ ఓటు హక్కుపై ప్రచారం కల్పించేందుకు నేగీతో ఓ ప్రచార వీడియో రూపొందించింది. ప్రముఖ బాలీవుడ్ నటులు అమితాబ్ బచ్చన్, దియా మిర్జా, అర్జున్ రాంపాల్, క్రికెటర్ వీరేంద్ర సెహ్వాగ్‌లతో రూపొందించిన వీడియో కంటే నేగీ వీడియోకే ఎక్కువ వ్యూస్ రావడం విశేషం.

కేరళ నుంచి పదకొండు మందే మహిళలు

కేరళ జనాభాలో స్త్రీల సంఖ్య పురుషుల కన్నా అధికమైనా పాలనా, నూరుశాతం అక్షరాస్యత సాధించినా, మహిళా సాధికారతకు అనేక చర్యలు చేపడుతున్నా పగ్గాలు చేపట్టడంలో వారు బాగా వెనుకబడి ఉన్నారు. మొట్టమొదటి సార్వత్రిక ఎన్నికల నుంచి ఇప్పటి వరకు లోక్‌సభలో అడుగుపెట్టిన కేరళ మహిళలు కేవలం పదకొండు మంది మాత్రమే అంటే ఆశ్చర్యం కలగకపోదు. 1951 ఎన్నికలలో అన్నీ మాస్కేరినా తిరువనంతపురం లోక్‌సభ స్థానం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. కేరళ రాష్ట్రంగా ఏర్పడి 67ఏళ్లు దాటింది. ఇంత వరకు కాంగ్రెసు పార్టీ కేవలం ఇద్దరు మహిళను మాత్రమే పార్లమెంటుకు పంపగలిగింది. అందులో ఒకరు సావిత్రి లక్ష్మణన్ 1989, 91లో జరిగిన ఎన్నికల్లో ఆమె ముకుందాపురం నియోజకవర్గం నుంచి విజయం సాధించారు. మహిళల సంఖ్యాబలం పెరిగింది కమ్యూనిస్టుల ఆధ్వర్యంలోనే. మొత్తం పదకొండు మందిలో మిగిలిన తొమ్మిది మందిలో ఎనిమిది మంది కమ్యూనిస్టు పార్టీవారే కావడం విశేషం.

తొలిసారి అన్నీ మాస్కెరినా స్వతంత్ర అభ్యర్థిగా నిలిచినపుడు కాకలు తీరిన యోధుడు టికె నారాయణన్ మీద 68,117 ఓట్ల మెజార్టీతో ఘనవిజయం సాధించారు. అయితే ఆ తర్వాత 1957లో జరిగిన ఎన్నికల్లో ఆవిడ ఓటమి చెందారు. ఓటింగులో ఆమె 18,741 ఓట్లు మాత్రమే పొంది నాల్గవ స్థానంలో నిలిచారు. మళ్లీ దశాబ్దం వరకు మహిళా ప్రాతినిధ్యం లేదు.

సుశీలా గోపాలన్

ఏకే ప్రేమజం

సీఎస్ సుజాత

ఆ తర్వాత మళ్లీ మార్క్సిస్టు పార్టీ అభ్యర్థిగా సుశీలా గోపాలన్ 1967లో జరిగిన ఎన్నికల్లో అలప్పూజ పార్లమెంటరీ నియోజకవర్గం నుంచి కాంగ్రెసు అభ్యర్థి పిఎస్ కార్తికేయన్ ను 50,297 ఓట్ల మెజార్టీతో ఓడించి సంచలనం సృష్టించారు. 1971 ఎన్నికలలో ఆదూరు రిజర్వుడు నియోజకవర్గంలో ఉభయ కమ్యూనిస్టు పార్టీలు ఒకదానితో ఒకటి తలపడ్డాయి. సీపీఐ అభ్యర్థిని కె. భార్గవి తన సమీప సీపీఎం అభ్యర్థి పీకే కుంజచన్‌ని లక్షా ఎనిమిది వేల 897ఓట్ల తేడాతో ఓడించారు. ఆ తర్వాత సుశీలా గోపాల అలప్పూజ నియోజకవర్గం నుంచి తన ప్రత్యర్థి ఓమనా పిళ్లైని లక్షా 14వేల 64ఓట్ల ఆధిక్యతతో ఓటమి పాలేశారు. ఆ తర్వాత ఆమె చిరయనీజు నుంచి పోటీచేసి ప్రత్యర్థి తాలెక్కున్నిల్ బషీర్‌ను 1106 ఓట్ల స్వల్ప తేడాతో ఓడించారు.

1998లో సీపీఎం అభ్యర్థి ఏకే ప్రేమజం అప్పటి బడగర నేటి వదకర నియోజక వర్గం నుంచి తన ప్రత్యర్థి కాంగ్రెసు పార్టీకి చెందిన పీఎం సురేశ్‌బాబును 59,161 ఓట్ల ఆధిక్యంతో ఓడించారు. 1999లో కూడా అదే ప్రత్యర్థితో తలపడి ఓడించి పార్లమెంటులో తిరిగి అడుగు పెట్టారు. 2004లో ఆమె సహచరి పి.సతీదేవి కూడా కాంగ్రెసు అభ్యర్థి ఎంటి పద్మపై లక్షా 30వేల 589 ఓట్ల ఆధిక్యంతో నెగ్గారు. మరో సీపీఎం అభ్యర్థి సీఎస్ సుజాత మావెలిక్కర నియోజకవర్గం నుంచి కాంగ్రెసు అభ్యర్థి రమేష్ చెన్నితాలను ఏడువేల 414 ఓట్ల మెజార్టీతో ఓడించారు. ఈ విధంగా కేరళలో మహిళా ప్రాతినిధ్యం మెల్లగా పెరుగుతూ వచ్చింది. 2009 ఎన్నికల నాటికిది 15మందికి చేరింది. అయితే దీనికన్నా విపరీతంగా పురుషుల అభ్యర్థిత్వం కూడా పెరిగింది. 1951లో 41 మంది పురుషులకు ఒక్కరే మహిళా అభ్యర్థి అయితే అది 2009లో 217 మంది పురుషులకు 15 మంది అయ్యారు. 2014లో 11.23 శాతం (543 మందికి 61 మంది) ఎన్నికకాగా, అందులో కేరళ నుంచి 5 శాతం అంటే కేవలం ఒకే ఒక మహిళ ఎన్నికయ్యారు. 2009లో 543 సీట్లకు 59 మంది అంటే 10.86 శాతం మంది ఎన్నికయ్యారు. అయితే, ఆ ఎన్నికలలో కేరళ నుంచి ఒక్క మహిళ కూడా ఎన్నికకాలేదు.

తమ సిద్ధాంతాన్ని హడావుడిగా రుద్దాలన్న తొందరలో ఆర్.ఎస్.ఎస్. పథకం వల్ల సాయుధ దళాల విలక్షణ పద్ధతికే చావు దెబ్బ తగిలింది. సైనిక పాఠశాలల్లో ఆర్.ఎస్.ఎస్. సైద్ధాంతిక కోణంతో బోధన సాగితే సమ్మిళిత సంస్కృతికి విఘాతం కలుగడమే కాక జాతి స్వభావమే మారిపోతుంది."

\- మల్లికార్జున ఖర్గే,
కాంగ్రెస్ అధ్యక్షులు

తొలి ఎన్నికల్లో కమ్యూనిస్టుల ప్రభంజనం

▸ ఆంధ్రాలో 41స్థానాలతో సీపీఐ ముందంజ ▸ భారీ మెజార్టీతో ఘన విజయం

▸ కాంగ్రెస్ పార్టీ 40స్థానాలకే పరిమితం ▸ 1955, 62 ఎన్నికల్లోనూ కొనసాగిన హవా

స్వాతంత్ర్యం అనంతరం దేశవ్యాప్తంగా 1952లో జరిగిన తొలి సార్వత్రిక ఎన్నికల్లో భారత కమ్యూనిస్టుపార్టీ ఆంధ్రాలో జన ప్రభంజనం సృష్టించింది. ఈ ఎన్నికల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ కంటే సీపీఐకే అత్యధిక సీట్లు లభించడం విశేషం. మరికొన్ని సీట్లు అతి తక్కువ ఓట్ల తేడాతో చేజార్చుకోగా, గెలిచిన స్థానాల్లో మాత్రం కమ్యూనిస్టుపార్టీ అభ్యర్థులందరూ దాదాపు భారీ మెజార్టీతో విజయదుందుబి మ్రోగించారు. ఈ ఎన్నికలు జరిగే సమయానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఇంకా ఏర్పడలేదు. శ్రీకాకుళం జిల్లా నుంచి కర్నూలు జిల్లా వరకు ఉన్న ప్రాంతమంతా సంయుక్త మదరాసు రాష్ట్రంలో భాగంగా ఉండేది. కర్నాటక, మహారాష్ట్రల్లోని కొన్ని ప్రాంతాలతో కలిపి తెలంగాణ అంతా హైదరాబాద్ రాష్ట్రంలో ఉండేది. ఈ రెండు రాష్ట్రాలకు వేర్వేరుగా ఎన్నికలు జరిగాయి. 1952కి ముందు తీవ్రమైన నిర్బంధకాండకు గురైన కమ్యూనిస్టుపార్టీ అధికారం కోసం పాకులాడుతున్న కాంగ్రెస్‌ను గట్టిగా ఢీకొట్టింది. మెజార్టీ నియోజకవర్గాల్లో నువ్వా, నేనా ? అన్నట్లు కాంగ్రెస్,కమ్యూనిస్టుపార్టీ మధ్య జరిగిన హోరాహోరీ పోరులో సీపీఐ ప్రథమస్థానంలో నిలిచింది. భారత కమ్యూనిస్టుపార్టీ అభ్యర్థులు 41 స్థానాల్లో విజయ ఢంకా మోగించగా, కాంగ్రెస్ పార్టీ 40 సీట్లకే పరిమితమైంది. ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు టంగుటూరి ప్రకాశం పంతులు నేతృత్వంలోని కిసాన్ మజ్దూర్ ప్రజా పార్టీ (కేఎంపీపీ)కి 20 స్థానాలు, రైతు నేత ఎన్జీ రంగా ఆధ్వర్యంలోని కృషికార్ లోక్‌పార్టీ (కేఎల్‌పీ)కి 15 స్థానాలు దక్కాయి. ఈ ఎన్నికల్లో కమ్యూనిస్టుపార్టీ ప్రభంజనానికి కాంగ్రెస్ యోధులు నీలం సంజీవరెడ్డి, బెజవాడ గోపాలరెడ్డి, అల్లూరి సత్యనారాయణ రాజు, కల్లూరి చంద్రమౌళి వంటి హేమా హేమీలు సైతం పరాజితులయ్యారు. అయితే కాంగ్రెస్ పార్టీ తెలివిగా కిసాన్ మజ్దూర్ ప్రజాపార్టీ అధినేతను తమవైపు తిప్పుకుని ఆయనను ముఖ్యమంత్రిని చేసి ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

అనంతరం పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ ఫలితంగా కోస్తా, రాయలసీమ జిల్లాలతో కల్సి ఆంధ్ర రాష్ట్రం ఆవిర్భవించగా, 1955లో మధ్యంతర ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో సీపీఐ అధికారంలోకి రావడం ఖాయమని పెద్దఎత్తున ప్రజల్లో ప్రచారం జోరుగా సాగింది. ప్రజల నాడిని గమనించిన కాంగ్రెస్ పార్టీ సింగిల్‌గా పోటీ చేస్తే కమ్యూనిస్టుపార్టీని ఎదుర్కోలేమని అంచనా వేసింది. దానికనుగుణంగా వ్యూహాత్మకంగా కేఎంపీపీ, కేఎల్‌పీని కలుపుకుని యునైటెడ్ కాంగ్రెస్‌గా ఎన్నికల బరిలోకి దిగింది. దీంతో సహజంగానే 1952 ఎన్నికల్లో 41 స్థానాలు గెల్చుకున్న కమ్యూనిస్టుపార్టీ ఈ ఎన్నికల్లో 15 స్థానాలకే పరిమితం కావాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆ తర్వాత 1956లో ఆంధ్రా, తెలంగాణ కలిసి తొలి భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ఏర్పడింది. అనంతరం 1962లో జరిగిన సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 177 స్థానాల్లో విజయం సాధించగా, కమ్యూనిస్టుపార్టీ 53స్థానాలు సాధించి ప్రతిపక్షపార్టీగా నిలిచింది. ఇలా మూడు సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి గట్టి పోటీ ఇవ్వడమే కాకుండా, అధికారం అంచులదాకా వెళ్లిన కమ్యూనిస్టుపార్టీ... 1964లో పార్టీ చీలిక సమయాన సీపీఐలో 31 మంది, సీపీఎంలో 22 మంది శాసనసభ్యులు మిగిలారు.

ఇక అన్ని పార్టీల కంటే అత్యధిక స్థానాల్లో విజయం సాధించిన 1952 ఎన్నికల్లో గెల్చిన సీపీఐ విజేతలు, వారికి లభించిన ఓట్ల వివరాలిలా ఉన్నాయి.

- విశాలాంధ్ర బ్యూరో- అమరావతి

నియోజకవర్గం	సీపీఐ అభ్యర్థి	సాధించిన ఓట్లు	అభ్యర్థి	పార్టీ	సాధించిన ఓట్లు
గాజువాక	ఎం.వీరభద్రం	7064	జి.జె.రాజు	స్వతంత్ర	4347
అనకాపలి	కె.గోవిందరావు	18,505	వి.వెంకట రమణ	కేఎల్‌పీ	11,883
పిఠాపురం	ఆర్.వి.జగ్గారావు	18,920	ఆర్.ఎ.రావు	కాంగ్రెస్	12,416
కాకినాడ (ద్విసభ్య)	సి.వి.కృష్ణారావు	48,371	పి.రమణమూర్తి	కాంగ్రెస్	22,518
కాకినాడ	కేఎం రావు	42,201	కె.డి.రాజు	కాంగ్రెస్	19,926
రాజోలు (ద్విసభ్య)	ఎ.వెంకట రామరాజు	41,847	ఎ.బుల్లి స్వామి	కేఎంపీపీ	37,296
రాజోలు	జి.నాగేశ్వరరావు	34,688	పి.వెంకట రత్నం	కేఎంపీపీ	27,295
రాజమండ్రి	చిట్టూరి ప్రభాకర్ చౌదరి	18,477	కె.ఎల్.నర్సింహారావు	కాంగ్రెస్	12,247
కొవ్వూరు	పి. శ్రీ రామచంద్రరావు	32,652	ఎ.బాపినీడు	కాంగ్రెస్	25,971
నరసాపురం (ద్విసభ్య)	పి.శ్యాంసుందరరావు	89,523	జి.వెంకన్న	కేఎంపీపీ	28,399
నరసాపురం	బి.లక్ష్మీనరసరాజు	50,847	ఎ.సత్యనారాయణరాజు	కాంగ్రెస్	27,046
ఏలూరు	జి.సత్యనారాయణ	20,545	ఎం.రంగయ్య	కాంగ్రెస్	12,907
చింతలపూడి	ఎం.కూనేరావు	24,003	కేవీఎస్‌పీ రావు	కాంగ్రెస్	16,662
తిరువూరు	పేట రామరావు	34,957	పి. బాపయ్య	కాంగ్రెస్	13,254
గుడివాడ (ద్వి సభ్య)	జి. రామారావు	63,915	ఎమ్. రామదాసు	కాంగ్రెస్	20,165
గుడివాడ	కె. రాజగోపాలరావు	59,382	ఎ. గోపాలకృష్ణయ్య	స్వతంత్ర	25, 446
మచిలీపట్నం	గుండాబత్తుల అంజనేయులు	26,216	ఆర్.ఎ.రామయ్య	కాంగ్రెస్	17,337
అవనిగడ్డ (ద్వి సభ్య)	చంద్ర రామలింగయ్య	46,864	వై.శివరామప్రసాద్	స్వతంత్ర	34, 907
అవనిగడ్డ	గుంటూరు బాపనయ్య	43,849	వి. కూర్మయ్య	కాంగ్రెస్	17, 281
విజయవాడ	తమ్మిన పోతరాజు	17,169	మరుపిళ్ల చిట్టి	కాంగ్రెస్	13, 500
విజయవాడ సెంట్రల్	మైనేని లక్ష్మణస్వామి	27,743	ఇ. రత్నాంబ	కాంగ్రెస్	15, 240
కంచికచర్ల (నందిగామ)	వాసిరెడ్డి రామారావు	24,401	కాకాని వెంకటరత్నం	కాంగ్రెస్	14, 871
జగ్గయ్యపేట	పిల్లలమర్రి వెంకటేశ్వర్లు	29,773	బి. తిరుపతయ్య	కాంగ్రెస్	8,571
మంగళగిరి	డి.లక్ష్మయ్య	31,247	ఐ.గోవిందరావు	కె.ఎల్.పి	13,982
పొన్నూరు	కొల్లా వెంకయ్య	20, 254	సి.లక్ష్మీనారాయణ	కె.ఎల్.పి	11,237
అమృతలూరు (వేమూరు)	జి.జోసెఫ్	16,600	వి.సీతారామయ్య	కాంగ్రెస్	13,717
రేపల్లె	ఎమ్. హనుమంతరావు	29,116	కె.చంద్రమౌళి	కాంగ్రెస్	19,086
బాపట్ల	వేములపల్లి శ్రీకృష్ణ	22,806	ఎన్.వెంకటరాజు	కాంగ్రెస్	20,427
చిలకలూరిపేట	కె.రంగారావు	20,732	బి.నాగయ్య	కాంగ్రెస్	10,260
వినుకొండ	పులుపుల వెంకటశివయ్య	15,354	పి.ఎన్‌చౌదరి	స్వతంత్ర	5,004
పల్నాడు (మాచర్ల)	కె.సుబ్బారెడ్డి	18,748	కాసు బ్రహ్మనందరెడ్డి	కాంగ్రెస్	7,0075
కనిగిరి	గుజ్జుల యలమందారెడ్డి	23,953	దేవిరెడ్డి	కాంగ్రెస్	5,702
పొదిలి (దర్శి)	ఎస్.కాశిరెడ్డి	18,703	ఆర్.మహానంద	కె.ఎల్.పి	7,300
బుచ్చిరెడ్డిపాలెం(కొవ్వూరు)	బి.శంకరయ్య	25,435	బి.శేషురెడ్డి	కాంగ్రెస్	9,284
రాజంపేట	పి.నరసింహారెడ్డి	21,125	బి.ఆర్.సెట్టి	సోషలిస్టు	17,585
కమలాపురం	ఎన్.శివరామిరెడ్డి	24,787	రామలింగారెడ్డి	కాంగ్రెస్	19,483
నందికొట్కూరు	సి.పుల్లారెడ్డి	25, 268	సుబ్బారెడ్డి	కాంగ్రెస్	13,361
ఒంగోలు (ద్వి సభ్య)	కె.మాలకొండయ్య	37,716	కె.కోటయ్య	కె.ఎల్.పి	10,628
ఒంగోలు	ఎమ్.నారాయణస్వామి	33,718	డి.గోపాలశాస్త్రి	స్వతంత్ర	16,533
అనంతపురం	తరిమెల నాగిరెడ్డి	25,266	నీలం సంజీవరెడ్డి	కాంగ్రెస్	13,652
మదనపల్లి	డి.సీతారామయ్య	9,760	జి.శ్రీనివాసరెడ్డి	స్వతంత్ర	8,855

చెయ్యెత్తి జై కొట్టిన వేములపల్లి శ్రీకృష్ణ

ఆదర్శ ప్రతినిధి

"మనసులోని అభిప్రాయాన్ని నిర్మొహమాటంగా చెప్పటం అలవర్చుకోండి. ప్రజల దైనందిన సమస్యలు తెల్సుకుని సాన్నిహిత్యం పెంచుకోండి. చెప్పే మాటలకూ, చేసే పనులకూ దూరం పెరిగే కొద్దీ మీకు ప్రజలు దూరమవుతారు. సిద్ధాంత పరిజ్ఞానంతోపాటు వాస్తవ పరిస్థితుల అధ్యయనం అవసరం."

స్ఫూర్తిదాయక వ్యాఖ్యలు ఎవరివోకావు.. 'చేయ్యెత్తి జైకొట్టు తెలుగోడా! గతమెంతో ఘనకీర్తి గలవోడా" గీతంతో తెలుగుజాతి చైతన్యాన్ని మేల్కొల్పిన ప్రజాకవి వేములపల్లి శ్రీకృష్ణవి.

ఆయన మూడుసార్లు శాసనసభ్యునిగా ఎన్నికై ప్రజాప్రతినిధిగా సేవలందించారు. విస్తృత జీవితానుభవాలతో, రాజకీయ ఉద్యమానుభావాలతోపాటు రాటుదేలిన శ్రీకృష్ణ ఎంతో నిరాడంబరంగా, నిజాయితీగా ఉత్తమ కమ్యూనిస్టుగా తన జీవితాన్ని కొనసాగించి, ఈ తరం సాహితీవేత్తలకూ, ప్రజాప్రతినిధులకు ఆదర్శనీయులుగా నిలిచారు. రేపల్లెలోని బేతపూడిలో మధ్యతరగతి రైతు కుటుంబంలో 1917లో శ్రీకృష్ణ జన్మించారు. హైస్కూలులో బసవపున్నయ్య, మోటూరు హనుమంతరావు, పరంధామయ్య, పమిడిముక్కల లక్ష్మణరావు, కంఠంనేని వెంకటరత్నం ఆయనకు సీనియర్లు. వీరితో పరిచయం, ఆనాటి జాతీయోద్యమం, అతివాద సాహిత్యం వీరిపై తీవ్ర ప్రభావం చూపాయి.

గుంటూరులో బ్రాడీపేటలో చదువుతూ పులుపుల శివయ్య, ప్రభల కృష్ణమూర్తి, ప్రతాప రామసుబ్బయ్య, ఏటుకూరి బలరామమూర్తి, అమరవాది కృష్ణమూర్తితో ఏర్పడిన సంబంధాలతో 1935-36లో పార్టీ అగ్జిలరీ సెల్‌లోకి ప్రవేశించారు. 1938లో పార్టీ సభ్యత్వం పొందారు. చీరాల ఐఎల్‌టీడీ కార్మికుల సమ్మె పోరాటంలో పోలీసు కాల్పులు జరిగాయి. సమ్మెలో ఉన్న కార్మికుల సహాయార్థం కన్యాశుల్కం నాటకం ప్రదర్శించి దాని రాబడినంతా కార్మికులకందించారు. బీఏ పూర్తి చేసి కొంతకాలం బందరులో మ్యూచువల్ ఇన్సూరెన్సు కంపెనీలో ఉద్యోగం చేస్తుండగా, గుంటూరు నుంచి కామ్రేడ్ శివయ్య పిలుపుతో ఉద్యోగం మాని తిరిగి పార్టీ రహస్య యంత్రాంగ నిర్వహణ బాధ్యత చేపట్టారు. 1937లో జరిగిన కొత్తపట్నం రాజకీయ పాఠశాలకు హాజరై, ప్రభుత్వ నిషేధాజ్ఞలను ధిక్కరించి లాఠీఛార్జికి గురైన వారిలో శ్రీకృష్ణ ఒకరు. 1942-43 కాలంలో సోవియట్‌పై దాడిచేసిన హిట్లర్ సైన్యాలను మాస్కో వద్ద రెడ్ ఆర్మీ అటకాయించి తిప్పికొడుతున్న రోజుల్లో 'మాస్కో పొలిమేరల్లోనా' అనే కోలాటం పాట, బెంగాల్ కరవుపై 'బ్రహ్మపట్నం పోదామంటే' అనే పాట, కయ్యూరు వీరులపై పాట మొదలైనవి రాశారు. 1948లో కమ్యూనిస్టు పార్టీ గుంటూరు జిల్లా కార్యదర్శిగా, తరువాత రెండుసార్లు రాష్ట్ర పార్టీ కార్యదర్శివర్గ సభ్యులుగా, రెండుసార్లు జాతీయ సమితి సభ్యులుగా ఎన్నికై, పదవీ బాధ్యతలను సమర్థమంతంగా నిర్వర్తించారు. విశాలాంధ్ర పత్రిక ప్రధాన సంపాదకుడిగా, పెదకాకానిలోని హేమలత టెక్స్‌టైల్ మిల్‌వర్కర్స్ యూనియన్‌కు ఉపాధ్యక్షులుగా పనిచేశారు. 1952లో బాపట్ల నుంచి, 1962, 1972లో మంగళగిరి నుంచి రాష్ట్ర శాసనసభకు ఎన్నికయ్యారు. శాసనసభలో కమ్యూనిస్టుపక్ష నాయకునిగా, పబ్లిక్ ఎకౌంట్స్ కమిటీ చైర్మన్‌గా వ్యవహరించారు. 1964-65లో విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ఉద్యమం సందర్భంగా శాసనసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. సీఆర్ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శిగా పనిచేసి దాన్ని నిర్మించటంలో విశేషమైన కృషి చేశారు. భారత్- సోవియట్ మిత్రమండలి, శాంతి స్నేహ సంఘాల అభివృద్ధికి నిరంతరం పాటుపడ్డారు. 2000 ఏప్రిల్ 8న హైదరాబాద్‌లో శ్రీకృష్ణ కన్నుమూశారు.

అప్పట్లో ఏకగ్రీవాలే...!



మండలి వెంకట కృష్ణారావు



అల్లం కృష్ణయ్య

సార్వత్రిక ఎన్నికల ప్రారంభంలో అత్యధిక నియోజకవర్గాలలో ఏకగ్రీవ ఎన్నికలే ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లా పొందూరు సెగ్మెంట్‌కు 1962లో జరిగిన ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి కె.పున్నయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 1972లో ఈ నియోజకవర్గం రద్దయింది. విజయనగరం జిల్లా గజపతినగరం నియోజకవర్గానికి 1972లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి పెనుమత్స సాంబశివరాజు ఏకగ్రీవమయ్యారు. విజయనగరం సెగ్మెంట్ నుంచి 1953లో ద్విసభకు జరిగిన ఎన్నికల్లో పీఎస్‌పీ అభ్యర్థి పీవీజీరాజు, అదే నియోజకవర్గానికి అదే సంవత్సరం జరిగిన ఉప ఎన్నికలో జి.సూర్యనారాయణ, 1957లో జరిగిన ఉప ఎన్నికలో సోషలిస్టు అభ్యర్థి భాట్టం శ్రీరామమూర్తి ఏకగ్రీవంగా గెలుపొందారు. శృంగవరపు కోట సెగ్మెంట్ నుంచి 1953లో జరిగిన ఉప ఎన్నికలో పీఎస్‌పీ అభ్యర్థి టంగుటూరి ప్రకాశం, 1960లో జరిగిన ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి జీడీనాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విశాఖ జిల్లా గొలుగొండ సెగ్మెంట్ నుంచి 1952లో ద్విసభకు జరిగిన ఎన్నికలో కేఎల్‌పీ అభ్యర్థి కేవీ పడాల్ ఏకగ్రీవమయ్యారు. 1962 తరువాత ఈ నియోజకవర్గం రద్దయింది. తూర్పుగోదావరి జిల్లా అనపర్తి నియోజకవర్గానికి 1972లో జరిగిన ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి వి.రామకృష్ణ చౌదరి ఏకగ్రీవమయ్యారు. తూర్పు గోదావరి జిల్లా రామచంద్రపురం సెగ్మెంట్‌కు 1970లో జరిగిన ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి ఎం.ఎస్.సంజీవరావు ఏకగ్రీవమయ్యారు. తూర్పుగోదావరి జిల్లా బూరుగుపూడి సెగ్మెంట్‌కు 1955లో జరిగిన ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి ఎస్.వెంకటరత్నం ఏకగ్రీవంగా గెలుపొందారు. పశ్చిమ గోదావరి జిల్లా ఉంగుటూరు నియోజకవర్గానికి 1972లో జరిగిన ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి సి.హెచ్.ఎస్.ఆర్.సి.వి.పి.మూర్తిరాజు ఏకగ్రీవంగా గెలుపొందారు. పశ్చిమ గోదావరి జిల్లా దెందులూరులో 1972లో కాంగ్రెస్ అభ్యర్థి ఎం.రామ్మోహనరావు ఏకగ్రీవమయ్యారు. కృష్ణాజిల్లా అవనిగడ్డ నుంచి మాజీ మంత్రి మండలి వెంకట కృష్ణారావు 1972 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నెల్లూరు జిల్లా రాపూరు సెగ్మెంట్‌కు 1968లో జరిగిన ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి ఆనం సంజీవరెడ్డి ఏకగ్రీవంగా గెలుపొందారు. నెల్లూరు జిల్లా వెంకటగిరి నియోజకవర్గానికి 1956లో జరిగిన ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి అల్లం కృష్ణయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కడప జిల్లా మైదుకూరు సెగ్మెంట్‌కు 1972లో జరిగిన ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి ఎస్.పి.నాగిరెడ్డి ఏకగ్రీవంగా గెలుపొందారు. కడప జిల్లా నందికొట్కూరు సెగ్మెంట్‌కు 1972లో జరిగిన ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి మద్దూరు సుబ్బారెడ్డి ఏకగ్రీవమయ్యారు. 2009లో ఈ సెగ్మెంట్ రద్దయింది. కర్నూలు జిల్లా పాణ్యం నియోజకవర్గంలో 1972లో జరిగిన ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి ఇ.అయ్యపురెడ్డి ఏకగ్రీవంగా గెలుపొందారు. కర్నూలు జిల్లా కోయిల కుంట్లలో 1962, 1972లో జరిగిన ఎన్నికల్లో రెండుసార్లూ కాంగ్రెస్ అభ్యర్థి బీవీ సుబ్బారెడ్డి ఏకగ్రీవమయ్యారు. కర్నూలు జిల్లా కోడుమూరులో 1972 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి దామోదరం మునుస్వామి ఏకగ్రీవమయ్యారు. చిత్తూరు జిల్లా తంబళ్లపల్లె సెగ్మెంట్‌లో 1955 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి టీ.ఎన్.వి.రెడ్డి ఏకగ్రీవమయ్యారు. చిత్తూరు సెగ్మెంట్‌లో 1952లో ద్విసభకు జరిగిన ఎన్నికల్లో కేఎల్‌పీ అభ్యర్థి శ్రీరంగం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

మౌన ప్రజాప్రతినిధి

కృష్ణాజిల్లాలో 1971 వరకు మూడు లోక్‌సభ నియోజకవర్గాలు ఉండేవి. అవి మచిలీపట్నం, విజయవాడ, గుడివాడ. 1977లో గుడివాడ నియోజక వర్గం రద్దయింది. ఈ నియోజక వర్గానికి 1962, 1967, 1971లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి మాగంటి అంకినీడు విజయం సాధించారు. 1977లో ఈ నియోజక వర్గం రద్దయిన తరువాత ఆయన మచిలీపట్నం నుంచి 1977, 1980 ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీ తరఫునే ఎన్నికయ్యారు. 1977లో దేశంలో జనతాపార్టీ గాలివీస్తున్నా ఆ ప్రభావం అంకినీడు విజయంపై పడలేదు. పైగా దాదాపు 77 వేల మెజారిటీతో గెలుపొందారు. వరుసగా ఐదుసార్లు లోక్‌సభకు ఎన్నికైన ఆయన ఒక్కసారి కూడా సభలో నోరు విప్పలేదు.